


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-4-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 88 పేజీలు: 8+16 వెల: 6.50



పుట్టినతేదీ ధ్రువీకరణకు ఆధార్ ప్రామాణికం కాదు.. 3

భారీగా పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు

ఉగ్రవాదులకు సాయం చేస్తే **కఠిన చర్యలు** 5
ఎస్‌సిఒ రక్షణమంత్రుల భేటీలో రాజ్‌నాథ్‌సింగ్





సిక్కిం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. 'యాక్ట్ ఈస్ట్' దాటి 'యాక్ట్ ఫాస్ట్'గా చేస్తున్నాం
రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో ప్రధాని

ఈశాన్యం **'భారత్ అష్టలక్ష్మి'** 5

పతనం అంచున ఇరాన్: ట్రంప్ 2






గ్యాంగ్‌టక్‌లో మంగళవారం యువతతో ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని మోదీ

## నాకిష్టం ఫుట్‌బాలాట!

**గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి సరదాగా ప్రధాని ఆటలు**

**ఒలింపిక్స్‌కు భారత ఆతిథ్యమే తమ ఆశయమని వెల్లడి**

2



మంగళవారం ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్‌కు శంకుస్థాపన చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, డిజిపి శివధర్‌రెడ్డి తదితరులు

# సింగపూర్‌లా ఫ్యూచర్‌సిటీ

దక్షిణాదిలోనే అద్భుత రహదారి ఒఆర్ఆర్

భూములిచ్చిన రైతులకు నష్టం రానివ్వం

మూసీనది అభివృద్ధి ఎవరూ ఆపలేరు

**ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనరేట్‌కు శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్**

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** కొత్తగా నిర్మించనున్న ఫ్యూచర్ సిటీ ప్రపంచంలో అగ్ర నగరాలుగా వున్న సింగపూర్, టోక్యో, న్యూ యార్క్ తరహాలో వుంటుందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో ప్రజా ప్రతినిధులందరు భాగస్వాములు కావాలని, అందరు కలిసి ఈ నగరాన్ని వేగంగా అభివృద్ది చేసుకుందామని సిఎం తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరులో ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషన రేట్ నూతన భవనానికి మంగళవారం సాయంత్రం సిఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ ఫ్యూచర్‌సిటీ కచ్చితంగా గొప్ప నగరం అవుతుందని అన్నారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని ఆయన తెలిపారు. ఒకప్పుడు హైదరాబాద్ ఒక్క నగరం మాత్రమే వుండగా ఆ తరువాత సికింద్రాబాద్ ఏర్పాటయ్యిందని 30 ఏళ్ల క్రితం హైటెక్ సిటీ స్థాపించబడిందని సిఎం తెలిపారు. హైటెక్ సిటీని చంద్రబాబునాయుడు, రాజశేఖర్ రెడ్డిలు దూరదృష్టితో అభివృద్ది చేశారని, ఇప్పుడు ఈ ప్రాంతంలో ప్రపంచం లోని అగ్ర ఐటి కంపెనీలు వున్నాయని సిఎం తెలిపారు. హైటెక్ సిటీ ఏర్పాటైన సమయంలో అనేక మంది అవహేళన చేశారని, ఇప్పుడు ఫ్యూ చర్ సిటీని కూడా ఇలాగే చులకనగా చూస్తున్నారని సిఎం తెలిపారు. అయితే హైటెక్ సిటీని మించి ఫ్యూచర్ సిటీ గొప్పగా అభివృద్ది చెందుతు oదని ఆయన చెప్పారు. తెలంగాణకు ఓఆర్ఆర్ తలమానికంగా వుందని, దీని నిర్మాణ సమయంలోనూ కొందరు ఇష్టాను సారం మాట్లాడారని సిఎం తెలిపారు. కానీ ఓఆర్ఆర్ నేడు దక్షిణాదిలోనే అద్భుత రహదారిగా నిలిచిందని ఆయన తెలిపారు. ఇప్పుడు రీజనల్ రింగురోడ్డు రాష్ట్రంలో ఏర్పాటవుతుందని, దీనికోసం అన్ని పనులు పూర్తయ్యాయని సిఎం తెలిపారు. ఈ రహదారి పూర్తయితే

>>2


మే ఆఖరులో మూడో విడత 2
**రైతు భరోసా**


# కొత్త డిజిపిగా సి.వి ఆనంద్

రేపు బాధ్యతలు స్వీకరణ

**ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి**

**రంగారెడ్డి జిల్లా రైతుకుటుంబంలో పుట్టిన ఆనంద్**

**తెలంగాణ రాష్ట్రంలో 7వ డిజిపిగా నియామకం**



**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్ర నూతన డిజిపిగా సి.వి ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. 1991 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన ఆనంద్ ప్రస్తుతం హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వున్నారు. ఈ నెల 30వ తేదీన ప్రస్తుత డిజిపి శివధర్ రెడ్డి పదవీ విరమణ చేస్తుండగా అదే రోజున ఆనంద్ కొత్త డిజిపిగా బాధ్యతలు చేబడ తారు. కాగా ఆనంద్ రాష్ట్ర పోలీసు శాఖలో అందరికంటే సీనియర్ అధికారి కావడం గమనార్హం. రంగారెడ్డి జిల్లా కుంట్లూరుకు చెందిన ఆనంద్ రైతు కుటుంబంలో జన్మించారు. ఒకప్పటి అండర్ 19 టీమిండియా ఆటగాడైన ఆనంద్ క్రికెటర్‌గా వున్న సమయంలోనే యుపిఎస్‌సి పరీక్షలు రాసి పిన్న వయస్సులోనే ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. వరంగల్‌లో ఏఎస్‌పిగా తన కెరీర్‌ను ప్రారంభించిన ఆయన ఆ తరువాత అనేకచోట్ల పని చేశారు. నిజామాబాద్ ఎస్‌పిగా హైదరాబాద్‌లో తూర్పు, మధ్య మండలాలకు డిసిపిగానూ సిఐడి డిఐజిగానూ పనిచేశారు. సిఐడి డిఐజిగా పని చేసిన సమయంలో అప్పట్లో సంచలనం రేపిన కృషి బ్యాంకు ఉదంతంలో వి దేశాలకు పారిపోయినఆ బ్యాంకు ఛైర్మన్ వెంకటేశ్వరరావును

>>2



## నేడే టెన్త్ ఫలితాలు

**విడుదల చేయనున్న కేశవరావు**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 28:** 10వ తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను నేడు(బుధవారం) విడుదల చేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎస్‌సీఈఆర్‌టీ క్యాంపస్‌లో ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు విడుదల చేయనున్నట్టు ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ పివి శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఎస్ఎస్‌సి విద్యార్థులకు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు వార్షిక పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు 5.28లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు రిజిస్టర్ చేసుకోగా వారిలో రెగ్యులర్ విద్యార్థులు 5.17లక్షల మంది, 10 వేల మందికిపైగా సప్లిమెంటరీ విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది నుంచి ఎస్ఎస్‌సి ఫలితాలను వాట్సాప్‌లో కూడా

>>2

## చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద రోడ్లు విస్తరించండి

పార్కింగ్‌ను మెరుగుపరచాలి..

సికిందరాబాద్ స్టేషన్ వద్ద రహదారులు మార్చాలి

సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా అప్రోచ్ రోడ్ల విస్తరించాలని, పార్కింగ్ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖరాశారు. హైదరాబాద్‌నగరంలో నానాటికీ పెరుగుతున్న జనాభా, ప్రయాణికుల రాకపోకల మూలంగా నగరంలోని మూడు ప్రధాన రైల్వేస్టేషన్లు కాచిగూడ, సికింద్రాబాద్, హైదరాబాద్ రైల్వేటర్మినళ్లపై అధిక భారం పడుతున్నది. ఈ సమస్యకు పరిష్కారంగా నగర పరిధిలోని చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద రూ.430 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో కొత్త టెర్మినల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతులమీదుగా 6 జనవరి, 2025న ఈ నూతన టర్మినల్‌ను ప్రారంభించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మీరు కూడా పాల్గొన్న విషయం మీకు గుర్తు ఉండే ఉంటుందన్నారు. కొత్త రైల్వే టర్మినల్‌ను ప్రారంభించుకున్న తరువాత ప్రతి రోజూ కొన్ని పదులసంఖ్యలో రైళ్లు చర్లపల్లి నుంచి సేవలు అందిస్తున్నాయన్నారు. ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. దీనికి అనుగుణంగా రైల్వేస్టేషన్‌కు వెలుపల ఇరువైపులా ప్రయాణికులు, వాహనాలు రైల్వేస్టేషన్‌కు సులభంగా రాకపోకలు సాగించటానికి వీలుగా అప్రోచ్ రోడ్లను విస్తరించవలసిన అవసరం ఉందన్నారు. పార్కింగ్ తదితర అవసరాల కోసం స్టేషన్‌కు ఇరువైపులా అవసరమైన భూసేకరణ పూర్తి చేయవలసి ఉందన్నారు. ఎఫ్‌సిఐ గోడౌన్ రోడ్డు నుండి కొత్తగా నిర్మించిన స్టేషన్ బిల్డింగ్ వైపు 200 అడుగుల వెడల్పుతో రోడ్డును విస్తరించవలసి ఉందన్నారు. భవిష్యత్తులో ఈ రహదారి చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించటానికి ప్రధాన రహదారిగా మారనుందన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఉత్తరం వైపు టెర్మినల్ ను చేరుకోవడానికి ఇప్పుడు ఉన్న రహదారి చాలా ఇరుకుగా ఉంది. ప్రయాణికులు సులభంగా రాకపోకలు సాగించడానికి వీలుగా ఆల్ఫా హోటల్ నుండి రాటిఫైల్ బస్టాండ్ వరకు ఉన్న రహదారిని 120 అడుగుల వెడల్పుతో విస్తరించాలన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అప్రోచ్ రోడ్డు విస్తరణకు అన్ని రకాల సహాయ సహకారాలను తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని సిఎం రేవంతరెడ్డికి లేఖ రాశారు.



## పర్యాటకానికి కొత్త కళ

హైదరాబాద్‌లో భారీ కార్నివాల్ నిర్వహణ

పర్యాటక కేంద్రాల్లో వారాంత సాంస్కృతిక ప్రదర్శనలు

వరంగల్లు, సోమశిలలో స్టార్‌హోటళ్ల నిర్మాణం

పర్యాటక సలహా కమిటీ సమావేశంలో మంత్రి జూపల్లి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్28:** తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా ఎదిగేందుకు అత్యంత అనువైన ప్రాంతమని, ఆ దిశగా పర్యాటక రంగానికి కొత్త కళ తీసుకురావాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. మౌలిక వసతుల కల్పన, గమ్యస్థానాల బ్రాండింగ్, విస్తృత ప్రచార కార్యక్రమాలకు సంబంధించి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆయన అధికారులకు దిశానిర్ధేశం చేశారు. మంగళవారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో నిర్వహించిన పర్యాటక సలహా కమిటీ/మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని వారసత్వ సంపద, సంస్కృతి, అద్భుతమైన కట్టడాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాలు, జల వనరులు,, దట్టమైన అడవులు, ఆధ్యాత్మిక కేంద్రాలను సమన్వయం చేస్తూ తెలంగాణను ఒక శక్తివంతమైన పర్యాటక హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు కనీస సౌకర్యాల కల్పనలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని మంత్రి అధికారులకు సూచించారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాత్కాలిక వసతి గదులు, టెంట్లు, గ్లాస్ హౌస్‌లతో పాటు రహదారి పక్కన ఉండే విశ్రాంతి సౌకర్యాలను వెంటనే మెరుగుపర్చాలని, కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. సలహా కమిటీ సమావేశంలో వెల్లడైన ప్రతిపాదనలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని, అమలు ప్రక్రియలో జాప్యం జరగకుండా ఒక నిర్దిష్ట పని లేదా ప్రాజెక్ట్ బాధ్యతను పర్యవేక్షించడానికి నోడల్ అధికారికి అప్పగించాలని సూచించారు. దేశీ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు నవంబరులేదా డిసెంబరు మాసాల్లో హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణకు అధ్యయనం చేయాలని, సాధ్యమైనంత త్వరగా పత్రిపాదనలు రూపొందించి, సమర్పించాలని చెప్పారు. ప్రారంభంలో ప్రభుత్వమే దీనిని చేపట్టినా, భవిష్యత్తులో ప్రైవేటు భాగస్వామ్యంతో స్వయం సమృద్ధిగా సాగేలా చూడాలని తెలిపారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ సమన్వయంతో నగర సుందరీకరణలో భాగంగా శిల్పాలు, ఆకర్షణీయమైన ల్యాండ్‌స్కేపింగ్, స్కైవాక్‌లు సృజనాత్మక ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని ఉద్బోధించారు. రాష్ట్రంలోని సోమశిల, వరంగల్, రామప్ప, యాదాద్రి, గోల్కొండ, తారామతి బరాదరి,

>>2



కోల్‌కతాలో ఎన్నికల సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

## బెంగాల్‌లో నేడే మలివిడత

**7 జిల్లాల్లోని 142 నియోజకవర్గాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు**

**కోల్‌కతా, ఏప్రిల్ 28:** పశ్చిమబెంగాల్‌లో రెండో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఏడు జిల్లాల్లో 142 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బుధవారం ఓటింగ్ జరుగనుంది. ఇందుకు

>>2

## మోసపోతున్న రైతాంగం

రెండున్నరేళ్లుగా ఒక్కహామీ నెరవేరలేదు: కెటిఆర్

మే 6న వరంగల్‌లో బిఆర్ఎస్ సమావేశం

పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదుపై కెటిఆర్ దిశానిర్దేశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్28:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతాంగాన్ని అన్ని రకాలుగా మోసం చేసిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరిట నాలుగు సంవత్సరాల కిందట అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటినా ఇప్పటికీ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా తన కపట మోసాన్ని కొనసాగిస్తున్నదని ఆయన విమర్శించారు. స్వయంగా కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ పేరిట తెలంగాణ రైతన్నలను మోసం చేసిన మే 6వ తేదీని పురస్కరించుకొని, కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలకు గుర్తు చేసేలా రైతన్నలతో ఒక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. సమావేశానికి హాజరుకావాలని కేటీఆర్‌ను ఆహ్వానించింది. ఈ కాంగ్రెస్ మోసాలకు వ్యతిరేకంగా జరిగే రైతుల సమావేశానికి తాను హాజరవుతానని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో ఎరువుల కొరత, విత్తనాల కొరత, మరియు ధాన్యం కొనుగోళ్లలో తీవ్రమైన సంక్షోభం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అడ్రస్ లేకుండా పోయిన రైతు ఆత్మహత్యలు కాంగ్రెస్ పాలనలో తిరిగి ప్రారంభమయ్యాయని, కరెంట్ కోతలతో

>>2

# పెట్రోలు పరుగులు!




కొనసాగుతున్న ఇంధన కొరత

బంకుల వద్ద ఇంకా నో స్టాక్ బోర్డులు

**కొన్ని చోట్ల కి.మీ. మేర క్యూలు, ధర్నాలు**

**తల్లడిల్లుతున్న సిటీ వాహనదారులు**

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సామాన్యులకు ఇంధన కష్టాలు కొనసాగుతున్నాయి. వరుసగా మూడోరోజు మంగళవారం కూడా హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల ముందు "నో స్టాక్"బోర్డులు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా డీజిల్ కొరత వాహనదారులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. అధికార వర్గాలు తగినన్ని నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు గంటల తరబడి బంకుల ముందు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

>>2



కొడైకెనాల్ సరస్సు దగ్గర మంగళవారం సైకిల్ తొక్కుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తమిళ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

## నేడే టెన్త్ ఫలితాలు

>> తెలుసుకునేలా ఎస్ఎస్‌సి బోర్డు చర్యలు తీసుకుంది. 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరైన విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను వాట్సాప్‌లో డౌన్‌లోడ్ చేసిన వారికి తమ ఫలితాలు ఆటోమేటిక్‌గా వచ్చేస్తాయి. హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేయని వారు.. ఇపుడు 80969 58096కి హాయ్ అని పంపాల్సి ఉంటుంది. తర్వాత ఎస్ఎస్‌సి రిజల్ట్స్ అని' టైప్ చేసి హాల్‌టికెట్ నంబర్‌ను ఎంటర్ చేయాలి. దీంతో ఆ విద్యార్థికి సంబంధించిన టెన్త్ రిజల్ట్స్ మొబైల్ వాట్సాప్ నంబర్‌కి వస్తుంది.

## బెంగాల్‌లో నేడే మలివిడత

>> సంబంధించి ఏర్పాట్లు అన్నీ పూర్తి చేసినట్లు ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన పోలింగ్ జరిగేలా భారత ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంది. ముఖ్యంగా రాజకీయ పోటీ తీవ్రంగా ఉన్న కీలక నియోజకవర్గాలలో అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఓటర్లు పోలింగ్ బూత్‌లకు వెళ్లేందుకు ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో రెండవ దశ పోలింగ్ ఉదయం 7:00 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6:00 గంటల వరకు కొనసాగుతుంది. సాయంత్రం 6:00 గంటల సమయానికి క్యూలో ఉన్న ఓటర్లను కూడా ఓటు వేయడానికి అనుమతిస్తారని అధికారులు స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

## కొత్త డిజిపిగా సి.వి ఆనంద్

>>ఆనంద్ తన బృందంతో అరెస్టు చేయడం గమనార్హం. అనంతరం ఆయన విజయ వాడ పోలీసు కమిషనర్‌గానూ హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు పోలీసు కమిషనర్ గానూ అవిభాజ్య సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా పనిచేశాక పౌర సరఫరాల కమిషనర్‌గా పనిచేశారు. ఈ విభాగంలో ఐపి ఎస్ అధికారిగా పనిచేసిన మొదటి అధికారి ఆయనే కావడం గమనార్హం. దీని త రువాత గత అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు హైద రాబాద్ పోలీసు కమిషనర్‌గానూ పనిచేశారు. ఎన్నికలు ముగిసిన తరువాత మరో దఫా హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేబట్టా రు. కాగా ఆనంద్‌కు డిజి పదవి రెండుసార్లు తృటిలో చేజారింది. రెండేళ్ల క్రితం రవి గుప్తా స్థానంలో జితేందర్‌ను నియమించినపుడు, అనంత రం జితేందర్ స్థానంలో శివధర్ రెడ్డిని నియమించిన సమయంలోనూ డిజి పోస్టుకు ఆనంద్ పేరును పరిశీలనకు వచ్చింది. అయితే ఈసారి డి జిపి ఎంపికపై ఏకంగా యుపిఎస్‌సి జోక్యం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీ నియర్ల జాబితా తెప్పించుకుని అందులో నుంచి సీనియర్లుగా వున్న ఆనంద్‌తో పాటు 1994 బ్యాచ్‌కు చెందిన వి.పి ఆప్టే (కేంద్ర సర్వీసులో వు న్నారు), జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రాల పేర్లను పంపింది. ఈ ముగ్గురి నుంచి ఒకరిని డిజిపిగా ఎంపిక చేయాలని యుపిఎస్‌సి రాష్ట్రాన్ని ఆ దేశించింది. వీరిలో ఆప్టే రాష్ట్ర సర్వీసులో వచ్చేందుకు ఇష్టం చూపక పోవడంతో ఆనంద్, సౌమ్యా మిశ్రాల పేర్లు మిగిలాయి. ఇందులో సీనియ ర్‌గా వున్న ఆనంద్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కా గా హోం శాఖలో పనిచేసిన ఉన్నతాధికారి డిజి పోస్టుకు మరోసారి నియమితులవ డం విశేషం. ఇంతకు ముందు జితేందర్‌తో పాటు మరికొం దరు ఇదే స్థానంలో వుండగానే డిజిపిగా నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఆనంద్ ఏడవ డిజిపిగా బాధ్యతలు చేబట్టను న్నారు. ఇంతకు ముందు అనురాగ్ శర్మ, మహేందర్ రెడ్డి, అంజనీ కుమార్, రవి గుప్తా, జితేందర్, శివధర్ రెడ్డిలు ఈ పోస్టులో వున్నారు. వీరిలో మహేందర్ రెడ్డి, శివధర్ రెడ్డిలు తెలంగాణకు చెందిన వారు.

## మోసపోతున్న రైతాంగం

>> రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన మండిపడ్డారు. రైతాంగానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పోరాటాలకు సిద్ధమవ్వాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జిల్లాలో ధాన్యం మొక్కజొన్నల కొనుగోలు ప్రక్రియ సక్రమంగా సాగక రైతన్నలు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని పార్టీ నేతలు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు వెల్లడించారు. ఈరోజు ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సి న కార్యాచరణపై పార్టీ నేతలు కేటీఆర్‌కు పలు వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, కమిటీల ఏర్పాటు వంటి సంస్థాగత అంశాలపై కేటీఆర్ కీలక సూచనలు ఇచ్చారు. త్వరలో జరగనున్న గ్రేటర్ వరంగల్ మున్సి పల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అనుసరించాల్సి న వ్యూహంపై కూడా నేతలు సుదీర్ఘంగా చర్చించారు. దీంతోపాటు ఎన్నికల సంఘం నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సి వ్ రివిజన్ కార్యక్రమాన్ని అత్యంత ముఖ్యమైన అంశంగా పరిగణించాలని.. ప్రతి బూత్‌లో దొంగ ఓట్లు నమోదు కాకుండా చూడాలని కేటీఆర్ పార్టీ నేతలకు సూచించారు.

### లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ పర్యాటక శాఖలో కొలువులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్28:** లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ముగింపు దశకు చేరుకున్నాయి. పర్యాటక శాఖలో గిరి దర్శక్ గైడ్ల పేరుతో వారికి ఉద్యోగాలు కల్పించింది. వారంతా భద్రాచలం, ములుగు జిల్లాల్లో విధులు నిర్వహించనున్నారు. అందుకోసం వారికి.. నెల రోజులపాటు తెలంగాణ స్పెషల్ ఇంటిలి జెన్స్ బ్యూరో(ఎస్ఐబీ), పర్యాటక శాఖ సంయుక్తంగా శిక్షణ అందించా యి. ఈ శిక్షణ పూర్తి కావడంతో.. వారిని పర్యాటక శాఖలో కొలు వుల్లోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. అందుకోసం ఆపరేషన్ కగార్‌ను తెరపైకితీసుకు వచ్చిం ది. లొంగిపోయిన మావోయిస్టులకు నగదుతోపాటు పునరావాసం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం.. లొంగిపోయిన వారికి గిరి దర్శక్ గైడ్లుగా పర్యాటక శాఖలో ఉద్యోగాలు కల్పించింది.

## నాకిష్టం.. ఫుట్‌బాలాట!

### గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి సరదాగా ప్రధాని ఆటలు

### ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యమే తమ ఆశయమని వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల పర్యటనలో మంగళ వారం గ్యాంగ్‌టక్‌లో యువ క్రీడాకారులతో సరదాగా ఫుట్‌బాల్ ఆడాడు. అందుకు సం బంధించిన ఫొటోలు, వీడియోలను ప్రధాని మోడీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. మువ్వన్నెల జెండాతో అలంకరించిన నీలి రంగు స్పోర్ట్స్ జాకెట్ ధరించిన మోడీ, ఒకే రంగు దుస్తులు ధరించి, ఒక్కొక్కరు ఒక ఫుట్‌బాల్ పట్టుకున్న యువకుల బృందంతో కలిసి మైదానంలోకి నడుస్తూ కనిపించారు. ఈ సంభాషణ ఉల్లాసకరమైన ఉదయపు వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ, ప్రశాంతంగా కనిపించింది. "గ్యాంగ్‌టక్‌లోని ఈ అందమైన ఉదయం నా యువ మిత్రులతో సిక్కింలో ఫుట్‌బాల్ ఆడటం కంటే గొప్పది ఏదీ లేదు!" అని ఆయన ఫుట్‌బాల్ ఆడిన విషయానికి సంబంధించిన చిత్రాలను పోస్ట్ చేస్తూ ఎక్స్‌లో రాసుకొచ్చారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. మరో పోస్ట్‌లో "ఈ యువకులతో ఇది స్పష్టంగా ఒక ఉత్సాహభరితమైన ఫుట్‌బాల్ సెషన్!" అని ప్రధాని పేర్కొన్నారు. ఆయన, "గ్యాంగ్‌టక్‌లో ఒక ఫుట్‌బాల్ ఉదయం! మేము నేర్చుకున్నాం, ఆడాం, సంబరాలు చేసుకున్నాం, అన్నింటికంటే ముఖ్యంగా ఆటను ఆస్వాదించాం..." అనే క్యాప్షన్‌తో ఒక వీడియోను కూడా పంచుకున్నారు. ఆ క్లిప్‌లో, పిల్లలు బంతిని ప్రధాని మోడీకి పాస్ చేస్తుండగా, ఆయన గోల్‌పోస్ట్ దగ్గర నిలబడి ఉన్నారు. ఆయన షాట్ కొట్టి, గోల్ చేసి, పిల్లలతో హైఫైవ్‌లు ఇస్తూ ఆ క్షణాన్ని సంబరంగా జరుపుకుంటారు. చివర్లో, ఆయన యువ క్రీడాకారులతో మాట్లాడుతూ, ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలన్న భారతదేశ ఆశయం గురించి, ప్రపంచ వేదికపై పోటీపడగల అథ్లెట్లను తయారు చేయాల్సిన అవసరం గురించి మాట్లాడారు. ఆయన వారి కోసం జెర్సీలు, ఫుట్‌బాల్‌లపై సంతకాలు కూడా చేశారు. సిక్కిం 50వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు వేడుకలకు హాజరయ్యేందుకు ప్రధాని మోడీ ఒక రోజు ముందుగానే గ్యాంగ్‌టక్‌కు చేరుకున్నారు. అక్కడ ఆయన పద్మ పురస్కార గ్రహీతలను, వివిధ రంగాలలో చేసిన సేవలకు గుర్తింపు పొందిన వ్యక్తులను కూడా కలిశారు.

### వారం - వర్జ్యం

29-04-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, భరణి కార్తె
త్రయోదశి రా. 7.54
హస్త రా. 12.18
వర్జ్యం : ఉ. 7.37-ఉ. 9.19
దు. ఉ. 11.39-మ. 12.30
శుభసమయం:ఉ. 9.30-10.30
రాహుకాలం - మ. 12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** బోధనా రంగంలోని వారికి కొత్త అవకాశాలు కలిసివస్తాయి. ఆర్థికపరిస్థితి ఆశాజనకంగా వుంటుంది. వస్త్రలాభం.

**వృషభం:** కుటుంబసభ్యులతో విభేదాలు తొలిగి సఖ్యత ఏర్పడుతుంది. పురోగతి బాగుంటుంది. వాహన సౌఖ్యం కలదు.

**మిథునం:** కోర్టువ్యవహారాలు కొంతమేర అనుకూల మవుతాయి. అనుకోని అవకాశాలు కలిసివస్తాయి. ధనలాభం.

**కర్కాటకం :** అనేక సందర్భాలలో మీ అంచనాలు తారుమారైనా దైవానుగ్రహం రక్షిస్తుంది. ఉద్యోగస్థులకు స్థానచలనం.

**సింహం:** విజయం సాధించే అవకాశం ఉన్నప్పటికీ వివాదాలకు దూరంగా ఉండటమే మంచిది. బంధువుల కలయిక.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురవడం మానసిక ప్రశాంతతకు భంగంకలిగిస్తుంది.

**తుల :** అవసరాలకు ఏదోవిధంగా డబ్బు అందుతుంది. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృశ్చికం:** కుటుంబ వివాదాలు పరిష్కారమై ఊపిరి పీల్చుకుంటారు. ఎదుటి వారి విషయంలో జోక్యం చేసుకోవద్దు.

**ధనుస్సు:** మధ్యవర్తి పరిష్కారాలు కలిసిరావు. పూర్వపు మిత్రులనుండి ఆసక్తికరమైన విషయాలను గ్రహిస్తారు.

**మకరం:** దీర్ఘకాలిక కోర్టు సంబంధమైన వ్యవహారాలు కీలకదశకు చేరుకుంటాయి. సోదరుల కలయిక. శుభవార్తలు అందుకుంటారు.

**కుంభం:** ఎంతటి కార్యాన్నైనా పూర్తి చేయాలనే ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగుతారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం :** మీ ప్రయత్నాలలకు మిత్రు సహ కరిస్తారు. ఆర్థికలావాదేవీలు లాభిస్తాయి. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## సింగపూర్‌లా ఫ్యూచర్‌సిటీ

>> రాష్ట్రం నుంచి దక్షిణాది రాష్ట్రాల కు మరింత వేగంగా ప్రయాణాలు సాగించవచ్చని ఆయన వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ ప్రపంచ నగరాలలో మేటిగా వుంటుందని తాను కచ్చిత ంగా చెప్పగలనని ఆయన వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ కోసం ఇప్పటికే అనేక గ్రామాలను ఇందులో విలీనం చేయడం జరిగిందని, మరిన్ని గ్రా మాలు కూడా కలిసేందుకు సిద్ధంగా వున్నాయని, అయితే ఇందుకు ఆయా గ్రామాలు తీర్మానాలు చేసి కలెక్టర్‌కు పంపాలని, అనంతరం ప్రభు త్వం పరిశీలన చేసి తగిన నిర్ణయం తీసుకుంటుందని సిఎం తెలిపారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో ఇక్కడి ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకు పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అందరు కలిసి రావాలని సిఎం కోరారు. ఫ్యూచర్ సిటీ నిర్మా ణం నేపథ్యంలో ఇదే ప్రాంతంలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించామని, వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించామని, ఈ పెట్టుబడులు త్వరలో రానున్నాయని సిఎం తెలిపారు. భవిష్యత్ తరాలకు ఫ్యూచర్ సిటీ గొప్ప నగరంగా వుంటు ందని ఆయన తెలిపారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి నష్టం జరగదని, ఈ విషయంలో తానూ ప్రత్యేకంగా చొరవ తీసుకుంటానని సిఎం హామీ ఇచ్చారు. రై తులకు తగిన నష్ట పరిహారం అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. భవిష్యత్‌లో ఫ్యూచర్ సిటీలో రానున్న పె ట్టుబడులకు సంబంధించిన సమావేశాలన్నీ ఇక్కడే జరుగుతాయని సిఎం తెలిపారు. ప్రపంచంలోని ఏ దేశానికి చెందిన వారైనా రాష్ట్రంలో పె ట్టుబడులు పెట్టే విధంగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతామని సిఎం తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూశాకే కేంద్రం హైదరాబాద్ నుంచి అనేక నగరాలకు మూడు బుల్లెట్ రైళ్లను ఇచ్చిందని సిఎం తెలిపారు. ఇదే వేదిక నుంచి సిఎం మేడిపల్లిలో కొత్తగా నిర్మించిన మల్కాజి గిరి కమిషనరేట్ నూతన భవనం, కుత్బులాపూర్ డిసిపి కార్యాలయం, ఆక్టోపస్ భవనాలను సిఎం వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో పా టు గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు కూడా శంకుస్థాపన చేశారు.

**మూసీ నది అభివృద్ధిని ఎవరూ ఆపలేరు**

తమ సర్కారు ప్రతిష్టాత్మంగా చేబట్టిన మూసీ నది సుందరీకరణ, అభివృద్ధి పనులు ఎట్టి పరిస్థితు ల్లోనూ ఆగబోవని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగేది లేదని ఆయన స్పష్టం చేశారు. మూసీ నది సుందరీకరణ పనులను ఆపేందుకు, రాష్ట్రంలో అభివృద్ధి పను లను నిలువరించేందుకు ఫాం హౌస్‌లో వున్న శుక్రాచార్యుడు, క్షేత్రస్థాయిలో మారీచుడు, సుభాహుడు అనే మరో ఇద్దరు ఎన్నో కుట్రలు చేస్తున్నారని, వీరి ఆటలను కచ్చితంగా వమ్ము చేస్తామని సిఎం చెప్పారు.

**మావోయిస్టు అగ్రనేత గణపతి లొంగిపోవాలి**

కాగా రాష్ట్రంలో మావోయిస్టులు లేరని, అయితే ఆ పార్టీ అగ్రనేత గణపతి విదేశాల్లో వున్నట్లు సమాచారం వుందని, ఆయన వెంటనే లొంగి పోవాలని, జనజీవన స్రవంతిలో కలవాలని సిఎం కోరారు. ములుగు జిల్లాలోని పర్యాటక కేంద్రాలలో గిరిజన యువకు ఉపాధి అవకాశాలు క ల్పించేందుకు గిరిదర్శక్ ఉద్యోగాలు ఇస్తున్నామని సిఎం తెలిపారు.

ఇదే వేదిక నుంచి 20 మందికి నియామక పత్రాలు కూడా సిఎం అందించా రు. గిరిజన ప్రాంతాలలో పర్యాటకాన్ని పెంచేందుకు ఎంపిక చేసిన గిరిజన యువతకు శిక్షణ ఇచ్చి వారిని గిరిదర్శక్‌లుగా నియమిస్తామని సిఎం హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు సహా పలువురు ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, డిజిపి శివధర్ రె డ్డి సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పెట్రోలు పరుగులు!

>> పెట్రో, డిజిల్ సరఫరా ఎప్పుడు వస్తుందో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల అనంతరం ఇంధన ధరలు భారీగా పెరుగుతాయనే ప్రచారం సోషల్ మీడియాలో జోరందుకోవడంతోపాటు ఏపి సరిహద్దుల్లో కొన్ని బంకులు మూతపడటంతో తెలంగాణలోని ఖమ్మం, కొత్తగూడెం, వికారాబాద్, జోగులాంబ గద్వాల్ తదితర జిల్లాల ప్రజలు ఒక్కసారి బంకులకు పోటెత్తారు. " రేపు ధర పెరుగుతుంది. ఇప్పుడే ఫుల్ ట్యాంక్ చేయించుకుందాం." అనే ఆలోచనతో పెద్ద మొత్తంలో ఇందనాన్ని కొనుగోలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఇంధన ధరల మధ్య ఉన్న భారీ వ్యత్యాసంతో భారి పరిశ్రమలు, రవాణా సంస్థలు తమ వాహనాలను రిటైల్ పెట్రోల్ బంకుల వైపు మళ్లిస్తున్నాయి. దీంతో సాధారణ వినియోగదారుల కోసం కేటాయించిన ఇంధనం త్వరగా నిండుకుంటోంది. అయితే ఈ పరిస్థిఇతిని అరికట్టేందుకు డీజిల్‌పై ఉన్న 27శాతం వ్యాట్‌ను తాత్కాలికంగా తగ్గించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

హైదరాబాద్ నగరంలో ఇంధన కొరత సామాన్యులను బెంబేలెత్తిస్తోంది. వరుసగా మూడో రోజు కూడా నగరంలోని అనేక పెట్రోల్ బంకుల్లో స్టాక్ అయిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెజారిటీ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుండగా, పెట్రోల్ అందుబాటులో ఉన్న చోట కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. చంపాపేట్, ఐఎస్ సదన్ వంటి ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా మారింది. గంటల తరబడి క్యూలో నిల్చున్నా పెట్రోల్, డీజిల్ దొరకకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారులు బంకుల వద్ద ఆందోళనకు దిగారు.

**జిల్లాల్లోనూ తీవ్ర ఇందన కొరత...**

అటు జిల్లాల్లోనూ పెట్రోల్ బంకుల్లో నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల పెట్రోల్ లభ్యత ఉండగా, డీజిల్‌కు కొరత ఉంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ కొరత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. రాత్రి నుంచి అనేక పెట్రోల్ బంకుల్లో ఇంధనం అందుబాటులో లేకపోవడంతో బంకులు మూసివేశారు. దీంతో ఉద్యోగులు, ఇతర పనుల కోసం బయటకు వెళ్లాల్సి న వారు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.

**వాహనదారుల ధర్నాలు...**

పెట్రోల్, డిజిల్ కోసం గంటల తరబడి క్యూ లైన్లలో వేచి చూసినా దొరక్కపోవడంతో ఓపిక నశించిన వాహనదారులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు. జనగామ జిల్లా కేంద్రం పాలకుర్తి చౌరస్తాలో ఓ వాహనదారుడు చేపట్టిన వింత నిరసన స్థానికంగా చర్చనీయాంశమైంది. బైక్‌పై ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా పెట్రోల్ అయిపోవడంతో వాహనం అక్కడే నిలిచిపోయింది. దీంతో కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన రమేష్ తీవ్ర అసహనానికి లోనయ్యాడు. ఇప్పటికే పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూ లైన్లు ఉండటంతో విసుగెత్తిన అతను నడిరోడ్డుపై బైక్‌ను పడేసి "పెట్రోల్ కష్టాలు పగవారికి రాకూడదంటూ తన ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. ఈ ఘటనతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, స్థానికులు అతడిని సముదాయించి పరిస్థితిని సర్దిచేశారు. ఇక నల్లగొండ జిల్లా కేంద్రంలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్ర రూపం దాల్చింది. ఇంధనం దొరక్క విసిగిపోయిన సామాన్య ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. నల్లగొండ మహిళా జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గంటల తరబడి క్యూ లైన్లలో వేచి చూసినా ఇంధనం పోయకపోవడంతో ఆగ్రహించిన వాహనదారులు బంకు ముందు బైఠాయించి ధర్నాకు దిగారు. ఆకస్మిక ధర్నా కారణంగా మహిళా జూనియర్ కళాశాల పరిసర ప్రాంతాల్లో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ కావడంతో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బైక్, కారు, ఇతర భారీ వాహనాలు ఏరకమైనవైనారేషన్ పద్ధతిలో కేవలం రూ. 1000 వరకు మాత్రమే ఇంధనాన్ని ఫిల్ చేస్తున్నారు. ఇక ప్లాస్టిక్ బాటిళ్లు, పెద్ద డబ్బాలు, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ నింపడాన్ని నిషేధించారు. అత్యవసర పరిస్థితుల పేరుతో వచ్చే వారికి కూడా ఇంధనం నింపే ప్రసక్తే లేదని బంకు యజమానులు కరాఖండిగా చెబుతున్నారు. ఆయిల్ కంపెనీలు ఇందన సరఫరాలో ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేస్తున్న కారణంగానే సమస్య ఏర్పడిందని పెట్రోల్ డీలర్లు ఆరోపిస్తున్నారు. అవసరమైన స్థాయిలో ట్యాంకర్లు రాకపోవడంతో నిల్వలు త్వరగా ఖాళీ అవుతున్నాయని పేర్కొంటున్నారు. నిల్వలు లేకపోవడంతోనే "నో స్టాక్" బోర్డులు పెట్టాల్సి వస్తోందని పలువురు బంకు యజమానులు వెల్లడించారు. సమస్యను త్వరగా పరిష్కరించి సాధారణ సరఫరా పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు.

**సమృద్ధిగా పెట్రో నిల్వలు: కమిషనర్ స్టిఫెన్ రవింద్ర**

తెలంగాణలో పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా సమృద్ధిగా ఉన్నట్లు పౌర సరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం డిమాండ్‌ను మించి పెట్రోల్, డీజిల్‌ను 29,939 కిలో లీటర్లు సరఫరా చేసినట్లు వివరించారు. సగటున రోజుకు 5,883 కిలో లీటర్లు పెట్రోల్, 7,348 కిలో లీటర్లు డీజిల్‌కు డిమాండ్ ఉండేదని తెలిపారు. సరఫరాను క్షేత్ర స్థాయి అధికారులు, పెట్రోల్ కంపెనీల ప్రతినిధులతో క్రమంతప్పకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.



కలరి బడ్స్ సందర్భంగా బెంగళూరులో మంగళవారం 'కలరిపయట్టు' యుద్ధ కళలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

### బిఆర్ఎస్ నేతల ఫోన్లు హ్యాక్ చేస్తున్నారు: హరీష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్28:** బీఆర్ఎస్ అగ్ర నాయకులతో పాటు ఎమ్మెల్యేల ఫోన్లను, వారి ఇళ్ల ముందున్న సీసీ కెమెరాలను ప్రైవేట్ హ్యాకర్ల ద్వారా కొందరు ఐపీఎస్ అధికారులు హ్యాక్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కొందరు ఐపీఎస్ అధికారులు బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను రప్పించి తమ వ్యక్తిగత సంభాషణలు, సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్నారని మండిపడ్డారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు రిటైర్‌అయినా వదిలిపెట్టమని, రాబోయేది తమ ప్రభుత్వమేనని హెచ్చరించారు. బాధ్యులైన వారు సొంత ఖర్చులతో కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌తో పాటు ఇతర నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ వేధిస్తోందని ధ్వజమెత్తారు.

### నిప్పుల కుంపటిని తలపిస్తున్న తెలంగాణ

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రోహిణి కార్తె రాకముందే తెలంగాణ రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా ఏప్రిల్ నెలలోనే ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల మార్కును తాకడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో కూడా 45.9 డిగ్రీల మేర ఎండలు దంచికొట్టాయి. రాజధాని హైదరాబాద్‌లోనూ పలుచోట్ల 42.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడి ప్రతాపం మొదలవుతుండటంతో జనం బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. తీవ్రమైన ఎండల కారణంగా రాష్ట్రంలో సోమవారం ఒక్కరోజే నలుగురు మృతి చెందడం విషాదాన్ని నింపింది. రానున్న మూడు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు మరో 2 డిగ్రీలు అధికం కావొచ్చని వాతావరణశాఖ హెచ్చరించింది.

## మే ఆఖరులో మూడో విడత రైతు భరోసా

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. యాసంగి మూడో విడత రైతు భరోసా నిధులను మె నెలలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసేందుకు సర్కారు సిద్ధమైంది. మూడో విడత రైతు భరోసా నిధులను మే నెలాఖరుకల్లా రైతులకు ప్రభుత్వం అందించనుంది. ఇందుకోసం నిధుల సమీకరణలో ప్రభుత్వం నిమగ్నమైంది. రూ.12 వేల కోట్లు సమీకరించేందుకు బాండ్లను వేలానికి పెట్టాలని రిజర్వ్ బ్యాంక్‌కు తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. వేలం ద్వారా వచ్చిన సొమ్మును రాబోయే 6 నుంచి 25 ఏళ్లల్లో చెల్లించనుందని తెలుస్తోంది. 7 నుంచి 7.5 శాతం వడ్డీకే వీటిని తీసుకోనుందని సమాచారం. అలాగే హైదరాబాద్ మెట్రోను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వానికి నిధులు అవసరం కానున్నాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా నిధుల సమీకరణకు సిద్ధమయ్యారు. రూ.15 వేల కోట్లు మెట్రో స్వాధీనానికి అవసరమవుతాయి. దీంతో రానున్న రెండు నెలల్లో రైతు భరోసా, మెట్రో స్వాధీనం, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల కోసం రూ.12 వేల కోట్లు సమీకరించేందుకు సిద్ధమైంది. కాగా.. రైతు భరోసా పథకం కింద పంట పెట్టుబడి సాయంగా పతీ ఏడాది ఎకరానికి రూ.12 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ యాసంగి రైతు భరోసా కింద ఇప్పటికే రెండు విడతల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. తొలి విడత కింద లబ్దిదారులకు రూ.3,446 కోట్లు, రెండో విడత కింద రూ.2,206 కోట్లు జమ చేసింది. తొలి విడతలో 68,89 లక్షల మందికి లబ్ది చేకూరగా.. రెండో విడతలో 45.11 లక్షల మంది రైతులకు అందించింది.

## పర్యాటకానికి కొత్త కళ

>> నాగార్జున సాగర్ వంటి కీలక పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రధాన పర్యాటక కేంద్రాల్లో క్రమం తప్పకుండా వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ... మన రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు, వనరులు ఉన్నప్పటికీ, ప్రచారంలో వెనుకబడి ఉన్నామని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి న అవసరం ఉందన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, కెరావెన్ కోసం ఇప్పటికే ప్రతిపాదనలు ఆహ్వానించామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న హరిత హోటళ్ల నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకోవాలని, వారసత్వ కట్టడాల నిర్వహణ కోసం ఆగాఖాన్ మోడల్‌లో ట్రస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడంతో పాటు మెడికల్, వెల్నెస్, గోల్ఫ్, ఫిలిం, ఎకో టూరిజం కేంద్రంగా ప్రచారం చేయాలని కమిటీ సభ్యులు ఈ సమావేశంలో ప్రతిపాదించారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యం, సెంట్రల్ ఆసియా మార్కెట్లలో విస్తృత మార్కెటింగ్ కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ సభ్యులు నొక్కి చెప్పారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్టర్ అవుట్ రీచ్ కార్యక్రమాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అమలులో వేగం పెంచాలని సూచించారు. తెలంగాణలో ఉన్న పర్యాటక ప్రదేశాలను అద్భుత కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చైనా, వియత్నాం వంటి దేశాల్లో అధ్యయన పర్యటనలు చేపట్టాలని, జైపూర్ సిటీతో పోటీ పడేలా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలను వెడ్డింగ్ డెస్టినేషన్స గా తీర్చిదిద్దడం, కేరళ తరహాలో ప్రకృతి ఉత్పత్తులు, సంస్కృతిని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించడం, ఈత, తాటి కల్లు, ఇతర ఉప ఉత్పత్తులను ప్రోత్సహిస్తూనే బ్రాండింగ్ చేయడం, వారసత్వ విధానం ఉండాలని, విదేశీయుల కంటే భారతీయులే పర్యాటకానికి ఎక్కువ ఖర్చు చేస్తారు, కాబట్టి స్వదేశీ పర్యాటకంపై దృష్టి పెట్టి తెలంగాణ పర్యాటక ప్రమోషన్, బ్రాండింగ్ పై ప్రత్యేక దృష్టి సారించి, ప్రచారానికి నిధులు కేటాయించాలి, మధ్యప్రాచ్యం నుండి పర్యాటకులను ఆకర్షించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని ప్రతిపాదించారు. వరంగల్, సోమశిల వంటి ప్రాంతాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో 3 నుండి 5 స్టార్ హోటళ్లను నిర్మించడం, బమ్మెరలో పోతన స్మృతి వనం నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, వరంగల్ హరిత హోటల్ నుంచి రామప్ప వరకు బస్సు సర్వీసులను నడపాలని కమిటీ సభ్యులు సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, డైరెక్టర్ ఆఫ్ టూరిజం లక్ష్మణ్ రంజిత్ నాయక్, కమిటీ సభ్యులు పాపారావు, కమలవర్ధన్ రావు, డాక్టర్ బాలాజీ, జుల్ఫీ, మార్గ పటేల్, రాందేవ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

### పతనం అంచున ఇరాన్: ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 28:** ఇరాన్ పతనమైందని, హార్ముజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధంగా ఉందని అమెరికా అద్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ విషయాన్ని తమకు ఇరాన్ స్వయంగా తెలిపినట్లు ట్రంప్ అన్నారు. పతనం అంచున ఉన్నందున తాము హార్ముజ్ జలసంధిని వెంటనే తెరుస్తామని ఇరాన్ కోరిందని ట్రంప్ వెల్లడించారు. ఈ అంశంపై ఇరాన్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కానీ, హార్ముజ్‌ను తెరిచేందుకు ఇరాన్ ఇటీవల అమెరికాకు షరతు విధించిన సంగతి తెలిసిందే. హార్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధనం నుంచి తొలగిస్తేనే తాము ఈ జలసంధిని తెరుస్తామని ప్రకటించింది. ఈ జలసంధిపై ఇరాన్ దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తోంది. ఈ చిన్న జలసంధి ప్రపంచ సముద్ర రవాణా మార్గానికి కీలకం. ముఖ్యంగా చమురు సరఫరాకు కీలకంగా మారింది. పాశ్చాత్య దేశాలు ఇరాన్ చమురుపై ఆంక్షలు విధించడంతో ఆయా దేశాల సరుకుల రవాణాపై ఇరాన్ నిషేధం విధిస్తూ, హార్ముజ్‌ను చెక్ పాయింట్గా వాడుకుంటోంది. అయితే, ఈ ప్రాంతాన్ని, ప్రపంచ వ్యాపారాన్ని అడ్డుకోవడం తమ ఉద్దేశం కాదనేది ఇరాన్ మాట. హార్ముజ్‌ను తమ అధీనంలో ఉంచుకోవడం హక్కని చెబుతోంది. మరోవైపు ఇరాన్‌కు నాయకత్వ లేమి సమస్య ఉందని ట్రంప్ భావిస్తున్నారు. చర్చల్లో ఈ అంశం ప్రతికూలంగా మారిందన్నారు. మరోవైపు ఇరాన్ యుద్ధానికి ముగింపు పలికే అంశంలో ఇరాన్ ప్రతిపాదనల్ని ట్రంప్ తోసిపుచ్చే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌తో చర్చల అంశంలో ఇంకా ఎలాంటి ముందడుగు పడటం లేదు.



కుటుంబ వివరాలు నమోదు చేస్తున్న జయేష్ రంజన్, చిత్రంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు

## సెల్ఫ్ ఎన్యూమరేషన్‌లో పాల్గొన్న జయేష్‌రంజన్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** సెన్సస్ 2027లో భాగంగా, భారత ప్రభుత్వం ప్రతి పౌరునికి స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈనేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ స్వయంగా తన సెల్ఫ్ ఎన్యూమరే షన్ పూర్తి చేసి ఆదర్శంగా నిలిచారు. ఈమేరకు మంగళవారం తన కార్యాలయం లో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో కలిసి సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని ప్రతి కుటుంబం ముందుకు వచ్చి స్వీయగణనలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ నగర ప్రజలను సెన్సెస్‌లో పాల్గొని తమవంతు సహకారం అందించాలని కోరారు.

## రేపటితో ముగియనున్న టెట్ దరఖాస్తు గడువు

### ఇప్పటి వరకు 93,514 దరఖాస్తులు

### నేటి నుంచి మే 3 వరకు ఎడిట్ సౌకర్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)-2026 దరఖాస్తు గడువు రేపటి(గురువారం)తో ముగియనుంది. మంగళవారం మధ్యాహ్నం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 93,514 దరఖాస్తులు వచ్చినట్టు టెట్ కన్వీనర్ జి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 93,514 మంది దరఖాస్తు చేశారు. వారిలో పేపర్-1కి 21,826 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 59,271 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. రెండు పేపర్లకు 12,417 దరఖాస్తులు వచ్చినట్టు చెప్పారు. టెట్-2026కి మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నేటి(బుధవారం) నుంచి దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సరిచేసుకోవడానికి ఎడిట్ సౌకర్యం కల్పించినట్టు కన్వీనర్ ప్రకటనలో తెలిపారు. ఎడిట్ సౌకర్యాన్ని మే 3 వరకు అభ్యర్థులు ఉప యోగించుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు గడువు రేపటి (గురువారం-ఏప్రిల్ 30)తో ముగుస్తుందని ప్రకటించారు.

## పెళ్లింట.. చావు బాజాలు

### ధన్వాడలో విషాదం, పెళ్లి కుమారుడు ఆత్మహత్య

**ధన్వాడ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** పెళ్లి సందడి నడుమ సంతోషంగా కళకళలాడాల్సిన ఓ ఇల్లు ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. పెళ్లి బాజాలు మోగాల్సిన వేళ చావు బాజాలు మోగిన ఈ హృదయ విదారక ఘటన ధన్వాడ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ధన్వాడలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న రాజోలి మల్లేష్(21) సోమవారం అర్ధరాత్రి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లేష్‌కు బుధవారం పెళ్లి జరగాల్సి ఉండగా, కుటుంబంలో పెళ్లి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. బంధువులు, స్నేహితులు ఇంటికి చేరుకుని పెళ్లి సంబరాలకు సిద్ధమవుతున్న సమయంలో ఈ విషాదం చోటు చేసుకోవడం అందరినీ షాక్‌కు గురిచేసింది. మంగళవారం పెళ్లికూతురిని తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్న కుటుంబంలో ఇలాంటి ఘటన జరగడంతో ఆనందం కన్నీళ్లలో కలిసిపోయింది. పెండ్లి పందిరి వేయాల్సిన ఇంట్లో మృతదేహం చూసి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ విషయమై ఎఎస్ఐ ఖలీల్ మాట్లాడుతూ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల అసలు కారణాలు తెలియాల్సి ఉందని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నామని చెప్పారు.



రాజోలి మల్లేష్ (ఫైల్)

## కేజ్రీవాల్ బాటలోనే మనీష్ సిసోడియా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ రూట్లోనే ఆ పార్టీ నేత మనీష్ సిసోడియా వెళ్తున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వరణ కాంత శర్మ ముందు హాజరు కాబోనన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఇవాళ జస్టిస్ స్వరణ కాంతకు లేఖ రాశారు. జస్టిస్ స్వరణ శర్మ కోర్టులో ఈ కేసు ముందు హాజరుకాబోనని కేజ్రీవాల్ సోమవారం ఓ లేఖ రాసిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా కానీ, న్యాయవాది ద్వారా కానీ ఆయన హాజరుకాబోనన్నారు. అయితే అదే తరహాలో మంగళవారం సిసోడియా కూడా లేఖ రాశారు. ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని సిసోడియా పేర్కొన్నారు. న్యాయ ప్రక్రియపై తనకు నమ్మకం లేదన్నారు. ఇంకా ఆయన తన లేఖలో తీవ్ర విమర్శలు కూడా చేశారు. మీ పిల్లల భవిష్యత్తు తుషార్ మెహతా చేతుల్లో ఉందని సిసోడియా వ్యాఖ్యలు చేశారు. సిసోడియా చేసిన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థతో పాటు రాజకీయా విభాగాల్లోనే తీవ్ర చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి.
తన కేసులో న్యాయవాదిని పెట్టుకోను అని, సత్యాగ్రహ బాటలో నడవనున్నట్లు సిసోడియా పేర్కొన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ దేశ రాజకీయాలను కుదిపేసింది. అనంతరం 2025లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘోరంగా ఓడిపోయింది. అనూహ్యంగా ఈ కేసును గత ఫిబ్రవరి 27న ట్రయల్ కోర్టు కొట్టేసింది. కేజ్రీవాల్ సహా అందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. అయితే తీర్పుపై సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారిస్తు న్నారు. ఆమె ఆర్ఎస్ఎస్ సానుభూతిపరురాలని అలాగైతే ఈ కేసులో తమకు న్యాయం జరగదని.. విచారణ నుంచి తప్పించాలంటూ హైకోర్టు లో కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను ఏప్రిల్ 20న ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. అయితే ఆ న్యాయమూర్తి ముందు హాజరుకాబోనని తేల్చి చెబుతూ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా లేఖ రాశారు.



మనీష్ సిసోడియా

## ఎస్ఇసి మాజీ కమిషనర్ వ్యవసాయ క్షేత్రంలో చోరీ

**పుల్‌కల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటకు చెందిన రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ వి నాగిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సోమవారం అర్ధరాత్రి చోరీ చోటుచేసుకుంది. చౌటకూరు మండ లం శివంపేట గ్రామ శివారులో గల వ్యవసాయ క్షేత్రంలోని గెస్ట్ హౌజ్‌లోని బెడ్ రూంలో ఏసీలను అమర్చుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గెస్ట్ హౌజ్ తలుపుల తాళాలు ధ్వంసం చేసి పెంట్ హైజ్‌లోకి చొరబడి ఏసీ కూలర్, కంప్రెషర్‌లను, బీరువాలో ఉన్న ప్రొజెక్టర్‌లను, కిచన్ గదిలో బిగించిన నల్లాలు ఇతర సామాగ్రిలను దోచుకుపోయారు. గెస్ట్ హౌజ్‌లో చోరి జరిగినట్లు తెలుసుకున్న నాగిరెడ్డి సోదరుడు, పెద్దారెడ్డిపేట గ్రామ సర్పంచ్ వి యాదగిరిరెడ్డి గెస్ట్ హౌజ్‌కు చేరుకుని చోరీ తీరును పరిశీలించారు. పుల్‌కల్ ఎస్ఐ నల్లా విశ్వజన్‌కు సమాచారం అందించగా కేసు నమోదు చేసి పోలీసు సిబ్బందిని పంపిణీ పంచనామ చేయించారు. పాత నెరస్థులు చోరికి పాల్పడి ఉంటారన్న అనుమానాన్ని పోలీసులు వ్యక్తం చేశారు.

# పాడి, మత్స్య పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి

### ఎన్ఎఫ్‌డిబిని రాజేంద్రనగర్‌లోనే కొనసాగించాలి

### కేంద్రానికి మంత్రి వాకిటి శ్రీహరి వినతి

### కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్‌తో ప్రత్యేకంగా భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** పశు సంవర్ధక, పాడి పారిశ్రామి కాభివృద్ధితోపాటు మత్స్యకారుల జీవనోపాధి కోసం తెలంగాణకు నిధులు సమకూర్చి సహకరించాలని కేంద్ర పశుసంవర్ధక పాడి పారిశ్రామికాభివృద్ధి శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌ను రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్ లోని ఎన్ఎఫ్‌డిబి కార్యాలయంలో మంగళవారం కేంద్రమంత్రితో ఆయన ప్రత్యేకంగా భేటీ అ య్యారు. సిఎం రేవంత్ సర్కారు రాష్ట్రంలో అమలు చేస్తున్న పశు సంవ ర్ధక, మత్స్య అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి కావలసిన సహకారం, ఆక్వా కల్చర్, లైఫ్ సైన్సెస్‌లో ఇన్సూరెన్స్, మోపెడ్ కేటాయింపుల్లో న్యాయం వంటి పలు అంశాలను వివరించగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్రాల సమాహారమే కేంద్రమని, తెలంగాణకు నిధులను కేటాయించాలని కోరారు. గోదావరి, కృష్ణా నదుల మధ్య ఉన్న 46 వేల పెద్ద చెరువులు, 26 వేల చిన్న చెరువులు, 100 రిజర్వాయర్ల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే నిధులను తీసుకు రావడంలో విఫల మయిందని మండిపడ్డారు. కాగా.. రాజేంద్రనగర్ లోని ఎన్ఎఫ్‌డిబి తరలింపు అంశాన్ని ప్రచారంపై కేంద్ర మంతి రాజీవ్ రంజన్ దృష్టికి మంత్రి వాకిటి శ్రీహరి తీసుకు పోయారు. అయితే ఎన్ఎఫ్‌డిబిని తరలించే ఆలోచన ఏది లేదని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ తెలిపారని వివరించారు.

**జమ్మూకాశ్మీర్‌లో మంత్రి వాకిటికి ఘనస్వాగతం**

జమ్మూకాశ్మీర్‌లోని పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్‌ను సందర్శించిన మంత్రి వాకిటి శ్రీహరికి ఆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ విభాగం ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా అక్కడి పశుసంవర్ధకశాఖ అమలు చేస్తున్న పథకాలు, పాడి పారిశ్రామిక అభివృద్ధి విధానాలను అడిగి తెలుసుకున్న మంత్రి వాకిటి శ్రీహరి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో అమలవు తున్న పశుసంవర్ధక, పాడి రంగాల్లో అమలవుతున్న వివిధ పథకాల గురించి వివరించారు.



## పుట్టినతేదీ ధ్రువీకరణకు ఆధార్ ప్రామాణికం కాదు

### యుఐడిఎఐ వివరణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** ఆధార్‌ను కేవలం గుర్తింపు పత్రంగానే పరిగణిం చాలని, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రంగా కాదని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ (డీవోబి) ముద్రించి ఉన్నప్ప టికీ, దానిని అధికారిక పుట్టిన తేదీ ధృవీకరణ పత్రంగా పరిగణించ కూడదని స్పష్టం చేస్తూ ఆధార్ యూజర్స్ ఏజెన్సీలు, ఈకేవైసీ యూజర్స్ ఏజెన్సీలకు యుఐడిఎఐ లేఖ రాసింది. ఆధార్ అనేది ఒక వ్యక్తి యొక్క గుర్తింపును ధ్రువీకరించడానికి ఉద్దేశించినది మాత్ర మేనని యుఐడిఎఐ వివరించింది. ఆధార్ నమోదు సమయంలో వినియోగదారులు ఇచ్చే సమాచారం లేదా స్కూల్ సర్టిఫికేట్లు, పాస్‌పోర్ట్ వంటి పత్రాల ఆధారంగా పుట్టిన తేదీని నమోదు చేస్తారు. ఒకవేళ వినియోగదారుడి వద్ద ఎలాంటి అధికారిక పత్రాలు లేకపోతే, వారి వయసు అంచనా ఆధారంగా సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఆ ఏడాది జనవరి 1వ తేదీని పుట్టిన తేదీగా తీసుకుం టుంది. అందుకే ఇది అన్ని వేళలా కచ్చితమైనది కాదని సంస్థ స్పష్టం చేసింది. ఆధార్ కార్డు సమర్పించిన వ్యక్తి, బయోమెట్రిక్ డేటా ప్రకారం అతను అసలైన వ్యక్తి అవునా కాదా అనే విషయాన్ని మాత్రమే ఆధార్ ధ్రువీకరిస్తుంది. సెంట్రల్ డేటా రిపోజిటరీతో ఈ సమాచారాన్ని మ్యాచ్ చేసి గుర్తింపును నిర్ధారిస్తుంది కానీ, పుట్టిన తేదీని వెరిఫై చేయదు.
సంక్షేమ పథకాలు, సబ్సిడీలు లేదా ఇతర సేవల కోసం పుట్టిన తేదీని నిర్ణయిం చడంలో ఆధార్‌ను వాడుకోవాలా వద్దా అనే అంశం ఆయా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు లేదా ఏజెన్సీల నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుం దని యుఐడిఎఐ తెలిపింది. ఆధార్ కార్డులోని అన్ని రూపాలు అంటే ఫిజికల్ కార్డ్, ఈఆధార్, మాస్క్డ్ ఆధార్, ఆఫ్‌లైన్ ఎక్స్ఎంఎల్, క్యూఆర్ కోడ్ వంటివి వ్యక్తి గుర్తింపు, చిరునామా ధృవీకరణకు కచ్చితంగా ఉపయోగపడతాయని వివరించింది. దీంతో ఇకపై పుట్టిన తేదీ ధృవీకరణ కోసం బర్త్ సర్టిఫికేట్, స్కూల్ లీవింగ్ సర్టిఫికేట్ లేదా పాస్‌పోర్ట్ వంటి డాక్యుమెంట్లు మాత్రమే ప్రామాణికం కానున్నాయి.




## ఫోన్ ట్యాపింగ్ కేసులో యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్ విచారణ

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి మరోదఫా బాధితుల విచారణ మొదలయ్యింది. ఈ కేసులో రెండు నెలల క్రితం మొదటి ముద్దాయి ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు కస్టడీ విచారణ తరువాత బాధితుడి విచారణ జరగడం ఇదే తొలిసారి. యుగతులసి ఫౌండేషన్ అనే సంస్థకు చైర్మన్‌గా వున్న శివకుమార్‌ను బంజారాహిల్స్‌లో గల కమాండ్ కంట్రోల్ మంగళవారం రెండు గంటల పాటు విచారించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును విచారిస్తున్న సిట్ ఎసిపి వెంకటగిరి శివకుమార్‌ను విచారిం చారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో శివకుమార్ ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు కేసు విచారణ సమయంలో వెలుగు చూసింది. శివకు మార్‌తో పాటు అనేక మంది ఫోన్‌లను అప్పట్లో ప్రభాకర్ రావు బృందం ట్యాపింగ్ చేసినట్లు నిర్ధారణ అవడంతో బాధితుల్లో కొందరిని ఇదివర కే విచారించి వారి వాంగ్మూలం తీసుకున్నారు. అయితే ఈ కేసు విచారణ పూర్తయి ఒకసారి ఛార్జిషీట్ కూడా దాఖలైన తరువాత బాధితుల వా ంగ్మూలం తీసుకోవడం సంచలనం రేపింది. కాగా విచారణ తరువాత మీడియాతో మాట్లాడిన శివకుమార్ ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు తీ రు అంతు చిక్కడం లేదని తెలిపారు. ఈ తరహా విచారణతో ఒరిగేది ఏమీ వుండబోదని ఆయన తెలిపారు. విచారణ సందర్భంగా మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా తన ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు అధికారులు తెలిపారని, ఇందుకు నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు కారణమని వారన్నట్లు శివకుమార్ తెలిపారు. ఇందులో నిజం వుండివుండవచ్చని ఆయన తెలిపారు.

**వచ్చే వారం మరికొందరి విచారణ..**

**మే రెండోవారంలో మరో ఛార్జిషీట్ దాఖలు**

ఇదిలా ఉండగా ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి వచ్చే వారం మరికొందరు బాధితులను విచారించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి కొందరికి నోటీసులు ఇచ్చేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. వీరి విచారణ తరువాత మే నెల రెండవ వారంలో ఈ కేసుకు స ంబంధించి నాంపల్లి కోర్టులో రెండో ఛార్జిషీట్‌ను దాఖలు చేసేందుకు సిట్ అధికారులు నిర్ణయించారు.

## ష్యూరిటీ ఇచ్చినందుకు అప్పు కింద నగదు భర్తీ

### రుణాలు తీసుకునేందుకు రైతులు వెనకడుగు

### జమ చేసుకుంటామంటున్న మేనేజర్ దబాయింపు

### కుటుంబసభ్యులందరి అకౌంట్లు ఫ్రీజింగ్

**చౌటకూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రైతుకు జామీను ఇచ్చిన మరో రైతు బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదును (రైతు బంధు, ఆసారా పింఛను) బాకీ కింద జమ చేసుకున్న బ్యాంక్ మేనేజర్ వైనమిది. మండల పరిధిలోని బొమ్మారెడ్డి గూడెం గిరిజన తండాకు చెందిన హట్యా రాములు ఏడేంట్ల క్రితం చౌటకూరులోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో బేగరి రాములు జామీనుతో రుణం తీసుకున్నాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రుణం మాఫీ అవుతుందని సదరు రైతు తన పంట రుణాన్ని చెల్లించకపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన హట్యా నాయక్‌కు నయా పైసా కూడా రుణం మాఫీ కాలేదు. బేగరి రాములు ఖాతాలో నాలుగైదు రోజుల క్రితం రైతు బంధు పథకం కింద 6వేల రూపాయలు, రెండు వేల రూపాయల పించన్లు క్రెడిట్ అయినాయి. బ్యాంక్‌లో నిల్వ ఉన్న డబ్లును విత్‌డ్రా చేసుకునేందుకు బ్యాంక్‌కు రాములు వెళ్లి విత్‌డ్రా ఫాం నింపి ఇవ్వగా నీ ఖాతాలో డబ్బులు లేవని హట్యా నాయక్ అప్పు కింద నీ ఖాతాలో ఉన్న డబ్బులను భర్తీ చేసుకున్నామని మేనేజర్ చెప్పడంతో ఖంగుతిన్న రాములు హట్యా నాయర్‌కు సమాచారం అందిం చడంతో హట్యా నాయక్ బొమ్మారెడ్డిగూడెం సర్పంచ్ జైపాల్ నాయక్ తో కలిసి బ్యాంక్‌కు చేరు కుని రాములు ఖాతాలో నుంచి రాములు అనుమతి లేకుం డా డబ్బులను ఎలా ట్రాన్స్‌ఫర్ చేస్తారని మేనేజర్ మాధవరెడ్డిని నిల దీశారు. సర్పంచ్ జైపాల్‌నాయక్ జిల్లా అదనపు కలెకర్ పాండు తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనే జర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చేస్తానని హామీ చేశారు.

**బద్రిగూడెంలో ముగ్గురు రైతుల ఖాతాలు ఫ్రీజ్..**

మండల పరిధిలోని బద్రిగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు రైతుల బ్యాంక్ ఖాతాలను తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మాధవరెడ్డి ఫ్రీజ్ చేశారు.
బైరు గంగయ్య, గంగయ్య భార్య సాయ మ్మ, కుమారుడు శేఖర్‌లకు బ్యాంక్ ఖాతాలను గంగయ్య రుణం చెల్లించకపోవడంతో ముగ్గురి ఖాతాలను ఫ్రీజ్ చేశారు. గంగయ్య తండ్రి మల్లయ్య 2022లో మృతి చెందగా మల్లయ్య ఖాతాలో ఉన్న 20 వేల రూపాయలను కుమారుడు గంగయ్య ఖాతాలో ఏడాడిన్నరగా బ్యాంక్ చుట్టూ చెప్పుల రిగేలా తిరిగాడుతున్నా మేనేజర్ స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



చౌటకూరులో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో మేనేజర్‌తో వాగ్వాదం దృశ్యం

## భారీగా పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు

### భారంగా మారిన సాగు

### ఎకరాకు రూ.8వేల మేర అదనపు భారం

### ఒక్కో కాంప్లెక్స్ ఎరువు ధర రూ.250దాకా పెరిగిన వైనం

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** పెరుగుతున్న రసాయన ఎరువుల ధరలు అన్నదాతలకు సాగును భారంగా మారుస్తున్నాయి. యూరియా, డిఎపి మినహా మిశ్రమ ఎరువల తయారికి ముడి సరుకు అవసరం కాగా ఆ ముడిసరుకు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. అయితే ప్రస్తుతం పశ్చిమాసియా యుద్ధంతోపాటు ఎడతెగకుండా సాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం రాష్ట్రంలో కాంప్లెక్స్ ఎరువుల ధరలు అమాంతం పెరిగాయి. గతంలో బస్తాకు రూ.200 నుంచి రూ.300 మేర పెరగడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఎరువుల ధరలు భారీగా పెరగడంతో రానున్న ఖరీఫ్ సాగు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఎక్కువగా ఉన్నా యూరియా కలిపి అధిక మోతాదులో పంటలకు వేసేవారు. అయితే ఇప్పుడు యూరియాను ఎకరానికి రెండుబస్తాల చొప్పున మూడు దఫాలుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి రావడంతో కాంప్లెక్స్ ఎరువుల వినియోగాన్ని పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం చడీ చప్పుడు లేకుండా కాంప్లెక్స్ ఎరువుల ధరలను అమాంతం పెంచడంతో ఎకరా సాగుకు రైతు అదనంగా రూ.8వేల మేర భారాన్ని మోయాల్సి వస్తోంది. కాంప్లెక్స్ ఎరువుల్లో ఎక్కువగా 20:20:13ను రైతులు వినియోగిస్తారు. అయితే గతంలో ఈ ఎరువు ధర తక్కువగా ఉండడంతో రైతులు ఎక్కువగా వినియోగిస్తుంటారు. ప్రస్తుతం ఈ ఎరువు ధరను కూడా పెరగడంతో అన్నదాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఇలా..**

20:20:13 పాత ధర (50కిలోల బస్తా)కు రూ.1500ఉండగా ప్రస్తుతం రూ.1800కు పెరిగింది.
అదేవిధంగా 16:20:013 ధర రూ.1400 నుండి రూ.1750కు , 14:35:14 ధర రూ.2150 నుండి రూ.2350కు, 15:15:15 ధర రూ.1650 నుండి రూ.1950కు, 10:26:26 ధర రూ.1950 నుండి రూ.2025కు, ఎస్ఎస్‌పి రూ.615 నుండి రూ.775కు, పొటాష్ (ఎంఒపి) రూ.1850 నుండి రూ.1975కు, 16:16:16 ధర రూ.1675 నుండి రూ.2050కు, 12:32:16 ధర రూ.1850 నుండి రూ.1950కు, 24:24:0 ధర రూ.2000 నుండి రూ.2200కు పెరిగింది.
ఇప్పటికే పలు ఆర్థిక, ప్రకృతి సవాళ్ల మధ్య సేద్యాన్ని నెట్టుకొస్తున్న అన్నదాతలకు పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఆశనిపాతంగా మారాయి. మరో నెలా పదిహేనురోజుల్లో వానాకాలం సాగు ప్రారంభం కానుంది. పంటలకు వివిధ పోషకాలు అందించేందుకు రైతులు యూరియా, డిఎపితోపాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులను వినియోగిస్తుంటారు. అయితే భారీగా పెరిగిన ఎరువుల ధరలు అన్నదాతలను బెంబేళెత్తిస్తున్నాయి.

### మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ కేసు

## పైలట్ రోహిత్‌రెడ్డికి బెయిల్

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో తాండూరు మాజీ ఎంఎల్ఎ, బిఆర్ఎస్ నాయకుడు పైలట్ రోహిత్ రెడ్డికి హైకోర్టు మంగళవారం నాడు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత నెల 14వ తేదీన మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో గల రోహిత్ రెడ్డికి చెందిన ఫాం హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్ పోలీసులు రట్టు చేయ డం తెలిసిందే. ఈ సందర్భంగా రోహిత్ రెడ్డితో పాటు అతని సోదరుడు రితేష్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్ సహా 12 మంది ని పోలీసులు అరెస్టు చేయడం విదితమే. ఇందులో డ్రగ్స్ సేవించిన పరిస్థితుల్లో పోలీసులపై కాల్పులు జరిపినందుకు రోహిత్ రెడ్డి అతని సో దరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీ వ్యాపారవేత్త నమిత్ శర్మలను పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. డ్రగ్స్ సేవించిన ఎంపి మ హేష్ యాదవ్ సహా ఇతరులకు స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేశారు. కాగా ఫాం హౌస్‌లో డ్రగ్స్ పార్టీలకు సంబం ధించి రోహిత్ రెడ్డి సహా రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను పోలీసులు పలుమార్లు కస్టడీలోకి తీసుకుని విచారించి కీలక సమాచారం సేకరించారు. ఈ కేసుకు సంబంధించి చేవెళ్ల పోలీసుల విచారణ ఇంకా కొనసాగుతోంది. కేసు విచారణ సాగుతుండగా రోహిత్ రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను రాజేంద్రనగర్ కోర్టు తిరస్కరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. రోహిత్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను ఈ నెల ఎనిమిదవ తేదీన హైకర్టు విచారించి తీర్పును రిజర్వ్ చేసింది. దీనిపై మంగళవారం ఉదయం హైకోర్టు రోహిత్ రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా రోహిత్‌రెడ్డికి బెయిల్ మంజూరు సందర్భంగా హైకోర్టు షరతులను విధించింది. ఈ కేసు విచారణ ముగిసే వరకు రోహిత్ రెడ్డి తన పాస్‌పోర్టును పోలీసులకు అప్పగించాలని, నిబంధనల మేరకు పోలీసుల ఎదుట విచారణకు హాజరుకావాలని, సాక్షులను ప్రభావితం చేయరాదని, దర్యాప్తుకు సహకరించాలని ఆదేశించింది. బెయిల్ ష్యూరిటీలు పూర్తయిన తరువాత బుధవారం రోహిత్‌రెడ్డి జైలు నుంచి విడుదల అయ్యే వీలుంది. మరోవైపు రోహిత్‌రెడ్డితోపాటు కాల్పుల ఘటనలో అరెస్టయిన రితేష్ రెడ్డి, నమిత్‌శర్మ ఇంకా జైల్లోనే వున్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పాదయాత్ర భగ్నం

### బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

### ఎఐఎస్ఎఫ్ నేతలు మణికంఠరెడ్డి, లక్ష్మణ్

**హైదరాబాద్ ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి తలపెట్టిన సీఎం ఇంటి పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. పాదయాత్రగా ముఖ్యమంత్రి ఇంటికి వెళ్లాలని బయలుదేరిన విద్యార్థిసంఘం నేతలను పోలీ సులు అడ్డుకుని అరెస్టు చేశారు. దీంతో విద్యార్థి సంఘం నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొద్దిసుపు ఉద్రిక్తత నెలకొంది. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు హిమాయత్‌నగర్ నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వరకు పాదయాత్రగా బయలుదేరారు. శాంతియుతంగా ముందుకు సాగుతున్న విద్యార్థులను మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామికమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాపాలన అని మాట్లాడే ప్రభుత్వం విద్యార్థులు తమ హక్కుల కోసం పోరాడితే, స్పందించాల్సింది పోయి అరెస్టులతో అడ్డుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బానోతు రఘురాం, గ్యార నరేష్, బాలసాని లెనిన్,రాజు,సొతుకు ప్రవీణ్ , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య యాదవ్, ఎండీ అన్వర్, రామగల్ల నరేష్, వి.ఆంజనేయులు, శాంతి కుమార్,కైలాష్ పాల్గొన్నారు.

## ఒపెక్ కూటమి నుంచి వైదొలుగుతున్న ఎమిరేట్స్

**అబూదాబి, ఏప్రిల్ 28:** పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికా దాడులు గల్ఫ్‌దేశాల్లో చిచ్చురేపుతోంది. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల కూటమి ఒపెక్‌నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూటమినుండి వచ్చేనెల ఒకటినుంచి వైదొలుగుతున్నట్లు మంగళవారం ప్రకటించింది. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేపట్టిన వ్యూహాత్మక దాడులే ఈ చిచ్చుకు ప్రధాన కారణం అని తేలింది. ఇరాన్ యుద్ధం, హార్ముజ్ జలసంధి స్తంభవంటి వాటితో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభాన్ని సృష్టించి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్న తరుణంలో యూఏఈ ఈ నిర్ణయం తీసుకుంది. తమ దీర్ఘకాలిక వ్యూహాత్మక, ఆర్థిక ప్రాధాన్యతలకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నట్లు యూఏఈ ప్రకటించింది. యూఏఈ చాలా కాలంగా ఈ రెండు కూటముల్లో భాగస్వామిగా ఉందని, ప్రపంచానికి భవిష్యత్తులో మరింత ఇంధన అవసరమవుతుందని, డిమాండ్ పెరుగుతుందని ఇంధన శాఖ మంత్రి సుహైల్ అల్ మజ్రూయి అన్నారు. ఈ నిర్ణయం తీసుకోవడానికి ఇదే సరైన నిర్ణయమని ఎమిరేట్స్ భావిస్తుందని చెప్పారు.



తెలంగాణ ప్రభుత్వం
కోదాడ మునిసిపాలిటీ :: సూర్యాపేట జిల్లా
ఇ-మెయిల్: kodad.mc@gmail.com
No.MCK/E1/01/MGF/2026-27 ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన తేది: 28.04.2026
కోదాడ మునిసిపాలిటీ కమిషనర్ గారిచే, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా మునిసిపల్ సాధారణ నిధి క్రింద ఆ మునిసిపాలిటీలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా ప్రోగ్రాం క్రింద, పారిశుధ్యానికి JCB మరియు లేబర్, ట్రాక్టర్ యొక్క ఏర్పాటు మరియు LED డ్రైవ్స్ మరియు ట్రిప్స్, స్వీపింగ్ మెషీన్, బ్లీచింగ్ పౌడర్, సున్నం పౌడర్ యొక్క సరఫరా అందజేతకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. పనుల సంఖ్య: 7, అంచనా ధర: 24.90 లక్షలు. 1) బిడ్ దాఖలు ప్రారంభ తేది: 29.04.2026 ఉ.11.30 గం. 2) బిడ్ దాఖలు ముగింపు తేది: 02.05.2026 మ.03.30 గం. 3) టెక్నికల్ బిడ్ తెరచు తేది: 02.05.2026 సా.04.00 గం. 29.04.2026 నుండి వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుంది. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వద్ద పని వివరాలను చూడవచ్చును. తదుపరి వివరాలు మరియు స్పష్టతలను అన్ని పని రోజులలో కార్యాలయ వేళలలో కోదాడ మునిసిపాలిటీ కమిషనర్ లేదా మునిసిపల్ ఇంజనీర్ నుండి పొందవచ్చును. కమిషనర్: 8374450356, ME: 8374450357.
DIPR.No.1596-PP/CL/Advt/1/2026-27, తేది: 28.04.2026 సం/- కమిషనర్, కోదాడ మునిసిపాలిటీ

29-4pg4:29-4pg4.qxd 4/28/2026 5:22 PM Page 1



వార్త

ఇంద్రియ పరమైన విషయాలతో ఎంతగా మనిషి తెగతెంపులు చేసుకుంటాడో, అంతగా అతడు భగవంతుని పట్ల ఆకర్షితుడవుతాడు.

- రమణ మహర్షి


# అమలుకు నోచుకోని చట్టాలెందుకు?

మానవ జాతిని పట్టిపీడిస్తున్న మద్యపానం, ధూమపానాన్ని పారద్రోలే విషయంలో పాలకులకు ఆరాటమే కానీ త్రికరణశుద్ధి లేదనే చెప్పాలి. ఈ రెండు వ్యసనాలు దేశంలో ఎన్నో కోట్ల కుటుంబాలను చిద్రం చేస్తున్నాయి. ఎంతో మంది మంచానికి పరిమితమై కృంగికృశించిపోతున్నారు. లక్షల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో ఎంతటి మారణహోమం సృష్టిస్తున్నాయో పాలకులకు తెలియంది కాదు. చట్టాలుచేస్తున్నారు. ఉపన్యాసాలు ఇస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రకటనలు ఇస్తున్నారు. కానీ త్రికరణశుద్ధిగా వీటిని నియంత్రించేందుకు ప్రయత్నం చేయడం లేదు. మరో కోణంలో ఆలోచిస్తే ప్రోత్సహిస్తున్నారని కూడా చెప్పొచ్చు. కొందరిని కొంతకాలం మోసం చేయొచ్చు. అందరిని కొంత కాలం మోసం చేయొచ్చు. కానీ అందరిని ఎళ్లకాలం మోసం చేయాలంటే అది భ్రమే అవుతుంది. అలా ప్రజలను మోసం చేసినవారు, వేధించిన వారు గతంలో ఎందరో చక్రవర్తులు, రాజులు కాలగర్భంలో కలిసిపోయారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి, ప్రజా అవసరాలను గుర్తించి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని వారి ఆదరాభిమానాలు పొంది వారి హృదయాల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న నాయకులు ఎందరో ఉన్నారు. మద్యం విషయంలో ఆదాయాన్ని పెంచుకునేందుకు పాలకులు వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యవాదుల్లో ఆవేదన వ్యక్తం అవుతున్నది. మద్యం సరే సారాను నిషేధించారు. ఏమాత్రం అమలువుతున్నదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గుడంబా, నాటుసారా ఒక కుటీర పరిశ్రమగా వర్ధిల్లుతున్నది. ఈ అక్రమ సారా ధాటిని తట్టుకోలేక నిరోధించలేక ఏకంగా చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టారు. తెలుగు రాష్ట్రాల్లో కానీ, మద్యనిషేధం అమలు కాని దేశంలోని అనేక రాష్ట్రాల్లో అమ్ముడవుతున్న మద్యంలో అధిక శాతం ఈ చీప్ లిక్కరే. ఈ చీప్ లిక్కర్ తాగి లక్షలాది మంది రకరకాల వ్యాధులకు లోనవుతున్నారు. దేశంలో జరుగుతున్న రోడ్డుప్రమాదాల్లో అధికశాతం వాహన చోదకులు మద్యం మత్తులోనే ఉన్నట్లు దర్యాప్తులో వెలుగు చూసింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో వేలాది మంది పట్టుబడుతున్నారు. జరిమానా చెల్లించి తిరిగి అదే పంథాలో వాహనాలు నడుపుతున్నారు. ఇక హత్యలు, అత్యాచారాలు లాంటి తీవ్ర నేరాలకు పాల్పడినవారిలో అధిక శాతం మద్యంమత్తులో ఉన్నవారేననేది పోలీసు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఒకనాడు వందల కోట్లలో ఉన్న ఆదాయం నేడు వేలాది కోట్ల రూపాయలకు చేరుకున్నది. యేడాది యేడాదికి పెంచుకుంటూనే పోతున్నారు. మద్యం ఆదాయమే మహాప్రసాదంగా మారిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. ఇలా మద్యాన్ని పాలకులే ఆదాయం కోసం పెంచిపోషిస్తుంటే ధూమపానాన్ని నియంత్రించేందుకు కొన్ని చర్యలు చేపడుతున్నారు. నిబంధనలు పెడుతున్నారు. కానీ అవేమీ వీటిని నిరోధించలేకపోతున్నాయి. మద్యపానం కంటే ధూమపానం ప్రజారోగ్యానికి అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నది. ఊపిరితిత్తుల కేన్సర్, గుండెజబ్బులు, ఒకటేమిటి రకరకాల వ్యాధులకు ధూమపానం కేంద్ర బిందువుగా మారుతున్నది. అన్నిటి కంటే ముఖ్యంగా కేన్సర్‌ను విస్తరింపచేయడంలో ధూమపానం అగ్రస్థానంలో ఉందని చెప్పొచ్చు. పొగతాగేవారే కాదు, వారు తాగి వదిలిన పొగను పీల్చే చుట్టుపక్కల ఉన్నవారు కూడా రకరకాల వ్యాధులకు లోనవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నూటముప్పైకోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగితేలుతున్నారనే అంచనా. భారత దేశానికి సంబంధించి ఇరవై కోట్ల మందికిపైగా పొగాకుకు అలవాటుపడ్డారు. బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆ తర్వాత అలవాటుగా మారిపోతున్నది. పదిహేనేళ్ల వయసులోనే పొగతాగడం ఆరంభం కావడం ఆందోళన కలిగించే అంశం. సిగరెట్ పొగలో నాలుగు వేల ఎనిమిదివందలకుపైగా విషవాయువులు ఉన్నాయని అవి అనేక రోగాలకు కారణాలవుతున్నాయని వైద్యనిపుణులు ఏనాటి నుంచో హెచ్చరిస్తున్నారు. పొగాను నిషేధించేందుకు గత రెండు దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. చట్టాలు చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధించి ఉత్తర్వులను కూడా జారీ చేశారు. కానీ అవేమీ అమలు కావడం లేదు. ఎవరు అమలు చేస్తారో స్పష్టత లేదు. ఆ చట్టంలో కూడాఎన్నో లొసుగులు ఉన్నాయి. మరొకపక్క ఈ బీడీ పరిశ్రమ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కోట్లాది మందికి బతుకు తెరువు ఇస్తున్నమాట కాదనలేని సత్యం. అడవుల్లో ఉన్న లక్షలాది మంది గిరిపుత్రులకు బీడీ ఆకుల సేకరణ ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి. కొన్ని శతాబ్దాలుగా అదొక కుటీర పరిశ్రమగా వర్ధిల్లుతున్నది. పొగాకును నిషేధిస్తే ఆ సాగుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు లక్షలాది మందికూలీలుబజారున పడతారు. జీవనోపాధి కోల్పోతారు. యేటా దాదాపు నలభై వేలకోట్ల రూపాయలకుపైగా పొగాకు వ్యాపారం జరుగుతున్నది. ఈ కుటుంబాలను వీధిపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ఆ బాధ్యతను పాలకులు విస్మరించి కాగితాల్లో నిషేధాన్ని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. అందుకే అది ఆచరణకు నోచుకోలేదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధిఉంటే జీవనోపాధి కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్పత్తులను, అమ్మకాలను, వినియోగాన్ని భూటాన్ దేశంలో లాగా పూర్తిగా నిషేధించాలి. అప్పుడే దీనికి పరిష్కారం దొరుకుతుంది. అంతేకానీ ఆచరణ సాధ్యం కానీ, అమలు చేయలేని చట్టాలు చేస్తే పాలకులు నవ్వులపాలు అవుతారు.



అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.

వార్విక్



అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.

వి. జాన్సన్

## ప్రజావాక్కు

### పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రస్తుత కాలంలో పర్యావరణ కాలుష్యం రోజురోజుకు పెరుగుతోంది. అడవులు తగ్గిపోవడం, చెట్ల నరికివేత కారణంగా ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. దీని వల్ల వర్షపాతం అస్థిరంగామారుతోంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి మన ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, వాటిని కాపాడటం కూడా ప్రతి పౌరుడి బాధ్యత. చిన్నస్థాయిలో అయినా మనం చేసే ప్రయత్నం భవిష్యత్తులో పెద్ద మార్పుకు దారి తీస్తుంది. మన చుట్టూ పచ్చదనం పెంచడం ద్వారా మనమే కాకుండా రాబోయే తరాలుపెరుగుతున్న కాలుష్యం నుంచి బయట పడతారు. వారికి ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించగలుగుతాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### ఉద్యోగుల కష్టాలు తీర్చండి

ఒక పే కమిషన్ నియమిచడానికి 10ఏళ్ళు. చాలా ఓర్పుగా వేచి ఉన్న సార్ ఉద్యోగుల జీవితాల వెలుగులు కోసం ఆశించిన సంవత్సర్ర వచ్చినా మళ్ళీ దాని మార్పులు చేర్పులు అర్హతలు అదాయాలు ఖర్చులు అంటూ ఇంకో రమారమి రెండు సంవత్సరాలు కాలం గడిపేసి ఇలోగా ప్రభత్వాలు మారయో కమిషన్‌కు మళ్ళీ కాలయాపన.. ఇది పరిస్థితిఉద్యోగుల కష్టాలు. అదే ఎమ్ఎల్ఏల, ఎమ్పీల జీతాల పెంపు క్షణాలలో జరిగిపోతాయి. రోజులతో కూడా పనిలేదు. వడ్డించేవాడు మనవాడైతే.. సామెత. ఉద్యోగుల జీతాలకు ఎలక్షన్స్ పెట్టేయండి సరిపోతుంది. నిరాశకు మాత్రం రెడీగా ఉంటే మంచిదేమో. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగుల కష్టాలు పెరుగుతూనే ఉన్నాయి. పెండింగ్‌లోనే ఉంటున్నాయి.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### నీ జీవితం నీదే

నేటి కాలంలో ఎవరి జీవితం వారిదే....నీకు నువ్వే జీవితం పట్ల పోరాడాలి, భరించాలి, సాధించాలి. విపత్కర పరిస్థితుల్లో అండగా ఉండాల్సిన అన్నదమ్ములు, తోటి బంధువులు ఆమడ దూరంలో వెళ్తున్నారు. దగ్గరికి వెళ్తే మనకు ఏమైనా డబ్బులు అవుతాయేమో అనే సందిగ్ధంలో ఉన్న సమాజం. కాబట్టి మనకు మనమే ధైర్యంగా ఉండి జీవితాన్ని ముందుకు సాగేలా మలచుకోవాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### సత్వర చర్యలు అవసరం

ఏ రాష్ట్రంలో అయినా ప్రభుత్వం విస్తృత పరిచే బృహత్కార్యాల్లో నూతన భవనాలకోసం భూమి సరిపడా లేనప్పుడు వ్యక్తుల నుండి కొన్ని, నియమాలు, షరతుల ప్రకారం భూమిని కొనుగోలు చేస్తారు. ఆవిధంగా ప్రభుత్వానికి తదుపరి పరిపాలన వేగంగా జరిగేందుకు ఆస్కారం, అవకాశం ఒక శుభ సూచకం. ఏపిలో పారిశ్రామిక సెజ్‌ల నిర్మాణానికి మొదటి సారి భూసేకరణ జరిగిన కొన్ని గ్రామాల వ్యక్తులు 20 ఏళ్లకు పైబడి ఏర్పడిన కాలుష్యంకారణంగా వందలు మరణించారు. పర్యావరణ సమతుల్యం ఒక పెద్ద సమస్య కావున నూతన వాతావరణ ప్రభావాన్ని నివారణ చర్యల ద్వారా సాధ్యమైన స్థాయిలో తగ్గించే అవకాశం ఉంది. అప్పుడు గ్రామ ప్రజలు కొన్ని జాగ్రత్తలు పాటిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదించి ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవడం అవసరం.

- బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

### ప్లస్ టు అవసరం

ఈ మధ్య తెలంగాణ రాష్ట్ర నూతన విద్య విధానంలో ప్లస్ టు ఇంటర్మీడియట్ తప్పకుండా ఉండాలి. గురుకుల జూనియర్ లెక్చరర్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. గురుకుల లెక్చరర్‌లకు కుడా గెజిటెడ్ హోదా తప్పకుండా కలిపించాలి. గురుకుల జూనియర్ కళాశాలలో సామాజిక శాస్త్రాలు అయినా ఆర్ట్స్ గ్రూపులు, ఎకనామిక్స్, సివిక్స్, హిస్టరీ, కామర్స్ సబ్జెక్టులు వచ్చే విద్య సంవత్సరం 2026-2027 జూన్ నెల నుండి ప్రారంభం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### క్రీడా వేదికను ఏర్పాటు చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడలఅభివృద్ధికి చేపడుతున్న సమగ్ర చర్యలు రాష్ట్రయువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. గ్రామస్థాయి నుంచే క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 90కోట్ల రూపాయల ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈనిధులతో మైదానాలు, వ్యాయామశాలలు అంతర్గత క్రీడా ప్రాంగణాల నిర్మాణం చేపట్టడమే కాకుండా, ఇప్పటికే ఉన్న వసతులను ఆధునికీకరిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక సమగ్ర క్రీడా వేదిక ఉండాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా సామగ్రి అందజేత, శిక్షణా కార్యక్రమాల ద్వారా దాగిఉన్న ప్రతిభను వెలికితీస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో వ్యాయామాన్ని తప్పనిసరి చేస్తూ శారీరక దృఢత్వంపై ప్రత్యేక దృష్టి సారించారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# మెరుగైన ప్రణాళికలకు జనగణనే ఆధారం

***సమాజంలోని ప్రతివర్గం ఈప్రక్రియలో భాగస్వాములై, సరైన సమా చారాన్ని అందించినప్పుడే దేశాభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయి వరకు చేరుతాయి. వనరుల కేటాయింపులో హేతుబద్ధత రావాలన్నా, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో మెరుగైన ప్రణాళికలు రూపొందించాలన్నా ఈ గణాంకాలే ప్రాణాధారం. 2027 జనగణన కేవలం సంఖ్యల గణనకాదు, అది భారతదేశ భవిష్యత్ ప్రగతికి వేస్తున్న ఒక శాస్త్రీయ పునాది. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, ఈ డిజిటల్ యజ్ఞంలో పాలుపంచుకోవడం ద్వారా దేశా భివృద్ధికి తోడ్పడాలి. అప్పుడే మనం కలలు గనే 'వికసిత్ భారత్' సాకారం అవుతుంది.***

రామ కిష్టయ్య సంగన భట్ల

భారతదేశ పరిపాలనా ముఖచిత్రంలో జనగణన అనేది కేవలం అంకెల సమాహారం కాదు, అది ఒక దేశపు గతాన్ని విశ్లేషిస్తూ, వర్తమానాన్ని అంచనా వేస్తూ, భవిష్యత్తును నిర్మించే అత్యంత శక్తిమంతమైన శాస్త్రీయఆయుధం. ఒక దేశ ఆర్థిక పురోగతికి, సామాజిక న్యాయానికి, వనరుల సమతుల్య పంపిణీకి పునాదిగా నిలిచే ఈ ప్రక్రియ, మారుతున్న కాలంతో పాటు సాంకేతిక పరిమళాన్ని అద్దుకుంటూ సరికొత్త రూపును సంతరించుకుంటోంది. 1872లో ప్రయోగాత్మక పునాదులతో మొదలై, 1881 నుండి నేటి వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్న ఈ దశాబ్దాల సంప్రదాయం, కోవిడ్19 మహమ్మారి సృష్టించిన అనూహ్యవిరామం తర్వాత 2027లో సరికొత్త డిజిటల్ అధ్యాయాన్ని ప్రారంభించబోతోంది. ఈ నేపథ్యంలో, 2027జనగణన అనేది భారత ప్రజాస్వామ్యవ్యవస్థలో ఒక విప్లవాత్మక మలుపుగా, దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలవనుంది. భారతదేశంలో జనగణన చరిత్రను అవలోకనం చేస్తే, బ్రిటీష్ పాలనా కాలంలో లార్డ్ మేయో హయాంలో 1872లో తొలి ప్రయత్నం జరగ్గా, డబ్ల్యు.డబ్ల్యు. హంటర్ నేతృత్వంలో 1881లో మొదటి సమగ్ర గణన నిర్వహించబడింది. నాటి నుండి నేటి వరకు యుద్ధాలు, కరవులు సంభవించినా ఆగని ఈ ప్రక్రియ, 2021లో మాత్రం కరోనా సెకండ్ వేవ్ తీవ్రత కారణంగా వాయిదా పడక తప్పలేదు. దాదాపు 150ఏళ్ల చరిత్రలో ఇలాంటి విరామం రావడం ఇదే తొలిసారి. అయితే, ఈ ఆలస్యం దేశ ప్రణాళికా రచనపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికీ 2011 గణాంకాలపైనే ఆధారపడి సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఈ సుమారు 15 ఏళ్ల అంతరంలో దేశ జనాభా నిర్మాణం, పట్టణీకరణ వేగం, అక్షరాస్యత నమూనాలు సమూలంగా మారిపోయాయి. అందువల్ల, 2027లో జరగబోయే గణన ఆ పాత వివరాలకు, నేటి వాస్తవాలకు మధ్య ఉన్న భారీ అంతరాన్ని పూరించే వారధిగా మారుతుంది. ఈసారి జరగనున్న గణనలో అత్యంత వినూత్నమైన, ప్రతిష్టాత్మకమైన అంశం స్వీయ గణన డిజిటల్ ఇండియా సఫలీకృతమవుతున్న తరుణంలో, పౌరులు తమ వివరాలను తామే నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించడం ఒక గొప్ప ప్రజాస్వామ్య సంస్కరణ. గతంలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించేవారు. దీనివల్ల భాషా సమస్యలు, సమాచార సేకరణలో పొరపాట్లు, సమయభావంవంటి ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ విప్లవం పుణ్యమా అని, ప్రభుత్వం కేటాయించిన పోర్టల్ ద్వారా ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల విద్య, వృత్తి, ఆదాయం, నివాస స్థితిగతులను పారదర్శకంగా నమోదు చేయవచ్చు. ఈ స్వీయ నమోదు ప్రక్రియను పూర్తి చేసి, పొందిన ప్రత్యేక ఐడీని భద్రపరుచుకోవడం ద్వారా, తర్వాత వచ్చే క్షేత్రస్థాయి సిబ్బందికి కేవలం ఆ సంఖ్యను చూపిస్తే సరిపోతుంది. ఇది దేశవ్యాప్తంగా లక్షలాది గంటల శ్రమను, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఆదా చేయడమే కాకుండా, డేటా సేకరణలో ఖచ్చితత్వాన్ని గణనీయంగా పెంచుతుంది. గణాంకపరంగా చూస్తే, 2011లో భారత జనాభా 121.08 కోట్లుగా ఉండగా, ప్రస్తుత అంచనాల ప్రకారం అది 140 కోట్లు దాటి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2011లో అక్షరాస్యత 74.04శాతంఉండగా, నేడు అది 80శాతానికి పైగా చేరుకున్నట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా స్త్రీ, పురుష నిష్పత్తిలో వస్తున్న మార్పులు, గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు జరుగుతున్న భారీ వలసలు, పెరుగుతున్న మధ్యతరగతి జనాభా వంటి అంశాలు 2027 గణన



ద్వారా స్పష్టమవుతాయి. ఈ డేటా లేకపోవడం వల్ల నేడు రేషన్ కార్డుల కేటాయింపు, గృహనిర్మాణ పథకాలు, నియోజక వర్గాల పునర్విభజన వంటి కీలక అంశాల్లో కొంత అనిశ్చితి నెలకొంది. 2027 గణాంకాలు వెలువడిన వెంటనే, 2029 తర్వాత జరగబోయే పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనకు ఇది ప్రాతిపదికగా మారుతుంది. తద్వారా రాజకీయ ప్రాతినిధ్యంలో సమతుల్యత ఏర్పడుతుంది. సాంకేతికతతో కూడిన ఈ ప్రయాణంలో సవాళ్లు కూడా అదే స్థాయి లో ఉన్నాయి. భారతదేశం లాంటి భిన్నత్వంతో కూడిన దేశంలో డిజిటల్ విభజన ఒక ప్రధాన సమస్య. పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ వినియోగం అధికంగా ఉన్నప్పటికీ, మారుమూల గిరిజన ప్రాంతాల్లో, వెనుకబడిన గ్రామాల్లో ఇంటర్నెట్ లభ్యత, సాంకేతిక అవగాహన తక్కువ. వృద్ధులు, చదువు కోని వారు స్వీయ గణనలో పాల్గొనడం కష్టతరం కావచ్చు. ఇక్కడే ఎన్యూమరేటర్ల పాత్ర కీలకం కానుంది. స్వీయగణన అనేది సంప్రదాయ పద్ధతిని పూర్తిగా తొలగించదు, కానీ దానిని సులభతరం చేస్తుంది. ఎవరైతే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేరో, వారి వద్దకు సిబ్బంది నేరుగా వెళ్లి వివరాలు సేకరిస్తారు. అలాగే, సేకరించిన డేటా భద్రత గోప్యత విషయంలో ప్రజల్లోఉన్న ఆందోళనలను ప్రభుత్వం పటిష్టమైన సైబర్ భద్రతా చర్యల ద్వారా తొలగించాల్సి ఉంటుంది. మరోవైపు, వర్తమాన రాజకీయ సామాజిక కోణంలో కులగణన డిమాండ్ ఈసారి జనగణనకు మరింత ప్రాధాన్య తను తెచ్చిపెట్టింది. దేశంలోని ఓబీసీలు, ఇతర సామాజికవర్గాల వాస్తవ సంఖ్యను తెలుసుకోవడం ద్వారానే జనాభా ప్రాతిపదికన వాటా సాధ్యమని ఒక వర్గం వాదిస్తోంది. స్వతంత్ర భారత చరిత్రలో 1951 నుండి ఇప్పటివరకు కేవలం ఎస్సీ, ఎస్టీల గణాంకాలను మాత్రమే సేకరిస్తున్నారు. ఈసారి కులగణనను కూడా చేర్చాలన్న డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం దేశ సామాజిక గమనాన్ని మార్చివేస్తుంది. వనరుల పంపిణీలో అర్హులైన వారికి ప్రాధాన్యత దక్కాలంటే ఖచ్చితమైన కుల ఆర్థిక గణాంకాలు అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు. జనగణన అనేది కేవలం ప్రభుత్వానికి సంబంధించిన విషయం కాదు, అది ప్రతి పౌరుడి బాధ్యత. మనం ఇచ్చే ప్రతి చిన్న సమాచారం ఒక పెద్ద జాతీయ విధానానికి రూపకల్పన చేస్తుంది. 2027 జనగణన ద్వారా లభించే డేటా, భారతదేశం 2047నాటికి వికసిత్ భారత్‌గా ఎదగాలన్న లక్ష్యానికి ఇంధనంగా పనిచేస్తుంది. పౌరులు తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునేందుకుప్రభుత్వం రూపొందించిన ప్రక్రియ అత్యంత సరళంగా, పారదర్శకంగా ఉంది. ఈ ప్రక్రియ అంతటితో ముగిసిపోదు. ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో మీ ఇంటికి వచ్చినప్పుడు, మీరు ఆన్‌లైన్‌లో పొందిన ఎస్ఈ ఐడీని వారికి చూపించాలి. వారు తమ వద్ద ఉన్నడిజిటల్ పరికరాల్లో ఆ ఐడీని నమోదు చేయగానే మీరు ఇచ్చిన వివరాలు కనిపిస్తాయి. మీరు తెలిపిన సమాచారం, వారు ప్రత్యక్షంగా గమనించిన అంశాలు సరిపోలితే ప్రక్రియ ముగుస్తుం ది. ఒకవేళ ఏవైనా పొరపాట్లు ఉన్నా లేదా డేటా మ్యాచ్ కాకపోయినా, వారు తిరిగి కొత్తగా వివరాలను నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఈ ద్విముఖ ధృవీకరణ పద్ధతి వల్ల సమాచారంలో తప్పులుదొర్లే అవకాశం ఉండదు. స్వీయ గణనద్వారా పారదర్శకతను పెంచుతూ, సాంకేతికతను జోడిస్తూ నిర్వహిస్తున్న ఈ మహాక్రతువు, భారతపరిపాలనా వ్యవస్థలో ఒక నూతన శకాన్ని ఆవిష్కరిస్తుంది. సమాజంలోని ప్రతివర్గం ఈప్రక్రియలో భాగస్వాములై, సరైన సమాచారాన్ని అందించినప్పుడే దేశాభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయివరకు చేరుతాయి. వనరుల కేటాయింపులో హేతుబద్ధత రావాలన్నా, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో మెరుగైన ప్రణాళికలు రూపొందించాలన్నా ఈ గణాంకాలే ప్రాణాధారం. 2027జనగణన కేవలం సంఖ్యల గణనకాదు, అది భారతదేశ భవిష్యత్ ప్రగతికి వేస్తున్న ఒకశాస్త్రీయ పునాది. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, ఈ డిజిటల్ యజ్ఞంలో పాలుపంచుకోవడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలి. అప్పుడే మనం కలలుగనే 'వికసిత్ భారత్' సాకారం అవుతుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ప్రక్రియ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని పౌరుడిని నేరుగా భాగస్వామిని చేయడం ఒక గొప్పప్రజాస్వామ్య విజయం. ఈచారిత్రాత్మక మార్పుకు సాక్ష్యంగా నిలవడమే కాకుండా, సకల సమాచారాన్ని సద్వినియోగం చేసుకుని ప్రగతి పథంలో పయనించాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉంది. ●

# సూపర్ ఎల్‌నినోతో దహిస్తున్న దక్షిణ భారతం


టి. శ్రీనివాస్

ప్రపంచ వాతావరణ వ్యవస్థలో జరుగుతున్న మార్పులు ఇప్పుడు కేవలం శాస్త్రీయ చర్చల స్థాయిలో మాత్రమే కాకుండా సాధారణ ప్రజల జీవితాల్లో కూడా ప్రత్యక్ష ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ముఖ్యంగా సూపర్ ఎల్‌నినో అనే వాతావరణ పరిస్థితి ఈసారి దక్షిణ భారతదేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత సాధారణ స్థాయిని దాటి, ప్రజల దైనందిన జీవితాన్ని కష్టతరం చేస్తోంది. ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం, వర్షపాతం తగ్గిపోవడం, గాలిలో తేమ శాతం తగ్గడం వంటి పరిణామాలు ఒకేసారి కనిపిస్తున్నాయి. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో నీటి ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ అసమతుల్యత. ఇది ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం నమూనాలను ప్రభావితం చేస్తుంది. భారత్ వంటి వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఇది సాధారణంగా వర్షాభావ పరిస్థితులకు దారితీస్తుంది. ఈసారి 'సూపర్ ఎల్‌నినో'గా పిలవబడుతున్న స్థితి మరింత తీవ్రమైనదిగా భావిస్తున్నారు. సాధారణ ఎల్‌నినో కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు, దీర్ఘకాలిక ఎండలు, తక్కువ వర్షాలు ఈ పరిస్థితి ప్రత్యేక లక్షణాలు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అనేక జిల్లాల్లో 43నుండి 46డిగ్రీలసెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్న సమయంలో బయటకు రావడం ప్రమాదకరంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రతరం అవుతోంది. భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోవడం వల్ల బోర్లు ఎండిపోతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో కూడా వేడి గాలులు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. హీట్ స్ట్రోక్ కేసులు పెరుగుతుండటం ఆసుపత్రులపై అదనపు ఒత్తిడిని సృష్టిస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, బయట పనిచేసే కార్మికులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. ఈ పరిస్థితి అత్యంత తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రంగం వ్యవసాయం. ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే వర్షాలు ఆలస్యమవడం లేదా అసమానంగా పడటం వల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంటలకు అవసరమైన నీరు సరిపడకపోవడంతో వరి, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలసాగు కష్టతరంగా మారుతోంది. కొన్నిప్రాంతాల్లో విత్తనాలు మొలక దశలోనే ఎండిపోతున్నాయి. మరికొన్నిచోట్ల పూతరాకపోవడం లేదాపూత రాలిపోవడం వల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటల వృద్ధి మందగించడం కూడా గమనించవచ్చు. భూగర్భజలాలు తగ్గిపోవడం రైతులకు మరింత భారంగా మారింది. బోర్లపై ఆధారపడిన వ్యవసాయం ఖర్చును పెంచుతోంది. డీజిల్ మోటార్ల వినియోగం పెరగడంతో ఉత్పత్తివ్యయం అధికమవుతోంది. ఇదే సమయంలో పశుసంపద కూడా తీవ్రంగా ప్రభావితమవుతోంది. తగినంత నీరు, మేత అందక పాల ఉత్పత్తి తగ్గుతోంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై మరింత ఒత్తిడిని కలిగిస్తోంది. ప్రస్తుతపరిస్థితులు కొనసాగితే పంట దిగుబడిపై గణనీయమైన ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వరి ఉత్పత్తి తగ్గితే ఆహార భద్రతపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. పత్తి, కందులు వంటి వాణిజ్య పంటలు కూడా నష్టపోవచ్చు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో రైతులు పంటలను తిరిగి విత్తాల్సిన పరిస్థితి రావడం వారి ఆర్థిక భారాన్ని పెంచుతోంది. పెట్టుబడి ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గితే రైతులు అప్పుల ఊబిలో పడే ప్రమాదం మరింత పెరుగుతుంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు తక్షణ, దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నీటి సంరక్షణ కార్యక్రమాలు బలోపేతం చేయడం, సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించడం, వాతావరణ ఆధారిత పంట ప్రణాళికలు అమలుచేయడం వంటి చర్యలుఅత్యంత కీలకం. రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం అందించడం, పంటల బీమా సదుపాయాలను సులభతరం చేయడం కూడా అవసరం. నీటి కొరత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం తక్షణ అవసరంగా మారింది. ●

# ఏఐ విజృంభిస్తున్న వేళ.. ఉద్యోగాల దిశ ఎటు?

తరిగోపుల నారాయణస్వామి

ప్రపంచం ఒక గొప్ప మార్పు దశలో నిలిచింది. ఒకప్పుడు యంత్రాలు మనిషి శారీరక శ్రమను తగ్గించాయి. నేడు కృత్రిమ మేధస్సు, అనగా ఏఐ, మనిషి మేధో శక్తిని కూడా ప్రభావితం చేసే స్థాయికి ఎదిగింది. కంప్యూటర్ ముందు గంటల తరబడి చేసే అనేక పనులను కొన్ని క్షణాల్లో పూర్తి చేయగల సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా అనేక పేరొందిన సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉద్యోగులను తగ్గిస్తున్నాయి. వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్న వార్తలు యువతలో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇక భవిష్యత్తులో ఉద్యోగాలు ఉంటాయా? అనే సందేహం విద్యార్థి నుంచి ఉద్యోగి వరకు ప్రతి ఒక్కరి మనసులో మొదలవుతోంది. అయితే చరిత్రను పరిశీలిస్తే ప్రతి సాంకేతిక విప్లవం తొలుత భయాన్ని కలిగించినా, చివరికి కొత్త అవకాశాలకు దారి తీసినదే. ఆవిరి యంత్రం వచ్చినప్పుడు చేతిపనులు అంతరించిపోతాయని భావించారు. కంప్యూటర్లు వచ్చినప్పుడు కార్యాలయ ఉద్యోగాలు పోతాయని అనుకున్నారు. కానీ ప్రతి మార్పు కొత్త నైపుణ్యాలకు, కొత్త రంగాలకు, కొత్త ఉపాధి మార్గాలకు ద్వారాలు తెరిచింది. ఇదే సత్యం ఏఐ విషయంలోనూ వర్తిస్తుంది. కాబట్టి యువత భయపడాల్సిన అవసరం లేదు. మార్పును అర్థం చేసుకుని దానికి తగ్గట్టు సిద్ధంకావాలి. ఏ సాంకేతికత వచ్చినప్పటికీ కొన్ని రంగాలు ఎప్పటికీ మానవ ఆధారంగానే ఉంటాయి. ఆరోగ్య రంగం అందులో ప్రధానం. వైద్యులు, నర్సులు, ఫిజియోథెరపిస్టులు, మానసిక ఆరోగ్య నిపుణులు, అత్యవసర సేవల సిబ్బంది వంటి వృత్తులు ఎప్పటికీ అవసరమే. యంత్రం పరీక్షా ఫలితాలు చెప్పగలదు కానీ రోగి బాధను అర్థం చేసుకుని ధైర్యం చెప్పేది మనిషే. అందువల్ల ఆరోగ్య రంగంలో అవకాశాలు ఎప్పటికీ నిలకడగాఉంటాయి. విద్యా రంగం కూడా మానవ స్పర్శను కోల్పోదు. ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యాంశాన్ని బోధించేవాడు కాదు, విద్యార్థిలో ఆత్మవిశ్వాసం నింపేవాడు, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేవాడు. ఏఐ పాఠాలు చెప్పగలదు కానీ విలువలు నేర్పలేదు. గురువు చూపే మార్గదర్శకత్వం, ప్రేరణ, సహనం యంత్రం ద్వారా భర్తీ కావు. అందుకే మంచి ఉపాధ్యాయులకు భవిష్యత్తులో మరింత గౌరవం, మరింత డిమాండ్ ఉంటుంది. వ్యవసాయం ఆహార రంగం ఎప్పటికీ జీవనాధారం. అన్నంలేకుండా ఏ సమాజమూ నిలబడదు. ఆధునిక వ్యవసాయపద్ధతులు, ఆర్గానిక్ ఫార్మింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్, మార్కెటింగ్, వ్యవసాయ సలహా సేవలు వంటి రంగాల్లో విస్తారమైన అవకాశాలున్నాయి. గ్రామీణ యువత వ్యవసాయాన్ని సాంకేతికతతో మేళవిస్తే స్వయం ఉపాధి సాధించవచ్చు. నిర్మాణ రంగం, మౌలిక వసతుల రంగం కూడా ఎప్పటికీ కొనసాగుతాయి. ఇండ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్





వ్యవస్థలు, నీటి ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధి పనులు నిరంతరం అవసరం. సివిల్ ఇంజినీర్లు, ఎలక్ట్రికల్ నిపుణులు, మెకానికల్ సిబ్బంది, టెక్నీషియన్లకు ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. సేవారంగం మరో ముఖ్యమైన ఉపాధి ఆధారం. బ్యాంకింగ్, హోటళ్లు, పర్యాటకం, రవాణా, కస్టమర్‌సపోర్ట్, లాజిస్టిక్స్ రంగాల్లో మానవ సంబంధాలు కీలకం. వినియోగదారుడి అవసరాన్ని అర్థం చేసుకోవడం, సమస్యను ఓర్పుతో పరిష్కరించడం, విశ్వాసాన్ని కలిగించడం వంటి అంశాలు మానవ నైపుణ్యాలే. అందువల్ల ఈరంగాల్లో ఉద్యోగాలు కొనసాగుతూనే ఉంటాయి. సృజనాత్మక రంగాలు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం పొందుతాయి. రచయితలు, జర్నలిస్టులు, కళాకారులు, సంగీతకారులు, డిజైనర్లు, సినీ రంగ నిపుణులు, ప్రకటన రంగ సృజనకర్తలు వంటి వారికి కొత్త అవకాశాలు ఏర్పడతాయి. యంత్రం సమాచారం సమకూర్చగలదు కానీ హృదయాన్ని తాకే సృజన మనిషి నుంచే పుడుతుంది. అదే సమయంలో ఏఐ పెరుగుతున్న కొద్దీ దానిని నిర్వహించే ఉద్యోగాలు కూడా పెరుగుతాయి. డేటా విశ్లేషకులు, సైబర్ భద్రత నిపుణులు, రోబోటిక్స్ ఇంజినీర్లు, ఏఐ ట్రైనర్లు, డిజిటల్ నైతికత నిపుణులు వంటి కొత్త వృత్తులు అభివృద్ధి చెందుతాయి. కాబట్టి సాంకేతికత ఉద్యోగాలను పూర్తిగా తొలగించదు. వాటి స్వరూపాన్ని మాత్రమే మార్చుతుంది. యువత ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. డిగ్రీ ఒక్కటే భవిష్యత్తుకుసరిపోదు. నేర్చుకోవాలనే తపన, కొత్త నైపుణ్యాలు సంపాదించే అలవాటు, కమ్యూనికేషన్ నైపుణ్యం, సమస్య పరిష్కార దృక్పథం, సృజనాత్మక ఆలోచన ఇవే రేపటి ప్రపంచంలో విజయానికి పునాది. ఒకే ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి, స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు, ఫ్రీలాన్సింగ్, గ్రామీణ పరిశ్రమలు వంటి మార్గాలను పరిశీలించాలి. ప్రభుత్వాలు, విద్యాసంస్థలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. పాత సిలబస్‌తో కొత్త ప్రపంచానికి యువతను సిద్ధం చేయలేం. పరిశ్రమలకు అనుగుణమైన కోర్సులు, నైపుణ్య శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ఉపాధి మార్గదర్శక కేంద్రాలు, గ్రామీణ యువతకు సాంకేతిక శిక్షణ వంటి కార్యక్రమాలు అత్యవసరం. విద్య ఉద్యోగానికి దారి చూపాలి గాని కేవలం సర్టిఫికెట్‌కే పరిమితం కాకూడదు. సమాజం మొత్తం కూడా ఉద్యోగాన్ని కేవలం జీతంతో కొలవకూడదు. ఉద్యోగం అంటే గౌరవం, కుటుంబ భరోసా, ఆత్మవిశ్వాసం, దేశఆర్థికాభి వృద్ధికిపునాది. కాబట్టి సాంకేతికత మనిషికి తోడ్పడాలిగాని మనిషిని పక్కన పెట్టకూడదు. మానవ సంక్షేమం ప్రధానలక్ష్యంగా ఉండాలి. ఏఐ యుగం వచ్చింది. కానీ మానవ విలువల యుగం ఎప్పటికీ ముగియదు. యంత్రం వేగంగా పని చేస్తుంది. మనిషి అర్థవంతంగా పనిచేస్తాడు. మార్పును స్వాగతించి, నైపుణ్యాన్ని ఆయుధంగా చేసుకుని ముందుకు సాగే యువతే రేపటి భారతదేశాన్ని నిర్మిస్తుంది. భవిష్యత్తు ఉద్యోగాలు అంతరించవు. అవి రూపం మార్చుకుంటాయి. ఆ రూపాన్ని గుర్తించి అందిపుచ్చుకోవడం మన చేతుల్లోనే ఉంది. ●

# ఈశాన్య ప్రాంతం 'భారత్ అష్టలక్ష్మి'

- సిక్కిం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- 'యాక్ట్ ఈస్ట్' దాటి 'యాక్ట్ ఫాస్ట్'గా చేస్తున్నాం
- రాష్ట్ర ఆవిర్భావ 50వ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో ప్రధాని మోడీ
- రూ.4 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం



**గ్యాంగ్‌టక్, ఏప్రిల్ 28:** సిక్కిం, ఈశాన్య ప్రాంతం భారత దేశానికి ముఖ్య భాగాలే కాదని, అవి అష్టలక్ష్మి లాంటివి అని ప్రధానమంనరతి నరేంద్రమోడీ పేర్కొన్నారు. మంగళవారం పాల్జోర్ స్టేడి యంలో నిర్వహించిన సిక్కిం రాష్ట్ర ఆవిర్భావ 50వ వార్షికోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సిక్కింలో రూ. 4,000 కోట్లకు పైగా మొత్తం వ్యయంతో 30కి పైగా అభివృద్ధి ప్రాజెక్టు లను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజాసభలో ప్రధాని ప్రసంగిస్తూ, ఈశాన్య ప్రాంతం భారతదేశపు 'అష్టలక్షి ్మ' అని, ఈ హిమాలయ రాష్ట్రం అందులో ఒక ముఖ్యమైన భాగమని ఆయన ఉద్ఘాటించారు. ఈశాన్య ప్రాంతంలో అభివృద్ధిని వేగవంతం చేయడానికి కేంద్రం 'యాక్ట్ ఈస్ట్' విధానాన్ని దాటి 'యాక్ట్ ఫాస్ట్' విధానానికి మారిందని ఆయన అన్నారు. సిక్కిం పర్యాటక సామర్థ్యాన్ని వెలికితీయడంలో అనుసంధానం పాత్రను ప్రధాని మోడీ నొక్కి చెప్పారు. నిర్మాణంలో ఉన్న సేవక్‌రాంగ్‌పో రైల్వే లైన్ గురించి ప్రస్తావిస్తూ, ఇది రాష్ట్రానికి మొదటిసారిగా రైలు అనుసంధానాన్ని తీసుకువస్తుందని ఆయన పేర్కొన్నారు. బాగ్డోగ్రాను గాంగ్‌టక్‌తో కలిపే ప్రతిపాదిత ఎక్స్‌ప్రెస్‌వే ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుందని వివరించారు. సిక్కిం దట్టమైన అటవీ విస్తీర్ణం, పక్షులు, సీతాకోకచిలుకల జాతుల వైవిధ్యం కారణంగా, దాని జీవవైవిధ్యం, సహజ ప్రకృతి దృశ్యాలు సందర్శకులను ఆకర్షిస్తూనే ఉన్నాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో పర్యాటకం ఒక కీలకమైన జీవనోపాధి వనరుగా ఉందని పేర్కొన్నారు. సిక్కిం పూర్తి సేంద్రియ రాష్ట్రంగా ఉన్న స్థితిని ప్రధాని మోడీ ప్రముఖంగా ప్రస్తావిస్తూ, దానిని సుస్థిర వ్యవసాయానికి ఒక నమూనాగా అభివర్ణించారు. ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాల మద్దతుతో పెద్ద యాలకులు, అల్లం, పసుపు వంటి స్థానిక ఉత్పత్తులు విస్తృత మార్కెట్లకు చేరు తున్నాయని ఆయన అన్నారు. సమాజం నేతృత్వంలోని పర్యా వరణ కార్యక్రమాలను కూడా ఆయన ప్రస్తావించారు. పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి దిశగా నిరంతర కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిక్కిం పర్యాటకాన్ని, కనెక్టివిటీని ప్రధానమంత్రి ప్రశంసించారు. దేశ ప్రజలు కనీసం ఒక్కసారైనా సిక్కింను సందర్శించాలని ప్రధాని మోడీ కోరారు.

ఆ రాష్ట్రం ప్రశాంతంగా, పరిశుభ్రంగా ఉండటాన్ని ఆయన అభినందించారు,' అని ఆయన అన్నారు. అంతేకాకుండా, వందే భారత్ రైలు కనెక్టివిటీ త్వరలోనే సిక్కింకు చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నేడు ప్రారంభించిన ప్రాజెక్టులు మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తాయని, ఉపాధిని కల్పిస్తాయని, జాతీయ వృద్ధి నెట్‌వర్క్‌లతో రాష్ట్ర అనుసంధానాన్ని బలోపేతం చేస్తాయని ప్రధానమంత్రి అన్నారు. 'వికసిత్ భారత్' విస్తృత దార్శనికతకు అనుగుణంగా అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి సమిష్టి కృషి చేయా లని ఆయన పిలుపునిచ్చారు.

**'ప్రధానమంత్రే మా ఆదర్శం'**

సిక్కిం రాష్ట్ర ఆవిర్భావ 50వ వార్షికోత్సవాల ముగింపు వేడుకల్లో ప్రదర్శన ఇచ్చిన కళాకారులు, తమ ప్రసంగంలో తమను గుర్తించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటన సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చిన బృందంలో భాగమైన 'మ్యూజిక్ ఇన్ మోషన్ డాన్స్ అకాడమీ' ఆర్ట్ డైరెక్టర్ ప్రవేశ్ తమాంగ్ మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి పేరు చెప్పి వారిని గుర్తించినందుకు ప్రధాని మోడీని ప్రశంసించారు. 'మా ప్రతిభను గుర్తించినందుకు ప్రధానమంత్రికి చాలా ధన్యవాదాలు. ఆయన ప్రసంగం విన్న తర్వాత మాలో చాలా ఉత్సాహం నిండింది. ఆయన ప్రసంగం యువతకు కూడా స్ఫూర్తినిస్తుంది. ప్రధానమంత్రి మా ఆదర్శం,' అని పేర్కొన్నారు.

## అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకున్న 34 ట్యాంకర్లు

### వాటిలో 14 భారత్ నౌకలు కూడా


**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** హర్మూజ్ జలసంధిలో ఇరాన్‌ను కట్టడి చేసేందుకు అమెరికా విధించిన నౌకా దిగ్బంధనం పూర్తిగా ఫలించడం లేదు. అమెరికా నౌకాదళ నిఘా ఉన్నప్పటికీ డజన్ల కొద్దీ ఆయిల్ ట్యాంకర్లు ఈ మార్గం గుండా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయి. ఇటీవల ఇరాన్ నుంచి వస్తున్న దేశ్ గరిమ అనే భారత నౌక మార్గమధ్యంలో కాల్పులకు గురైనా సురక్షితంగా ముంబై తీరానికి చేరుకుంది. ఈ నౌక ఖతార్‌లోని రాస్ లఫాన్ నుంచి 97వేల టన్నుల ముడి చమురును తీసుకువచ్చింది. ఈనెల 13న అమెరికా దిగ్బంధనం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 30కి పైగా ట్యాంకర్లు హర్మూజ్ జలసంధిని దాటినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇరాన్‌తో సంబంధం ఉన్న 34 ట్యాంకర్లు అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకున్నాయని ఇటీవల వార్తలు వెలువడ్డాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 14 భారత నౌకలు ఉన్నాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. దిగ్బంధనాన్ని తప్పించుకోవడానికి నౌకలు రెండు ప్రధాన మార్గాలను అనుసరిస్తున్నట్లు నిపుణులు చెపుతున్నారు. మొదటిది, ఇరాన్ తీరం వెంబడి ప్రయాణించి, పాకిస్థాన్ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించి, ఆ తర్వాత అంతర్జాతీయ జలాల ద్వారా అరేబియా సముద్రంలోకి రావడం. రెండోది, ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు వరకు తీరం వెంబడి ప్రయాణించి, అక్కడి నుంచి నేరుగా అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించి భారత్ వైపు రావడం. అంతర్జాతీయ సముద్ర చట్టాల ప్రకారం, ఒక దేశ ప్రాదేశిక జలాల్లోకి మరో దేశ నౌకాదళం అనుమతి లేకుండా ప్రవేశించలేదు. ఇదే ఇరాన్ నౌకలకు కలిసొస్తున్న అంశం. అయితే, భారత నౌకలు పాకిస్థాన్ జలాలను ఉపయోగించడం అసంభవమని, అనవసరమైన రిస్క్ అని భారత నౌకాదళానికి చెందిన ఒక రిటైర్డ్ సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. అమెరికా దిగ్బంధం ఇరాన్ ఓడరేవుల నుంచి వచ్చే నౌకలను లక్ష్యంగా చేసుకున్నప్పటికీ, భారత నౌకల వంటి తటస్థ నౌకలకు ప్రత్యక్ష ముప్పు పరిమితంగానే ఉంటుందని ఆయన తెలిపారు. భారత విదేశాంగ శాఖ దౌత్యపరమైన చర్చల ద్వారా నౌకల రాకపోకలకు మార్గం సుగమం చేస్తుందని, ఆ తర్వాత భారత నౌకాదళం గల్ఫ్ ఆఫ్ ఒమాన్‌లో ఆ నౌకలను కలుసుకుని సురక్షితంగా భారత తీరాలకు ఎస్కార్ట్ చేస్తుందని వివరించారు. ఈ పద్ధతిలో పాకిస్థాన్ జలాల్లోకి ప్రవేశించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద, అమెరికా నౌకాదళ శక్తికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయని, ప్రాదేశిక జలాలను ఉపయోగించుకుని ఇరాన్ నుంచి ముంబైకి చమురు రవాణా సాధ్యమవుతోందని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.



## ఉగ్రవాదులకు సాయంచేసేవారిపైనా చర్యలు

### ఎస్‌సిఒ రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్‌సింగ్

**బిష్కెక్, ఏప్రిల్ 28:** ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) వెనుకాడకూడదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కిర్గిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రక్షణమంత్రి మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి యావత్ మానవాళిని కుదిపేసిందని అన్నారు. ఆ తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి, ఉగ్రవాదులు ఎక్కడున్నా తప్పించుకోలేరని నిరూపించిందని అన్నారు. ఉగ్రవాదం ప్రపంచానికి ప్రధాన సమస్యగా మారిం దని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని అన్నారు. ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదని ఈ సందర్భంగా కోరారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని వ్యాఖ్యానించారు.



ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో షాంఘై సహకార సంస్థ ముందుండాలని కోరారు. గత కొన్నేళ్లుగా జరుగుతున్న వరుస ఘర్షణల కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఇటీవలి యుద్ధాలను ఉద్దేశించి అన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

పహల్గామ్ ఉగ్రదాడి ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆ దాడి అనంతరం ఆపరేషన్ సింధూర్ చేపట్టి ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందని తెలిపారు. ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్రదాడులను అస్సలు విస్మరించకూడదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్నారు.

ఉగ్రవాదులకు సాయపడుతూ ఆశ్రయం కల్పించే వారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీవో వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం గురించి రక్షణమంత్రి మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందని చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ క్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.

## న్యాయవాదిగా మారిన పెరరివలన్

**చెన్నై, ఏప్రిల్ 28:** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో దోషిగా జైలుశిక్ష అనుభవించిన ఎమ్‌జీ పెరరివలన్ ఇపుడు న్యాయవాదిగా మారారు. తమిళనాడుపుదుచ్చేరి బార్ అసోసియేషన్ లో న్యాయవాదిగా ఆయన తన పేరు నమోదు చేసుకున్నారు. నాడు రాజీవ్ గాంధీ హత్య కేసులో 31 ఏళ్లపాటు జైలు జీవితం గడిపిన పెరారివాళన్ 2022లో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు విడుదలయ్యారు. ఆ తర్వాత బెంగళూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కాలేజీలో న్యాయవిద్యను అభ్యసించారు. అక్కడ డిగ్రీ పూర్తి చేసి 2025లో ఆల్ ఇండియా బార్ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీరులయ్యారు. త్వరలో ఆయన మద్రాస్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయనున్నారు. ఈ సందర్భంగా పెరారివాళన్ మీడియాతో మాట్లాడుతూ సరైన న్యాయ సహాయం అందక జైళ్లల్లో మగ్గిపోతున్న వేలాది మంది ఖైదీల గొంతుకగా మారడమే తన లక్ష్యమని చెప్పారు. న్యాయం అందని నిరుపేద జీవిత ఖైదీల కోసం తాను పనిచేయాలనుకుంటున్నట్లు తెలిపారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీ పెరంబదూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాజీవ్ గాంధీపై ఓ మహిళ ఆత్మాహుతి దాడికి పాల్పడింది. ఆ బాంబు తయారీకి అవసరమైన రెండు బ్యాటరీలను నాటి 19 ఏళ్ల పెరారివాళన్ కొనుగోలు చేసి ఇచ్చారు. ఈ కేసులో పెరారివాళన్‌కు 1998లో తొలుత ఉగ్రవాద వ్యతిరేక కోర్టు మరణశిక్ష విధించింది. 2014లో సుప్రీంకోర్టు దాన్ని జీవిత ఖైదుగా మార్చింది. ఆ తర్వాత తమిళనాడు గవర్నర్ క్షమాభిక్ష ప్రసాదించడంతో ఆయన్ను విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

## డిజిటల్ అరెస్టుల కట్టడికి కేంద్రం కఠిన నిబంధనలు

### సుప్రీంకోర్టుకు తాజా నివేదిక అందచేత



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** దేశంలో గడిచిన కొన్ని నెలలుగా డిజిటల్ అరెస్ట్ మోసాలు పెరిగి పెను ముప్పుగా మారుతున్నాయి. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అనేకమంది ఈ మోసాల బారిన పడుతుండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలోనే డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లను అరికట్టేలా కేంద్రం పలు నిబంధనలను రూపొందించింది. ఈ నిబంధనలకు సంబంధించిన నివేదికను తాజాగా సుప్రీం కోర్టుకు సమర్పించింది. ఈ డిజిటల్ అరెస్ట్ మోసాల కట్టడికి బయోమెట్రిక్ సిమ్ వెరిఫికేషన్, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నిలిపివేత వంటి ప్రతిపాదనలను కేంద్రం తన నివేదికలో పేర్కొన్నది. వివిధ రంగాల నిపుణులు, ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపిన అనంతరం కేంద్రం ఈ నివేదికను రూపొందించింది. తమ నివేదికను పరిశీలించిన అనంతరం ప్రతిపాదనల అమలు కోసం టెలికమ్యూనికేషన్ విభాగం, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ, ఆర్‌బీఐ అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కేంద్రం సుప్రీంకోర్టును కోరింది. కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఈ నివేదికను న్యాయస్థానానికి సమర్పించారు. ఆ నివేదికలోని సిఫారసులను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించి సంబంధిత విభాగాలకు ఆదేశాలు ఇవ్వనుంది. కేంద్ర ప్రభుత్వ సిఫారసులు సిమ్ కార్డు జారీ చేసే సమయంలో టెలికమ్యూనికేషన్ (యూజర్ ఐడెంటిఫికేషన్) రూల్స్, బయోమెట్రిక్ ఐడెంటిటీ వెరిఫికేషన్ వ్యవస్థను కఠినంగా అమలు చేయాలి. టెలికామ్ సర్వీస్ ప్రొవైడర్లు నిబంధనలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలి, సిమ్ యాక్టివేషన్ చేసే పాయింట్ ఆఫ్ సేల్స్ విక్రయదారులను ఎప్పటికప్పుడు వెరిఫికేషన్ చేయాలి. కేసుల దర్యాప్తు సమయంలో సబ్‌స్క్రైబర్ యాక్టివేషన్ వివరాలు అందించాలని పీఓఎస్, టెలికామ్ ఆపరేటర్లను ఆదేశించాలి. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లతో సహా సైబర్ క్రైమ్ నేరాలకు ఉపయోగించే మోసపూరిత సిమ్ కార్డులను వీలైనంత త్వరగా బ్లాక్ చేయాలి. వాట్సప్ వంటి యాప్‌లు సిమ్ బైండింగ్ మెకానిజంను కఠినంగా అమలుచేయాలి. ఎక్కువసేపు సాగే మోసపూరిత కాల్స్‌ను గుర్తించేలా యాప్‌లో అధునాతన ఫీచర్లను తీసుకురావాలి. మోసాలకు ఉపయోగించిన డిజిటల్ డివైజ్‌ల ఐడీలను గుర్తించి వెంటనే బ్లాక్ చేయాలి. అప్పుడే ఆ డివైజ్ నుంచి వేరే ఖాతాతో నిందితులు మోసాలకు పాల్పడే అవకాశాన్ని నిరోధించవచ్చు. సైబర్ నేరాలకు ఉపయోగించే అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు డెబిట్ కాకుండా తాత్కాలికంగా వాటిని నిలిపివేయాలి. అందుకోసం ఆర్‌బీఐ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలి.

## మూడు షరతులు అంగీకరిస్తే యుద్ధం ముగిస్తాం

### హర్మూజ్ జలసంధిని తెరుస్తాం: ఇరాన్

**టెహ్రాన్, ఏప్రిల్ 28:** అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించుకుని, యుద్ధానికి ముగింపు పలికేందుకు ఇరాన్ ముందుకు వచ్చింది. ప్రస్తుతం అమెరికా ఫోకస్ ఎక్కువ ఉన్న హర్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని, అందుకు తమ షరతులను అంగీకరించాలని అమెరికాకు ప్రతిపాదించింది. ఒమన్, పాకిస్థాన్ వంటి మధ్యవర్తుల ద్వారా టెహ్రాన్ తన ప్రణాళికను పంపింది. ఇరాన్ పెట్టిన షరతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి మధ్యవర్తిత్వ దేశాల ద్వారా అమెరికాకు మూడు షరతులతో కూడిన ప్రతిపాదనను పంపారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన నౌకా దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేయాలి, ఇరాన్ అణు కార్యక్రమంపై జరగాల్సిన చర్చలను వాయిదా వేయాలి. ఈ రెండు ప్రధాన షరతులకు అంగీకరిస్తే హర్మూజ్ జలసంధిని వాణిజ్యానికి తెరిచి, యుద్ధ వాతావరణానికి తెరదించుతామని ఇరాన్ తెలిపింది. ఇరాన్ అణ్వాయుధాలను సొంతం చేసుకోకుండా నిరోధించడమే తన ప్రధాన లక్ష్యమని ట్రంప్ మొదటి నుంచి స్పష్టం చేస్తున్నారు. ఈ కారణంతోనే ఆయన యుద్ధానికి దిగారు. ఇప్పుడు ఇరాన్ ప్రతిపాదనలో అణు చర్చలను వాయిదా వేయాలన్న నిబంధన ఉండటమే ట్రంప్ అసంతృప్తికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీనిపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా స్పందించారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని మినహాయించి ఎలాంటి ఒప్పందాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఏ ఒప్పందం జరిగినా, అది ఇరాన్‌ను అణ్వాయుధం వైపు వెళ్లకుండా కచ్చితంగా నిరోధించేలా ఉండాలని ఆయన ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో అన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లో ఉంది. ప్రపంచ వాణిజ్యంలో ఐదో వంతు చమురు, గ్యాస్ రవాణా అయ్యే హర్మూజ్ జలసంధి మూసివేత ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

## నిందితుడి హిట్‌లిస్ట్‌పై అన్ని కోణాల్లో దర్యాప్తు

### ఎఫ్‌బిఐ డైరెక్టర్ పేరు లేకపోవడంపైనా అనుమానాలు

**వాషింగ్టన్, ఏప్రిల్ 28:** హిల్టన్ హోటల్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లక్ష్యంగా కాల్పులు జరిపిన నిందితుడు ఒక హిట్‌లిస్ట్ తయారు చేసుకున్నాడు. ట్రంప్‌తో సహా ప్రభుత్వ పెద్దలు ఆ లిస్టులో ఉన్నారు. కానీ ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ పేరు మాత్రం ఆ లిస్టులో లేదు. 1052 పదాలతో షూటర్ అల్లెన్ ఓ డాక్యుమెంట్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ మెయిల్‌లో అతనో హిట్‌లిస్టు పేర్కొన్నాడు. అతని టార్గెట్‌లో కాష్ పటేల్ పేరు లేకపోవడం పట్ల చర్చ మొదలైంది. ముఖ్యమైన వ్యక్తుల్లో ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఒకరు. అతని పేరులేకుండా హిట్‌లిస్టు ఎలా తయారు చేశాడన్న దానిపై దర్యాప్తు అధికారులు ఆలోచనల్లో పడ్డారు. అన్ని కోణాల్లో దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఐడియాలజీ నుంచి ఆపరేషనల్ స్ట్రాటజీ కోణంలో విచారిస్తున్నారు. మతపరమైన కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఇక ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఓ హిందువు. కాష్ పటేల్ హిందువు కావడం వల్లే అతన్ని హిట్‌లిస్టు నుంచి తప్పించి ఉంటాడని భావిస్తున్నారు. పటేల్ మతవిశ్వాసం భిన్నమైంది కాబట్టి అతన్ని నిందితుడు వదిలేసి ఉంటాడని అంచనా వేస్తున్నారు. కేవలం ట్రంప్ మీద ఫోకస్ పెట్టడం వల్ల శాంతిభద్రత విభాగానికి చెందిన పటేల్‌ను విస్మరించి ఉంటాడని కొన్ని వర్గాలు భావిస్తున్నాయి. లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను టార్గెట్ చేయాలన్న ఆలోచన తనకు లేదని అల్లెన్ పేర్కొన్న విషయాన్ని కొందరు గుర్తు చేశారు. అందుకే పటేల్ పేరును ఆ లిస్టు నుంచి తీసేసినట్లు అనుమానిస్తున్నారు. డిన్నర్ టైంలో దాడి జరిగినప్పుడు కాష్ పటేల్ కూడా అక్కడే ఉన్నారు. కాల్పుల శబ్దం వినబడగానే పటేల్ తన గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి టేబుల్ కింద దాక్కున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ నిందితుడు ఎందుకు దాడికి ప్రయత్నించాడన్న కోణంలో విచారణ కొనసాగుతున్నట్లు రిపోర్టుల్లో తెలిసింది.

## అమెరికా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తోంది

### ట్యాంకర్ల స్వాధీనంపై ఇరాన్ రుసరుసలు

**టెహ్రాన్, ఏప్రిల్ 28:** అమెరికా, ఇరాన్ మధ్య సముద్ర జలాల్లో ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి. ఇరాన్‌కు చెందిన రెండు ఆయిల్ ట్యాంకర్లను అమెరికా దళాలు స్వాధీనం చేసుకోవడం వివాదానికి దారి తీసింది. ఇది నడిసముద్రంలో జరిగిన సాయుధ దోపిడీ అని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్య పైరసీని, సముద్రపు దోపిడీని చట్టబద్ధం చేయడమేనని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ ఆరోపించారు. అమెరికా ఈ చర్యను సమర్థించుకుంది. కోర్టు ఆమోదించిన వారెంట్ల ప్రకారమే చట్టబద్ధంగా ట్యాంకర్లను స్వాధీనం చేసుకున్నట్లు అమెరికా ప్రతినిధి జీనిన్ ఫెర్రిస్ పిర్రో తెలిపారు. హిందూ మహాసముద్రంలో అడ్డగించిన మెజెస్టిక్ ఎక్స్, టిఫానీ అనే రెండు నౌకల్లో దాదాపు 19 లక్షల బ్యారెళ్ల ఇరాన్ చమురు ఉందని ఆమె వెల్లడించారు. అక్రమ చమురు నెట్‌వర్క్‌లను అడ్డుకోవడంలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఇరాన్ విమానయాన సంస్థలకు ఇంధనం, క్యాటరింగ్ వంటి సేవలు అందించే కంపెనీలపై ఆంక్షలు విధిస్తామని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ హెచ్చరించారు. ఆపరేషన్ ఎకనామిక్ ఫ్యూరీ పేరుతో ఇరాన్‌పై గరిష్ఠ స్థాయిలో ఒత్తిడి పెంచుతామని ఆయన తెలిపారు. ఈ పరిణామాల్లో హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. చర్చలకు తాము తొందరపడటం లేదని, అణ్వాయుధాలు తయారు చేయబోమని ఇరాన్ హామీ ఇస్తేనే ఒప్పందం సాధ్యమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇరు దేశాలు తమ వైఖరికే కట్టుబడి ఉండటంతో, ప్రపంచంలోని అత్యంత కీలకమైన షిప్పింగ్ మార్గంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

## శంభు అంబాలలో రైల్వేట్రాక్ పేలుడుకు కుట్ర

### విస్ఫోటనానికి తునాతునకలయిన వ్యక్తి మృతదేహం

**శంభు అంబాలా(పంజాబ్), ఏప్రిల్ 28:** పంజాబ్‌లోని పాటియాలా సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద జరిగిన పేలుడులో ఆ బాంబును పేల్చేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించి ఆ పేలుడుకే బలైపోయాడు. కుట్రపూరితంగా జరిగిన సంఘటనగా భావిస్తున్నట్లు తేలింది. తక్కు తీవ్రతకలిగిందే అయినప్పటికీ ఆ బాంబును పేల్చడంలో ఆ ఆ వ్యక్తి కూడా చనిపోయినట్లు సీనియర్ పోలీసు ఆఫీసర్ ఒకరు తెలిపారు. రైల్వే ట్రాక్‌ను పేల్చుదామని ప్రయత్నించిన ఆ వ్యక్తి గురించి కొన్ని వివరాలను పోలీసులు వెల్లడించారు. శంబూ, రాజ్‌పురా మార్గంలో ఉన్న బొతోనియా గ్రామం వద్ద రైల్వే ట్రాక్ సమీపంలో పేలుడు జరిగింది. అయితే అక్కడ ఓ వ్యక్తి శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్నట్లు గుర్తించారు. బాంబునే పేల్చే క్రమంలో అతను చనిపోయి ఉంటాడని పాటియాలా ఎస్ఎస్పీ వరుణ్ శర్మ తెలిపారు. శంబూఅంబాలా రైల్వే ట్రాక్ మార్గంలో ప్రస్తుతం రిపేర్ వర్క్ చేస్తున్నారు. బాంబు పేలుడులో మరణించిన వ్యక్తిని జగరూప్ సింగ్‌గా గుర్తించారు. అతను తరన్ తారన్‌కు చెందినట్లు అనుమానిస్తున్నారు. రైల్వే ట్రాక్‌ను పేల్చబోయి, నిందిత ఆపరేటర్ కూడా పేలినట్లు విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు. సోమవారం రాత్రి 10 గంటలకు ఈ ఘటన జరిగింది. పేలుడు వల్ల రైల్వే ట్రాక్ కాస్త ధ్వంసం అయ్యింది. కొన్ని రైళ్లను దారి మళ్లీంచారు. తక్కువ తీవ్రతతో బాంబు పేలిందని తొలుత భావించామని, కానీ దాన్ని పేల్చే ప్రయత్నంలో నిందితుడు కూడా పేలి ముక్కలైనట్లు ఎస్పీ వెల్లడించారు. ఆ స్పాట్ నుంచి ఓ సిమ్ కార్డును రికవరీ చేశామన్నారు. దీని ఆధారంగా టెక్నికల్ దర్యాప్తు మొదలుపెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన వెనుక ఉన్న కుట్రను ఛేదించనున్నట్లు పోలీసులు చెప్పారు. జీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నాయి. ఫతేఘర్ సాహిబ్ జిల్లాలోని రైల్వే ట్రాక్‌పై జనవరిలో పేలుడు జరిగింది. ఆ ఘటనలో ఇంజిన్ ధ్వంసం కాగా, లోకో పైలెట్ గాయపడ్డాడు.

## భారత్‌కు దావూద్ ఇబ్రహీం కింగ్‌పిన్ సలీమ్‌డోలా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** అంతర్జాతీయ డ్రగ్ సిండికేట్‌పై భారత దర్యాప్తులో టర్కీలో అరెస్టైన దావూద్ ఇబ్రహీమ్ అనుచరుడు సలీమ్ డోలా ను భారత్‌కు తీసుకొచ్చారు. భారత్‌లో మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కేసులో కీలక సూత్రధారిగా ఉన్న సలీమ్ డోలా రెండు రోజుల క్రితం టర్కీలోని ఇస్తాంబుల్‌లో అరెస్టయ్యాడు. అతడిని తాజాగా భారత్‌కు అప్పగించడంతో అధికారులు ఈ తెల్లవారుజామున ఢిల్లీకి తీసుకొచ్చారు. డోలాను తరలించిన ప్రత్యేక విమానం మంగళవారం తెల్లవారుజామున ఢిల్లీ టెక్నికల్ ఎయిర్‌పోర్టులో దిగిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అతడిని విచారణ నిమిత్తం సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రాథమిక విచారణ పూర్తయిన అనంతరం.. డోలాను ముంబై పోలీసులకు లేదా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోకు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కాగా సలీమ్ డోలా అరెస్టు అండర్‌వరల్డ్ డ్రగ్ మాఫియాకు గట్టి ఎదురుదెబ్బే అని చెప్పొచ్చు. దావూద్ ఇబ్రహీంకు చెందిన డికంపెనీ విదేశాల్లో నిర్వహించే డ్రగ్ ఆపరేషన్లకు డోలానే ప్రధాన సూత్రధారి. డోలా కనుసన్నల్లో ఏడాదికి రూ.5 వేల కోట్ల డ్రగ్స్ వ్యాపారం సాగుతోందనే అంచనాలు ఉన్నాయి. కొన్ని నెలల క్రితం డోలా నెట్‌వర్క్‌కు చెందిన సలీమ్ సోహైల్ షేక్ అనే డీలర్ దుబాయ్‌లో అరెస్టయ్యాడు. అతడిని భారత్‌కు అప్పగించిన తర్వాత ఈ డ్రగ్ నెట్‌వర్క్ తీగ లాగితే గత ఏడాది జూన్‌లో సలీమ్ డోలా కుమారుడు తాహెర్ పట్టుబడ్డాడు. తాహెర్‌ను కూడా యూఏఈ నుంచి భారత్‌కు తీసుకొచ్చి విచారించారు. ఈ క్రమంలోనే సలీమ్ డోలా ఆచూకీ లభించినట్లు తెలుస్తోంది.

## ఆకలికి తట్టుకోలేక నరమాంస భక్షకులుగా రష్యా సైనికులు..!

**క్యీవ్, ఏప్రిల్ 28:** తూర్పు ఉక్రెయిన్‌లోని రష్యా సైనికులు చలికాలంలో ఆహార కొరత వల్ల నరమాంస భక్షకులుగా మారి తోటి సైనికులను చంపి తింటున్నారని ఉక్రెయిన్ ఆరోపించింది. అటువంటి ఘటనలు కనీసం ఐదు తమ దృష్టికి వచ్చాయని ఉక్రెయిన్ నిఘా వర్గాలు తెలిపాయి. గత ఏడాదినవంబర్‌లో డొనెట్స్ ప్రాంతంలోని మర్నోహ్రాడ్ సమీపంలో ఖ్రోమోయ్ అనే సైనికుడు తన సహచర సైనికులు ఇద్దరిని చంపి వారిలో ఒకరి కాళ్లను తినడానికి ప్రయత్నించినట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. నరికిన కాలు ఫొటోలను టెలిగ్రామ్ ద్వారా తన కమాండర్లకు ఒక గుర్తు తెలియని అధికారి షేర్ చేశాడు. ఒక బేస్‌మెంట్‌లో తోటి సైనికుడి శరీర భాగాలను తినేందుకు ప్రయత్నిస్తున్న ఖ్రోమోయ్‌ను నిర్బంధించేందుకు ప్రయత్నించగా జరిగిన కాల్పుల్లో అతను మరణించినట్లు ఆ అధికారి తన కమాండర్లకు వివరించాడు. చనిపోయిన సైనికుల మృతదేహాలను పరిశీలించిన ఓ సైనిక సర్జన్ శరీరంపై ఉన్న గాయాలు యుద్ధం వల్ల ఏర్పడిన గాయాలు కావని, పదునైన వస్తువుతో కోసినవని తెలిపారు. రష్యా సైనికులు తీవ్ర ఆహార కొరతతో అల్లాడుతున్నట్లు ఆ అధికారి పేర్కొన్నారు. మరో ఘటనలో ఒక సైనికుడు తన తోటి సైనికుడు మానవ మాంసం తినడం గురించి ఫిర్యాదు చేశాడు. అతను గనక మనిషే అయితే తనకు నచ్చినంత కాలం ఇక్కడ ఉండొచ్చు. కానీ అతను ఒక శవాన్ని తిన్నాడు అని ఆ సైనికుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నివేదికల మధ్య ఒక యూనిట్ కమాండర్ తన కింది అధికారిని నరమాంస భక్షణకు వ్యతిరేకంగా హెచ్చరిస్తూ మనుషులను తినడం ఆపండి అని ఆదేశించాడు. అయితే ఈ ఆరోపణలను లండన్‌లోని రష్యాన్ ఎంబసీ కొట్టివేసింది.

## మతం అడిగి మరీ సెక్యూరిటీ గార్డులను కత్తితో పొడిచిన ఉన్మాది

**ముంబై, ఏప్రిల్ 28:** నగరంలో ఓ ఉన్మాది కత్తితో ఇద్దరు సెక్యూర్టీ గార్డులను మతం అడిగి మరీ దాడికి పాల్పడ్డాడు. నయా నగర్‌లో జరిగిన ఈ ఘటనలో నిందితుడిని 31 ఏళ్ల జైయిబ్ జుబీర్ అన్సారీగా గుర్తించారు. అయితే దాడికి ముందు అతను బాధితులను ఇస్లాం ప్రవచనం కల్మా చదవాలని బెదిరించినట్లు తెలిసింది. రాజ్‌కుమార్ మిశ్రా, సుబ్రోతో సేన్ వాక్‌హర్డ్ ఆస్పత్రి వద్ద ఓ బిల్డింగ్‌లో గార్డులుగా పనిచేస్తున్నారు. వారికి వద్దకు వెళ్లిన అన్సారీ అటాక్ చేశాడు. సోమవారం ఉదయం 4 గంటలకు ఆ దాడి జరిగినట్లు భావిస్తున్నారు. బాధితులు ఇద్దరూ ఆ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. మిశ్రా స్వయంగా ఆస్పత్రికి వెళ్లారు. తీవ్రంగా గాయపడ్డ సేన్‌ను నయాబ్ షేక్ అనే మరో వ్యక్తి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అటాక్ జరిగిన 90 నిమిషాల తర్వాత అన్సారీని అరెస్టు చేశారు. సీసీటీవీ ఫూటేజ్‌ను స్కాన్ చేసి నిందితుడిని పట్టుకున్నారు. నయానగర్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ కేసు నమోదు చేశారు. హత్యాయత్నం, రెండు గ్రూపుల మధ్య శత్రుత్వం రెచ్చగొట్టే కేసులు పెట్టారు. థానే కోర్టులో నిందితుడిని ప్రవేశపెట్టారు. మే 4వ తేదీ వరకు అతన్ని కస్టడీలోకి తీసుకున్నారు.

దాడి పట్ల పోలీసులు, యాంటీ టెర్రర్ స్క్వాడ్ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దు అని పోలీసులు ప్రకటించారు. నిందితుడు అన్సారీకి చెందిన మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైస్‌లను సీజ్ చేశారు. ఐసిస్, లోన్ వూల్ఫ్, జిహాద్, గాజా అన్న పదాలు అతని మొబైల్‌లో రాసి ఉన్నట్లు గుర్తించారు. అన్సారీ కుటుంబం ఇంకా అమెరికాలోనే ఉంటున్నది. అయితే అక్కడ అతనికి జాబ్ దొరక్కపోవడంతో ఇండియాకు రిటర్న్ వచ్చేశాడు. మీరా రోడ్డు ఏరియాలో అతను ఒంటరిగా నివసిస్తున్నాడు. ఆన్‌లైన్‌లో కెమిస్ట్రీ పాఠాలు బోధిస్తూ సంపాదిస్తున్నాడు.

## రక్షణరంగ వ్యయంలో ప్రపంచంలోనే ఐదోస్థానంలో భారత్ !

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** ప్రపంచ దేశాల్లో రక్షణ రంగం పై అత్యధికంగా ఖర్చు చేస్తున్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. గడిచిన ఏడాది మన దేశం రక్షణ రంగంపై 92.1 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తే, అమెరికా, చైనా, రష్యా, జర్మనీ దేశాలు ఈ జాబితాలో భారత్ కంటే ముందు స్థానాల్లో ఉన్నాయి. ఈ మేరకు స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధక కేంద్రం ప్రస్తుత వివరాలతో నివేదికను విడుదల చేసింది.

## రెండు రైళ్లు ఢీ..14 మంది మృతి, 84 మందికి గాయాలు

**జకార్తా, ఏప్రిల్ 28:** ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 14 మంది మృతిచెందగా, 84 మంది గాయపడ్డారు. దేశ రాజధాని జకార్తా శివారులో ఉన్న బెకాసి వద్ద ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని రైల్వే అధికారులు చెప్పారు. ఓ కమ్యూటర్ ట్రైన్‌తో పాటు లాంగ్ డిస్టాన్స్ రైలు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరుకున్నట్లు ఇండోనేషియా రైల్వే శాఖ సీఈవో బాబీ రసియిదిన్ తెలిపారు. గాలింపు ప్రక్రియ ముగిసినట్లు రెస్క్యూ ఏజెన్సీ అధిపతి మొహమ్మద్ స్యాఫి తెలిపారు. రైల్వే బోగీలు నుజ్జు నుజ్జు అయ్యాయని, వాటిల్లో చిక్కుకున్న వారిని తొలగించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రైలుకు చెందిన మహిళా బోగీ దెబ్బతిన్నదని, బాధితుల్లో అందరూ మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు ఇనుపకడ్డీలను గ్రైండర్లతో కట్ చేశారు. స్థానికంగా తిరిగే లోకల్ కమ్యూటర్ రైలు తొలుత ఓ ట్యాక్సీ ఢీకొన్నదని, ఆ తర్వాత అది మళ్లీ దూరం వెళ్లే మరో రైలును ఢీకొన్నట్లు స్యాఫీ తెలిపారు.

# ప్రజాస్వామిక వ్యవస్థను నిర్వీర్యం చేసిన మోడీ సర్కార్

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్




మంగళవారం నాంపల్లిలో పిసిసి సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమర్థ శిక్షణ శిబిరం కార్యక్రమంలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ప్రజాస్వామిక వ్యవస్థను మోడీ సర్కార్ నిర్వీర్యం చేసిందని రాజ్యాంగ విలువలకు, సమాఖ్యస్ఫూర్తికి తూట్లు పొడిచే విధంగా బిజెపి పాలకులు వ్యవహరిస్తున్నారని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం నాంపల్లిలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన సమర్థ శిక్షణ శిబిరం కార్యక్రమానికి టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ , నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహేష్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశస్వాతంత్ర పోరాటం నుంచి సేవాదళ్ కార్యాక్రమాలు మొదలైనాయనీ సేవాదళ్ కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించి పార్టీలో, ప్రభుత్వంలో కూడా ఎదిగి ప్రజాసేవ చేసినవారు ఎంతో మంది ఉన్నారనీ ఇప్పటికి సెంట్రల్ బాడీలో సేవాదళ్‌లో పనిచేసిన కొంతమంది కీలక పోస్టులలో ఉన్నారనీ అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సేవాదళ్ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ విధివిధానాలు, క్రమశిక్షణ సేవా దృక్పథంపై ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం,రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడానికి పార్టీ సంస్థాగత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ శిక్షణా శిబిరం లో చర్చించడం సంతోషకరం అన్నారు. బిజెపి కేంద్రంలో అవలంబిస్తున్న ధోరణిని సేవాదళ్‌ఎండగడుతుందనీ తెలిపారు.దేశంలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచే విధంగా మోదీ ప్రభుత్వం వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందనీ ఆరోపించారు.పదేండ్ల గా ముఖ్యమంత్రిగా పనిచేసిన కెసిఆర్ కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేండ్ల ఆదరించిన బిఆర్ఎస్ ను ఇప్పుడు ప్రజలు ఇప్పుడు ఆదరించే పరిస్థితి లేదనీ బిఆర్ఎస్‌కు గతమే ఉందని ఇక భవిష్యత్ లేదని అన్నారు.కెసిఆర్ కుటుంబం వివాదంలో కెసిఆర్ సతమతం అవుతున్నారనీ అన్నారు..ప్రజల గురించి పట్టించుకోకుండా పదవుల గురించి పాకులాడుతున్నారనీ విమర్శించారు.తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ తెలంగాణ నిర్మాణం క్రెడిట్ అంతా సోనియాగాంధీకి దక్కుతుందనీ అన్నారు. తెలంగాణను కెసిఆర్ పాలించి యాభైండ్లు వెనక్కి నెట్టారనీ దుయ్యబట్టారు. టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ వెన్నెముక వంటిదని, కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం లో సేవాదళ్ కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.క్షేత్రస్థాయిలో నాయకత్వ లక్షణాలను ఎలా పెంపొందించుకోవాలనే అంశంపై ఈ శిబిరం లో వక్తలు దిశానిర్దేశం చేశారు.

## ఆర్టీసీలో వేతన కమిటీ ఏర్పాటుపై జెఎసి హర్షం

### 2021 పిఆర్‌సి ప్రారంభించాలని కోరిన జెఎసి

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టీసీ)లో వేతన సవరణ కమిటీని ఏర్పాటు చేస్తూ ఆర్‌టీసీ నిర్ణయం తీసుకుంది. వేతన కమిటీ ఏర్పాటుపై ఆర్‌టీసీ జేఏసీ హర్షం ప్రకటించింది.ఆర్‌టీసీ సమ్మె సందర్భంగా ఈ నెల 27న జరిగిన ఒప్పందం మేరకు 2021 వేతన సవరణ ప్రక్రియను ప్రారంభించవలసిందిగా ఆర్‌టీసీ ఎండీని జేఏసీ నేతలు కోరారు. స్పందించిన మేనేజింగ్ డైరెక్టర్ మంగళవారం ఆర్‌టీసీ ఉద్యోగులు, కార్మికుల వేతన సవరణకు అధికారులతో కూడిన పే కమిటీని నియమించారు. పే కమిటీలో కె.గీత, డిప్యూటీ సి.ఎ.ఓ(ఎస్.పి అండ్ ఎ, సిఇ), సమీరా అఫ్రీన్, డిప్యూటీ సిపిఎం (ఐటి) వై.శిరీష, డిప్యూటీ సిపిఎం (ఐఆర్ అండ్ డబ్ల్యు, ట్రైనింగ్)లను పే కమిటీగా నియమించారు. వారు మే 10లోపుగా 2021 వేతన సవరణకు సంబంధించి కొత్త స్కేల్స్‌ను రూపొందించటంతోపాటు వేతన సవరణ విధి విధానాలను రూపొందించాలని ఫైనాన్సియల్ అడ్వైజర్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ ఆమోదంతో మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశించారు. తాము చేసిన విజ్ఞప్తిని వెనువెంటనే అమలు చేసినందుకు జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరిలు హర్షం వ్యక్తం చేశారు. దీంతోపాటు సమ్మె విరమణ సందర్భంగా అంగీకరించిన మిగిలిన అంశాలను కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా తక్షణమే అమలు చేయాలని జేఏసీ నాయకులు కోరారు.

## వ్యవస్థలు నిర్వీర్యం చేసి ఆత్మవిమర్శ చేసుకోని కెసిఆర్

### ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**వ్యవస్థలు నిర్వీర్యంచేసిన కెసిఆర్ దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఆత్మవిమర్శ చేసుకొనే ప్రయత్నం చేయకుండా విమర్శలు చేయడం విడ్డూరం అని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం సిఎల్పి మీడియా సెంటర్‌లో మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ సొంత డబ్బా కొట్టుకున్నారేకానీ ధరణి పేరుతో రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసి వేల మంది రైతుల ఊసురుపోసుకున్న అంశంపై కనీసం పశ్చాత్తం కూడా చెందలేదని విమర్శించారు.పోలీస్ వ్యవస్థను పాడు చేయడంతోపాటు పోలీస్ స్టేషన్ల ను కార్యకర్తలకు కేంద్రంగా మార్చాడనీ ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఏ నాడు మొదటి తారీఖున జీతాలు ఇవ్వలేదనీ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేశాడనీ ఆవేదన చెందారు. కాళేశ్వరం తీసుకువచ్చి లక్ష కోట్ల ను గోదావరి వేశాడనీ పాలమూరు రంగారెడ్డిని నాశనం చేశాడనీ అన్నారు. నిరుద్యోగుల జీవితాలతో కెసిఆర్ ఆడుకున్నాడనీ చెప్పారు. రిటైర్ ఉద్యోగులకు 8000 వేల కోట్ల బకాయిలు పెట్టిపోయారనీ అన్నారు. అడ్డగోలు వడ్డీ రేట్లతో విచ్చలవిడిగా అప్పులు తెచ్చి ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేశాడనీ తెలిపారు. కెసిఆర్ హయాంలో 52 రోజుల ఆర్‌టిసి సమ్మె జరుగగా, 30 మంది కార్మికులు చనిపోయారనీ అన్నారు. కెసిఆర్ సమ్మె చేసే కార్మికులను బెదరించాడనీ, తమ ప్రభుత్వం రెండు రోజుల్లోనే ఆర్టీసీ కార్మికులతో మాట్లాడి సామరస్యంగా సమస్యను పరిష్కరించిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బిఆర్ఎస్ మళ్లీ రాదనీ ఆ విషయం తెలిసే కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో ఉంటున్నాడని అన్నారు. మళ్లీ గెలుస్తామన్న నమ్మకం ఉంటే కెసిఆర్ అసెంబ్లీకి వచ్చేవాడనీ అన్నారు. ప్రజల కోసం ప్రతిపక్ష పాత్ర పోషించాలని కెసిఆర్ అనుకోవడం లేదని అధికారం కోసమే ఆయన మాట్లాడుతున్నాడన్నారు.

## స్థానిక ప్రభుత్వాల ఆర్థికపుష్టితోనే దేశాభివృద్ధి

### స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

**హైదరాబాద్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** గ్రామీణ,పట్టణ స్థానిక సంస్థల పరిపుష్టి ద్వారానే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పంచాయతీ రాజ్, మున్సిపల్, విద్య, వైద్య శాఖల అధిపతుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 73వ,74వ రాజ్యాంగ సవరణల ప్రకారం స్థానిక సంస్థలకు బదలాయింపవలసిన నిధులు, విధులు సిబ్బంది కేటాయింపుల ప్రక్రియను సమగ్రంగా పరిశీలించేందుకు మే నెలలో నిజామాబాద్, వరంగల్, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లో ప్రాంతీయ కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు, మున్సిపల్ చైర్మన్‌లు, స్థానిక సంస్థల అధికా రులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని క్షేత్రస్థాయి సమాచారం అందించాలని కోరారు. ప్రతి జనవాసాలు, ప్రాదేశిక క్షేత్రంలో ఉండే క్షేత్రస్థాయి సమాచారం కమిషన్ నివేదికలో పొందుపరుస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు సంకెపల్లి సుధీర్‌రెడ్డి, మాలోతు నెహ్రూ నాయక్, మెంబర్ సెక్రటరీ పి. కాత్యాయనీ దేవి, ఎఎస్‌సిఐ డైరెక్టర్ బి. జనార్దన్ రెడ్డి సంబంధిత శాఖాధిపతులు పాల్గొన్నారు.

## తమిళనాడులో రెమ్యునరేషన్ వివాదం

### మే 2న సినిమా షూటింగ్ బంద్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** తమిళనాడులో సినిమా నిర్మాతలు, నటీనటులకు మధ్య వివాదం ఏర్పడింది. సినిమా బడ్జెట్లు అదుపు తప్పుతున్న వేళ, చిన్న సినిమాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న నేపథ్యంలో విప్లవాత్మక మార్పులు అనివార్యమని నిర్మాతల మండలి స్పష్టం చేస్తోంది. కేవలం పారితోషికాల విషయంలోనే కాకుండా, థియేట్రికల్, ఓటీటీ ఒప్పందాల విషయంలో కూడా పారదర్శకత కోరుతూ కీలక మార్పులు చేయబోతున్నారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమ తరహాలో స్ట్రీమింగ్ నిబంధనలను కఠినతరం చేస్తూ పరిశ్రమను కాపాడుకునేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో మే 2వ తేదీన తమిళనాడులో షూటింగ్‌లు బంద్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు తమిళ నిర్మాతల మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా మే 2న తమిళనాడులో సినిమా షూటింగ్ బంద్ నిర్వహించాలని తీర్మానించింది. అలాగే ఇకపై నటీనటులకు రెమ్యునరేషన్ ఇవ్వకూడదని, అయితే సినిమా లాభాల్లో రెవెన్యూ షేర్ ఇవ్వాలని ప్రతిపాదించింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమ తరహాలో కోలీవుడ్‌లోనూ సినిమా నిర్మాణాల విషయంలో మార్పులకు నిర్ణయం తీసుకుంది. కాగా గత కొద్ది రోజులుగా తమిళనాడులో నటీనటులు రెమ్యునరేషన్, ఓటీటీల గురించి తీవ్ర చర్చ నడుస్తోంది. ఓటీటీ, శాటిలైట్ వ్యాపారం పతనమవుతున్న తరుణంలో తెలుగు చలన చిత్ర పరిశ్రమలో నడుస్తున్నట్లే నటీనటులకు రెవెన్యు షేర్ విధానంలో తమిళనాడు నిర్మాతలకు ప్రాధాన్యమిచ్చి సినిమాల్లో నటించాలని, నిర్మాతల లాభనష్టాల్లో పాలుపంచుకోవాలని హీరోహీరోయిన్లను, సీనియర్ సాంకేతిక నిపుణులను కోరారు.

## తగ్గినట్టే తగ్గి పెరిగిన గుడ్ల ధర

### రూ.7కు ఒక్కో గుడ్డు విక్రయం

**హైదరాబాద్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** కొద్దిరోజులుగా తగ్గినట్లే తగ్గిన కోడి గుడ్ల ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లో కేవలం 15 రోజుల్లోనే గుడ్ల ధరలు భారీగా పెరిగాయి. ఒక్కో గుడ్డుకు రూ.3 మేర ధర పెరిగింది. దాదాపు రెండు వారాల క్రితం ఒక గుడ్డు ధర రూ.4 ఉండగా ఇప్పుడు రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.7 కి చేరింది. మరికొన్ని ప్రాంతాల్లో 8 రూపాయలకు సైతం అమ్ముతున్నారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా రిటైల్ కిరాణా దుకాణా లలో ధరలు ఒకే విధంగా ఉండగా హోల్‌సేల్ దుకాణాలు ఒక్కో గుడ్డును రూ. 6.30 చొప్పున అమ్ముతున్నాయి. అధికంగా కోళ్ల మరణాలు, ఉత్పత్తి తగ్గడం, డిమాండ్ పెరగడం వంటి కారణాలు గుడ్ల ధరలు వేగంగా పెరగడానికి కారణమని కోళ్ల పెంపకందారులు పేర్కొంటున్నారు. సంవత్సరంలోని ఇతర నెలలతో పోలిస్తే వేసవిలో మరణాల రేటు 30 శాతం ఎక్కువగా ఉంటుందని మరో పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. రాష్ట్రంలో కోళ్ల ఫారాలు రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధికంగా ఉన్నాయి. కాగా.. ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం కారణంగా ఎగుమతులు దెబ్బతినడంతో మార్చిలో గుడ్ల ధరలు తగ్గాయి. అయితే కోళ్ల మరణాలు, డిమాండ్ పెరగడంతో ముున్ముందు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని పౌల్ట్రీ యజమానులు పేర్కొంటున్నారు.

## జిల్లాలకు చేరిన 80 శాతం ఉచిత పాఠ్యపుస్తకాలు

### మే 10 నాటికి సరఫరా పూర్తి

### సేల్‌బుక్స్‌ను జూన్ 1 నాటికి మార్కెట్‌లోకి

### తెలంగాణ ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం డైరెక్టర్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలకు అవసరమైన ఉచిత పాఠ్యపుస్తకాల ముద్రణ పూర్తయింది. వాటిలో 80 శాతం పుస్తకాలను ఇప్పటికే జిల్లాలకు సరఫరా చేసినట్టు ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం డైరెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన విక్రయ(సేల్) పాఠ్యపుస్తకాల ముద్రణకు సంబంధించి ప్రతి సంవత్సరం మాదిరిగానే రానున్న 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి కూడా ముద్రణ, పంపిణీకి అవసరమైన అన్ని ముందస్తు చర్యలు ఇప్పటికి తీసుకోవడం జరిగిందని తెలిపారు. గత సంవత్స రం ఏప్రిల్ చివరి వారం లో టెండర్ల ప్రక్రియ పూర్త యిందని, వేసవి సెలవుల అనంతరం పాఠశాల లో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఈ యేడాది కూడా పాఠశా లలు పునఃప్రారంభమయ్యే జూన్ 1 నాటికి సేల్ పుస్తకాలను పూర్తి స్థాయిలో బహిరంగ మార్కెట్లో అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఉచిత పాఠ్యపుస్తకాల సరఫరా 2026-27 విద్యా సంవత్సరానికి పార్ట్-1 కింద మొత్తం 1.35 కోట్ల ఉచిత పుస్తకాలు అవసరం కాగా, వాటిలో ఇప్పటికే 1.09 కోట్ల (80 శాతం) పుస్తకాలను జిల్లా కేంద్రాలకు సరఫరా చేసినట్టు తెలిపారు. మిగిలిన పుస్తకాలను మే 10 నాటికి సరఫరా చేస్తామన్నారు.

రాష్ట్రంలో స్కూల్స్ రీఓపెన్ చేసే నాటికి ప్రతి విద్యార్థికీ అన్ని పాఠశాలల్లో పుస్తకాలు అందుబాటులో ఉంటాయని డైరెక్టర్ స్పష్టం చేశారు. పాఠ్యపుస్తకాల ముద్రణ, సరఫరా విషయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి అందరికీ పుస్తకాలు అందుబాటులో ఉంటాయని తెలంగాణ ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం డైరెక్టర్ స్పష్టం చేశారు.

## దూరవిద్య విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడండి

### సిఎం ప్రజావాణిలో విద్యార్థుల విజ్ఞప్తి

### న్యాయం చేస్తాం: చిన్నారెడ్డి భరోసా

**హైదరాబాద్ (బేగంపేట), ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**



సిఎం ప్రజావాణిలో చిన్నారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర విభ జన చట్టం 2014సెక్షన్ 95 ప్రకారం ఎపికి చెందిన ఆచార్య నాగార్జున యూని వర్సిటీ నిర్వహించిన దూర విద్యా విధానం ద్వారా వివిధ కోర్సు లు పూర్తి చేసుకున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన లక్షా ఇరవై నాలుగు వేల 524మంది భవిష్యత్‌ను కాపాడాలని కోరుతూ విద్యార్థులు మంగళవారం సీఎం ప్రజావాణీలో ఇంచార్జ్ డా.జి.చిన్నారెడ్డికి విజ్ఞప్తి చేసారు.రాష్ట్ర విభజన చట్ట ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఆయా యూనివర్శిటీల ద్వారా ఇరు రాష్ట్రాల్లో దూర విద్య విధానం ద్వారా విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించి వివిధ కోర్సులను పూర్తి చేసుకునే అవకాశాన్ని కల్పించాయని దాని ద్వారా డిగ్రీలు,పీజీలు పూర్తి చేసుకున్న తెలంగాణ విద్యార్థులకు 2021వరకు వివిధ శాఖల్లో ఉద్యోగాలు లభించాయన్నారు. 2022లో తెలంగాణా ఉన్నత విద్యా మండలి ఏపీకి చెందిన ఆచార్య నాగార్జున యూనివర్శిటీ దూరవిద్య ధ్రువపత్రాలు అంగీకరించమని చెప్పడంతో కోర్టును ఆశ్రయించామని, హైకోర్టు తీర్పు కూడా తమకు అను కూలంగా వచ్చినా ఉద్యోగ అవకాశాలలో నాగార్జున యూనివర్శిటీ దూరవిద్య ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకునే సమస్య లేదని చెప్పడంతో తెలంగాణా రాష్ట్రానికి చెందిన లక్షా 24వేల 524మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని విద్యార్థులు చిన్నారెడ్డికి వివరించారు.ఈ విషయంలో సీఎం ప్రజావాణీ ఇంచార్జ్,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి స్పందిస్తూ విద్యాశాఖ,పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థుల సమస్యను వారి దృష్టికి తీసికెళ్లారు.విధ్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని చిన్నారెడ్డి భరోసా ఇచ్చారు.

## రేవంత్‌రెడ్డి రావాలి.. ఇందిరమ్మ రాజ్యం నిలిచి ఉండాలి

### కుటుంబ గొడవలతో కవిత కొత్త పార్టీ.. ప్రజలు ఆమెను నమ్మరు

### యూరియా కొరతకు కేంద్రమే కారణం: ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలతో లబ్దిపొందుతున్న వారంతా మళ్లీ రేవంత్‌రెడ్డి రావాలంటున్నారని, ఇందిరమ్మ రాజ్యం తెలంగాణలో ఎప్పటికి నిలిచి ఉండాలని కోరుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిఎల్పి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ యూరియా కొరతకు కేంద్రప్రభుత్వం కారణమనీ ఇది తెలిసి కూడా బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రప్రభుత్వంను నిందించడం వారికితగదని ఆవేదన చెందారు. వరంగల్‌లో రైతుసభ పెడుతామని బిఆర్ఎస్ చెబుతోందని తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నందుకు పెడుతన్నారా అని ప్రశ్నించారు. వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో పంజాబ్ ను దాటేసింది. ఈ వానాకాలం సీజన్ లో 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా గతంలో ఎన్నడూ లేని విధంగా 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. సన్న వడ్లు పండించిన రైతులకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నామనీ తెలిపారు. గత సీజన్లో సన్నాలు అమ్మిన రైతులకు రూ.1939 కోట్ల బోనస్ చెల్లించామనీ తెలిపారు అన్ని సీజన్ల కలిపి 3 వేల కోట్ల కు పైగానే బోనస్ ఇచ్చామనీ ఆయన వివరించారు. కెసిఆర్ ఏ నాడైనా ఈ ఆలోచన చేశాడా..? వరివేస్తే ఉరి అని హెచ్చరించారని గుర్తుచేశారు. రైతు బంధు ఒక్కటి ఇచ్చి మేమే రైతు బాంధువులని చెప్పుకుని తిరిగాడనీ ఎద్దేవా చేశారు. బోనస్ తో రైతులు, కౌలు రైతులకు కనీసం ఎకరానికి 12 వేల రూపాయల అదనపు ఆదాయం అందుతోందనీ తెలిపారు. రైతులు సంతోషంగా ఉన్నారనీ చెప్పారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకాన్ని నిరాటంకంగా ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు.ఉచిత విద్యుత్తుకు ప్రతి ఏడాది దాదాపు రూ. 10, 444 కోట్లు సబ్సిడీగా చెల్లిస్తోందనీ అన్నారు. గత ఏడాది మార్చి, సెప్టెంబర్‌లో వడగండ్లు, వర్షాలతో నష్ట పోయిన 94,462 మంది రైతులకు రూ. 95.39 కోట్ల పరిహారం అందించిందనీ చెప్పారు. రాష్ట్ర మంతటా 1600 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను అమర్చామనీ అన్నారు. కేంద్రం నుంచి సహకారం లేకపోయినా రైతు పండించిన అన్ని పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందనీ చెప్పారు.రైతుల కోసం మా ప్రభుత్వం వచ్చాక ఈ 28 నెలల్లో ఏకంగా 1,52,656 కోట్ల రూపాయల రైతుల కోసం ఖర్చు చేశామనీ వివరించారు. రైతు భరోసా కింద ఈ సీజన్‌లో ఇప్పటి వరకు రూ5,653 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశామనీ తెలిపారు. ఇంట్లో గొడవలతో కవిత పార్టీ పెట్టిందని ప్రజలు ఆమెను నమ్మరని శ్రీనివాస్ వెల్లడించారు.

## ఇంటి పెద్ద మరణం కుటుంబానికి శాపమా!

### గూడు లేని జీవికి చావులోనూ తప్పని తిప్పలు

### మృతదేహాన్ని లోనికి తేనివ్వని అద్దె ఇంటి యజమానులు

**కరీంనగర్ బ్యూరో, ప్రభాతవార్త:** నేటి సమాజంలో మానవత్వం మంటగలుస్తోంది. ప్రాణాలతో ఉన్నప్పుడు అద్దె చెల్లిస్తూ ఆ ఇంట్లోనే గడిపిన వ్యక్తి, చనిపోయిన తర్వాత శవమైతే కనీసం లోపలికి రానివ్వని పరిస్థితి నెలకొంది.ప్రాణం ఉన్నంత వరకు నెలనెలా కిరాయి చెల్లిస్తూ, ఆ ఇంటిని తన గూడుగా భావించిన ఒక సామాన్యుడికి మరణానంతరం ఘోర అవమానం ఎదురైందితాజాగా కరీంనగర్ జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న చింతకుంటలోని గాంధీనగర్ లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. మూఢనమ్మకాలే శాపమా..? 'ఇంట్లో శవం ఉంటే దోషం పడుతుంది', 'తరువాత ఎవరూ అద్దెకు రారు', 'ఇంటికి అరిష్టం' వంటి అహేతుక కారణాలను సాకుగా చూపుతూ యజమానులు ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆరోప ణలు వినిపిస్తున్నాయి. కిరాయి దారుడి కుటుంబాన్ని ఓదార్చాల్సింది పోయి, మృతదేహాన్ని వీధిలో పెట్టిండని ఒత్తిడి తీసుకురావడం అమానవీయం. అంతేకాకుండా అంత్యక్రియలు జరిగిన అనంతరం అద్దె ఇంట్లోకి ఆ కుటుంబాన్ని అనుమతించకపోవడంతో స్మశాన వాటికలో వారు ఉండటం మానవత్వాన్ని ప్రశ్నిస్తుంది..నేటి సమాజంలో మానవత్వం మంటగలుస్తోంది. ప్రాణాలతో ఉన్నప్పుడు అద్దె చెల్లిస్తూ ఆ ఇంట్లోనే గడిపిన వ్యక్తి, చనిపోయిన తర్వాత శవమైతే కనీసం లోపలికి రానివ్వని పరిస్థితి నెలకొంది. చట్టం/నిబంధనలు: అద్దె చట్టాల ప్రకారం అద్దెదారునికి కొన్ని హక్కులు ఉంటాయి. మరణించిన సమయంలో కనీస గౌరవం ఇవ్వకుండా మృతదేహాన్ని అడ్డుకోవడం



నైతికంగానే కాకుండా, కొన్ని సందర్భాల్లో చట్ట పరమైన సమస్యలకు దారితీస్తుం ది. స్మశానంలో కుటుంబం: జిల్లాలోని కొత్తపల్లి మండలం చింతకుంట గాంధీనగర్ లో నివాసం ఉంటున్న గాండ్ల శ్రీకాంత్ ఆర్థిక సమస్యలతో వారంరోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న శ్రీకాంత్‌కు భార్య రూప ఇద్దరు ఆడపిల్లలు దక్షిత,షహారిక లు ఉన్నా రు. శ్రీకాంత్ చనిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిన ఆ కుటుం బాన్ని ఇంట్లోకి, ఇంటి యజమాని రానివ్వడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని అద్దెఇంట్లోకి రానివ్వక పోవడంతో, పద్మనగర్ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించి అక్కడే వారం రోజులుగా కుటుంబంకాలం వెల్లదిస్తుంది.బిక్కు బిక్కుమం టూ ఆ తల్లి, పిల్లలతో గడుపుతున్న ఆ సంఘటన సమాజాన్ని ఆలోచింపజేసేలా ఉంది.

## జూన్‌లో అంతర్జాతీయ వైద్య పర్యాటక కార్యక్రమం

### వివిధ దేశాల ప్రతినిధులకు ఆహ్వానం

### ఆరోగ్య, పర్యాటకశాఖ అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహా సమీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** జూన్‌లో హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం ఈవెంట్‌ను నిర్వహించనున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ తెలిపారు. ఈ ఈ ఈవెంట్‌కి వివిధ దేశాల ప్రతినిధులకు ఆహ్వానం పంపనున్నట్టు తెలిపారు. ఇకపై ఏటా కనీసం ఒక ఈవెంట్ నిర్వహించాలని నిర్ణ యించినట్టు మంత్రి తెలి పారు. వైద్య, ఆరోగ్య, పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో మంగళ వారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యానారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, ఆరోగ్యశాఖ, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సూచనలను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ఇకపై ప్రతి సంవత్సరం హైదరాబాద్‌లో కనీసం ఒక మెడికల్ టూరిజం ఈవెంట్‌ను నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని, ఇందుకు అనుగుణంగా ఈ ఏడాది జూన్‌లో మొదటి ఈవెంట్ నిర్వాహణకు ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ ఈవెంట్‌లో దేశ, విదేశీ వైద్య, ఫార్మా రంగ ప్రముఖులను భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు.



మెడికల్ టూరిజంలో ఉన్న ప్రైవేటు సంస్థలను సైతం ఈవెంట్‌లో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఆఫ్రికా, ఏసియా, మిడిల్ ఈస్ట్ తదితర కంట్రీస్ నుంచి ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. హైదరాబాద్‌లోని ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌తో పాటు.. నిమ్స్, టిమ్స్, ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ హాస్పిటళ్ల సందర్శనకు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు.

హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న 3 టిమ్స్ హాస్పిటల్స్‌లో ఇంటర్నేషనల్ పేషెంట్ సర్వీసెస్ విభాగాలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఒక్కో హాస్పిటల్‌లో 50 బెడ్లతో ఇంటర్నేషనల్ పేషెంట్స్ వార్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి వచ్చే పేషెంట్లతో ప్రభుత్వ హాస్పిటళ్లకు ఆదాయం సమకూరుతుందని, తద్వారా హాస్పిటళ్ల నిర్వాహణ మెరుగుపడి స్థానిక ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు.

## 'ప్రజాపాలన చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్న హరీశ్‌రావు'

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ప్రజాపాలనను ఓర్వలేక హరీష్ రావు విషం చిమ్ముతున్నారనీ విప్ బల్మూరి వెంకట్ ఒక ప్రకటనలో విమర్శించారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదనీ మీ చెప్పే మాటలు నమ్మకనేప్రజలు మిమ్మల్ని ఓడించారనీ తెలిపారు. హరీశ్ రావు మాట తీరు మార్చుకోకపోతే ప్రజలు తన్ని తరిమేసే పరిస్థితి వస్తుందనీ హెచ్చరించారు. హరీశ్ రావు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడనీ, సచ్చిపోయిన బిఆర్ఎస్ ను బతికించుకోవాలా...?అసలు బిఆర్ఎస్ రాష్ట్రంలో బతుకుతదా లేదా?లేకుంటే బిజెపిలోకైనా వెళ్లాలా?వద్దా?ఇలా దిక్కుతోచని స్థితిలో హరీశ్ రావు కొట్టుమిట్టాడుతున్నాడనీ ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఏం చేయాలో తోచక పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడనీ తెలిపారు.గత పదేళ్ల అధికారులతో మీరు అందరి ఫోన్లు ట్యాప్ చేయించాడనఈఅదే ధ్యాసతో ప్రజాప్రభుత్వం చేస్తోందని మతిలేని మాటలు మాట్లాడుతున్నారనీ అన్నారు. మీ సొంత కుటుంబసభ్యుల ఫోన్లు కూడా ట్యాప్ చేయించిన నీచమైన చరిత్ర మీది.మీ మరదలు కవితనే బయటకొచ్చి ఆరోపణలు చేస్తోందనీ ఆమె ఆరోపణలకు సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం లేదన్నారు.

## శిరాజ్‌ఖాన్ మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకురాలు శిరాజ్ ఖాన్ మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కలిగిన ఒక నాయకురాలు మరణం తీరనిలోటు అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 325

**హైదరాబాద్ (బేగంపేట), ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన 217వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 325దరఖాస్తులు అందాయి.వాటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 92 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 40 దరఖా స్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 106 దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 87 దరఖాస్తులు వచ్చాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్,ఏసీపీ ఉమేందర్, ఎన్ఆర్ఐ సలహా మండలి వైస్‌ఛైర్మన్ మంద భీంరెడ్డి, ప్రవాసీ ప్రజా వాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫుట్‌బాల్ మైదానంలో ఉగ్రవాదుల దాడులు

## 29 మంది అక్కడికక్కడే మృతి

**అబూజా, ఏప్రిల్ 28:** ఆఫ్రికా దేశం నైజీరియాలోని అడమావా రాష్ట్రం గుయాకు గ్రామంలోని ఫుట్‌బాల్ మైదానంలో ప్రజలు గుమిగూడి ఉండగా ఉగ్రవాదులు ఆకస్మిక దాడి చేశారు. విచక్షణారహితంగా కాల్పులు జరిపి ఇళ్లను, ప్రార్థనా మందిరాలను, మోటార్ సైకిళ్లను తగలబెట్టారు. కొన్ని



గంటల పాటు ఈ బీభత్సం జరిగింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 29 మంది చనిపోగా పలువురు గాయపడ్డారు. ఇక ఈ దాడికి పాల్పడింది తామేనని ఇస్లామిక్ స్టేట్ ఐఎస్ బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటిం చింది. దాడి వెనుక ఉద్దేశాన్ని మాత్రం వెల్లడించలేదు. రాష్ట్ర గవర్నర్ అహ్మదు ఉమారు ఫింటిరి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ దాడిని మానవత్వానికి అవమానంగా అభివర్ణించారు. ప్రజల భద్రత కోసం వెంటనే భద్రతా చర్యలను కట్టుదిట్టం చేస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రజలు భయంతో ఇళ్లను వదిలి వెళ్లిపోతున్నారని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కామెరూన్ సరిహద్దుకు సమీపంగా ఉన్న ఈ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా ఉగ్రవాద దాడులు తరచూ జరుగుతున్నాయి. ముఖ్యంగా బోకో హరామ్, ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ వంటి ఉగ్రవాద సంస్థలు హింసకు పాల్పడుతున్నాయి. 2009లో ప్రారంభమైన బోకో హరామ్ తిరుగుబాటుతో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు.

# జెన్కోకు ఐఎస్ఓ సర్టిఫికేషన్

## డిసిఎం భట్టి చేతుల మీదుగా అందుకున్న సిఎండి హరీశ్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** తెలంగాణ విద్యుత్ ఉత్పాదక సంస్థ జెన్కోకు ఐఎస్ఓ సర్టిఫికేషన్ లభించింది. ప్రతిష్టాత్మకమైన క్వాలిటీ మేనేజ్మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్‌ను సాధించింది. నాణ్యత, సామర్థ్యం, నిరంతర మెరుగుదల పట్ల చూపుతున్న కట్టుబాటుకు ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ సర్టిఫికేషన్‌ను హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఆధ్వర్యంలో జెన్కో చైర్మన్ సిఎండి హరీష్ అందుకున్నారు. ఒక స్వతంత్ర ఐఎస్ఓ ధృవీకరణ సంస్థ నిర్వహించిన సమగ్ర ఆడిట్ అనంతరం ఈ గౌరవం దక్కింది. ఈ తనిఖీల్లో భాగంగా ఆడిట్ బృందం జెన్కోలోని అన్ని విభాగాలు, కార్యకలాప విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ప్రధానంగా ఐఎస్ఓ పత్రాల అనుసరణ, విభాగాల వారీ పనితీరు, కార్యకలాపాల ప్రభావిత్వం, సంస్థ లక్ష్యాల సాధన, నాణ్యత నిర్వహణ వ్యవస్థల అమలును బృందం లోతుగా మూల్యాంకనం చేసింది. ప్రతి విభాగం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్తమ పద్ధతులను పాటిస్తోందని నిర్ధారించిన అనంతరం ఈ సర్టిఫికేషన్ మంజూరుకు ఆమోదం లభించింది.

# ఖర్గేతో ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ భేటీ



**హైదారబాద్, ఏప్రిల్ 28, ప్రభాత వార్త:** ఎఐసిసి అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గేను మంగళవారం ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ ప్రోటోకాల్ కోఆర్డినేషన్ చైర్మన్ హర్కర వేణుగోపాల్‌రావు మర్యాదపూర్వ కంగా కలిశారు. ఇటీవల ప్రోటోకాల్ చైర్మన్‌గా తిరిగి నియామకం చేసినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఖర్గేను పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు.

# మహిళా సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా గుంటిపల్లి రేణుక

**హైదరాబాద్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళా సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్‌గా గుంటిపల్లి రేణుక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో మహిళా సర్పంచ్‌ల సమావేశంలో మహిళా సర్పంచ్‌లంతా కలిసి రేణుకను కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామం సర్పంచ్‌గా రేణుక గెలుపొందారు. ఈ సారి తెలంగాణ పంచాయతీల్లో దాదాపు 50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకే దక్కాయి. రాష్ట్రంలో మొత్తం 12,703 గ్రామాల్లో 6403 మంది మహిళా సర్పంచ్‌లే ఉన్నారు.

# రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల పరిస్థితి ఆందోళనకరం

## బిజెపి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నాయని బిజెపి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో సుమారు రూ.150 కోట్ల విలువైన మందుల కొనుగోళ్లలో గోల్మాల్ జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఈ ఆరోపణ నిజమైతే, ఇందులో ఎవరు బాధ్యులు, ఎలా జరిగింది, ఎందుకు జరిగింది అన్న విషయాలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. ఒకవేళ ఇది అబద్ధ ప్రచారం అయితే, అదే విధంగా ప్రభుత్వం పూర్తి వివరాలతో ప్రజలకు వివరణ ఇవ్వాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహా ఈ విషయంపై తక్షణం స్పందించి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి ఎంతో దారుణంగా ఉంది. పేద, బడుగు వర్గాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులే ఒక్కటే ఆశ్రయం అయినప్పటికీ, అక్కడ కనీస సౌకర్యాలు కూడా లేవు. డాక్టర్ కూర్చుని పేషెంట్లను పరిశీలించడానికి సరైన గది కూడా లేకుండా కారిడార్‌లలోనే చికిత్స జరుగుతున్న పరిస్థితి ఉందని, స్ట్రెచర్ మీదనే ప్రిస్క్రిప్షన్లు రాయాల్సిన పరిస్థితి ఉందన్నారు. మందులు లేవు, గ్లౌజులు లేవు, సర్జికల్ మెటీరియల్ కొరత ఉంది, ఎక్విప్మెంట్స్ ఉన్నా వాటిని నిర్వహించే టెక్నీషియన్స్ లేరన్నారు. కొంతమంది పేషెంట్లు డెలివరీకి కూడా బయట నుంచి సామగ్రి కొనుక్కొని రావాల్సిన పరిస్థితి నేను ప్రత్యక్షంగా చూశానన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆసుపత్రులకు అవసరమైన నిధులు హెచ్‌డిఎస్, ఆరోగ్యశ్రీ, ఇతర వనరుల ద్వారా రావాల్సి ఉన్నప్పటికీ, ఆ నిధులు సమయానికి అందడం లేదన్నారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీకి ఇన్‌చార్జి కార్యదర్శి

**హైదరాబాద్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు పూర్తి కార్యదర్శిని నియమించకుండా ఇన్ ఛార్జిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా కృష్ణ ఆదిత్యను ప్రభుత్వం నియమించింది. అయితే సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు పూర్తికాలపు కార్యదర్శిని మాత్రం నియమించలేదు. కృష్ణ ఆదిత్యకే గురుకుల విద్యాలయాల సంస్థకు కార్యదర్శిగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించింది. కాగా రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఎస్సీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా సీతాలక్ష్మి ని ప్రభుత్వం నియమించింది. అనంతరం కొద్దినెలలకే ఆమె స్థానంలో అలుగు వర్షిణిని కార్యదర్శిగా నియమించింది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం

## 15 కార్పొరేషన్లలో కాషాయం పాగా..

**గాంధీనగర్, ఏప్రిల్ 28:** గుజరాత్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీలు ఇలా అన్ని ప్రాంతాల్లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యతను కనబరిచింది. బీజేపీ ధాటికి కాంగ్రెస్, ఆప్‌లు పత్తాలేకుండాపోయాయి. ఇదిలా ఉంటే, ఇప్పుడు ఒక విజయం మాత్రం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. గుజరాత్ గోధ్రాలో తొలిసారిగా, ముస్లిం మెజారిటీ ప్రాంతంలో ఒక హిందూ మహిళ గెలిచి రికార్డ్ క్రియేట్ చేసింది. గోధ్రా అల్లర్లు భారత చరిత్రలో అత్యంత దారుణమైన సంఘటన. గుజరాత్‌లో మత కల్లోలానికి దారి తీసింది. తరుచు గోధ్రా మత ఘర్షణలకు వేదికగా నిలిచింది. 2002 వరకు ఈ మత ఘర్షణలు కొనసాగాయి. ఇప్పుడు ఈ పరిస్థితి పూర్తిగా మారింది. గోధ్రాలోని 7వ వార్డు పూర్తిగా ముస్లిం మెజారిటీ ప్రాంతం, ఒక్క హిందూ ఓటర్ కూడా లేరు. అయినప్పటికీ, ఈ ప్రాంతం నుంచి సోనీ సామాజిక వర్గానికి చెందిన హిందూ మహిళ అపేక్ష సోనీ సంచలన విజయం సాధించారు. ఈ విజయంపై అపేక్ష మాట్లాడుతూ గోధ్రాలో అనేకసార్లు అల్లర్లు జరిగాయని, ఈసారి మాత్రం ముస్లిం సమాజం తనపై విశ్వాసం ఉంచారని చెప్పింది. గుజరాత్‌లో 15 మున్సిపల్ కార్పొరేషన్లు, 84 మున్సిపాలిటీలు, 34 జిల్లా పంచాయతీలు, 260 తాలూకా పంచాయతీలకు పోలింగ్ జరిగింది. మొత్తం 15 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగగా, అన్నింటిని బీజేపీ సొంతం చేసుకుంది. ఈ ఫలితాలు పట్టణ ప్రాంతంలో బిజెపి ఉన్న బలాన్ని మరోసారి స్పష్టం చేశాయి. ఇక ప్రతిపక్ష కాంగ్రెస్, ఆప్‌లు పత్తాలేకుండా పోయాయి. నామమాత్రపు పోటీ కూడా ఇవ్వలేదు. మొత్తం 1,044 సీట్లు గల 15 మున్సిపల్ కార్పొరేషన్లలో, బీజేపీ 856 సీట్లు కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకోగా, ఇతరులు 12 స్థానాల్లో విజయం



సాధించారు. అహ్మదాబాద్, సూరత్ కార్పొరేషన్లలో బీజేపీ సంచలన విజయాలను సాధించింది. అహ్మదాబాద్‌లోని 192 స్థానాలకు గానూ బీజేపీ 158 స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ 22 స్థానాల్లో గెలిచింది. ఇక సూరత్‌లో 120 స్థానాలు ఉంటే, బీజేపీ 115 స్థానాల్లో, ఆప్ 4 స్థానాల్లో గెలిచాయి. రాజ్‌కోట్, వడోదర, భావ్‌నగర్‌లలో బీజేపీ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంది. రాజ్‌కోట్‌లో 72 స్థానాలకు గానూ బీజేపీ 65, కాంగ్రెస్ 7 స్థానాలను గెలుచుకుంది. వడోదరలో 76 వార్డులకు గానూ బీజేపీ 69, కాంగ్రెస్ 6 వార్డుల్ని గెలుచుకుంది. భావ్‌నగర్‌లోని మొత్తం 52 వార్డులు ఉంటే బీజేపీ 44, కాంగ్రెస్ 8, ఆప్ ఒక స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. మధ్యతరహా పట్టణాల్లో కూడా కమలం తన జోరు చూపించింది. కర్మసాద్ ఆనంద్, గాంధీ దామ్, నడియాడ్, నవసారి పట్టణాలను బీజేపీ దాదాపుగా క్లీన్ స్వీప్ చేసింది. పోర్ బందర్, మోర్బి, సురేంద్ర నగర్, మొహసానా, వాపి, జామ్‌నగర్ కార్పొరేషన్లను కూడా బీజేపీ గెలుచుకుంది. 84 మున్సిపాలిటీల్లోని 2030 వార్డులు ఉంటే బీజేపీ 1791 గెలుచుకోగా, కాంగ్రెస్ 414 స్థానాల్లో, ఇతరులు 144 స్థానాల్లో విజయం సాధించారు. 34 జిల్లా పంచాయతీల్లో 1090 స్థానాలు ఉంటే బీజేపీ 568 స్థానాలను గెలుచుకోగా, కాంగ్రెస్ 77, ఇతరులు 30 స్థానాల్లో గెలిచారు. 260 తాలూకా పంచాయతీల్లో 5234 స్థానాలు ఉంటే బీజేపీ 2397 స్థానాలను దక్కించుకుంటే, కాంగ్రెస్ 591, ఇతరులు 329 స్థానాల్లో గెలిచారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పైనా ప్రత్యేక దృష్టి

## హైదరాబాద్ జిల్లా నేతలతో కెటిఆర్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్28:** హైదరాబాద్ జిల్లా పార్టీ ప్రజా ప్రతినిధులతో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం సమావేశమ య్యారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శ్రీమతి వాణిదేవి మరియు ఇతర నియోజకవర్గాల ఇంచార్జీలు, సీనియర్ నేతలు పాల్గొన్నారు. ప్రధానంగా ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరిట ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రతి నియోజకవర్గానికి అత్యంత కీలకమని, దీనిని పార్టీ శ్రేణులు సీరియస్ గా తీసుకొని పకడ్బందీ కార్యాచరణతో ముందుకు వెళ్లాలని కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు.

ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు నమోదు కాకుండా చూడాలని, ముఖ్యంగా కాంగ్రెస్ మరియు బిజెపి పార్టీలు ఇప్పటికే నమోదు చేసిన దొంగ ఓట్లను, డబుల్ ఓట్లను గుర్తించి వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కేటీఆర్ ఆదేశించారు. నగరంలో ఏ ఒక్క వ్యక్తి కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా పార్టీ తరఫున అండగా నిలవాలని, నూతన ఓటర్ల నమోదు ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు చొరవ చూపాలని ఆయన సూచించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఈ ఓటర్ల సవరణ కార్యక్రమ బాధ్యతలను మరియు పర్యవేక్షణను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యవేక్షి స్తారని కేటీఆర్ వెల్లడించారు.



జూపార్కులో కోతుల ఎన్‌క్లోజర్‌ను ప్రారంభిస్తున్న అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

# జూపార్కులో మంత్రి కొండా సురేఖచే కోతులు, అడవి కోళ్ల ఎన్‌క్లోజర్ల ప్రారంభం

**హైదరాబాద్ (చార్మినార్), ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కును సందర్శించారు. జూ పార్కు ప్రధాన ద్వారం వద్ద సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన విహార్ ఫుడ్ కోర్టు, కియోస్కో, లగేజి స్కానింగ్ మిషన్, వాట్సాప్‌లో టిక్కెట్ బుకింగ్ సౌకర్యం, జూపార్కు సిబ్బంది కోసం నగరంలోని నాంపల్లి కేర్ ఆసుపత్రి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ జూపార్కులోని ఎన్‌క్లో జర్లను తిలకించారు. జూ పార్కులో ఏర్పాట్లు చేసిన కోతులు, అడవి కోళ్ల ఎన్ కోజ్లర్లను మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. కొత్తగా జన్మించిన రెండు ఆఫ్రికన్ సింహాల పిల్లలకు ఆవని (ఆడ), ఇరా (ఆడ), రాయల్ బెంగాల్ టైగర్ పిల్లలకు ఇషాన్ (మగ), వన్య (ఆడ) అని మంత్రి నామకరణం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ జూ పార్కు బాగా అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. రాష్ట్ర అటవీశాఖ కార్యదర్శి మహ్మద్ నదీం, పిసిసిఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, పిసిసిఎఫ్ వినయ్ కుమార్, జూ పార్కు డైరెక్టర్ డాక్టర్. సునీల్ ఎస్. హీరేమత్, సిసిఎఫ్ క్షితిజ, జూ పార్కు క్యూరేటర్ జె.వసంత, డిఎఫ్ఓ బాజీరావ్ పాటిల్, డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ డాక్టర్ ఎంఎ హకీం, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్. పి. శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

# వర్సిటీలో 'అసాంఘికం'

## విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన

## విద్యార్థుల అరుపులతో ఫోన్ లాక్కొని పరారైన వ్యక్తి

## నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** కట్టుదిట్టమైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భద్రత కాలితాలకే పరిమితమవుతుంది. సెంట్రల్ యూనివర్సిటీ లోపలికి భద్రత పేరుతో ఇతరులెవరికీ, కనీసం మీడియాకు సైతం అనుమతి లేదంటూ ఓ వైపు వర్సిటీ యంత్రాంగం జీవోలు జారీ చేస్తుండగా, మరోవైపు తరచూ అసాంఘీక సంఘటనలతో వర్సిటీ వార్తల్లో నిలుస్తుంది. తాజాగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆవరణలో బయటి నుంచి వర్సిటీ లోపలికి ప్రవేశించిన ఓ వ్యక్తి వర్సిటీ లోపల ఉన్న ఇద్దరు విద్యార్థినులకు లిఫ్ట్ ఇచ్చే సాకుతో అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థినుల అరుపులతో అప్రమత్తమైన సదరు వ్యక్తి ఓ విద్యార్థిని చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. సంఘటన అనంతరం వర్సిటీ హాస్టల్‌లోనే ఉన్న నిందితుడిని విద్యార్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మొత్తం నలుగురిని అరెస్టు చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బిటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న భూక్యా నవీన్ వర్సిటీ ఆవరణలోని ఎల్ హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా నవీన్ స్నేహితులైన.. కూకట్‌పల్లిలో బీకాం రెండవ సంవత్సరం చదువుతున్న బి.శరత్‌బాబు, ఘట్‌కేసర్‌లో బిటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న ఏ.నవీన్, ఆటో డ్రైవర్ ఏ.చింటులు సెంట్రల్ యూనివర్సిటీకి వచ్చి నవీన్ హాస్టల్‌లో ఉంటున్నారు. వీరందరూ కలిసి రాత్రి క్యాంపస్ ఆవరణలోని నిర్మానుష్య ప్రదేశంలో మద్యం సేవించారు. అనంతరం వీరిలో ఒకరైన శరత్‌బాబు బైక్ తీసుకొని క్యాంపస్ రోడ్ల మీదకు వచ్చాడు. అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న ఓ పిహెచ్‌డీ విద్యార్థిని లిఫ్ట్ అడిగింది. దీంతో ఆమెను బైక్ ఎక్కించుకున్నాడు. ఇది గమనించిన పక్కనే ఉన్న మరో పిహెచ్‌డీ విద్యార్థిని సైతం లిఫ్ట్ అడుగడంతో ఆమెను సైతం బైక్ ఎక్కించుకున్నాడు. యూనివర్సిటీలోని సౌత్ క్యాంపస్ వైపు వెళ్తు మార్గమధ్యలో నిర్మానుష్య ప్రదేశంలో బైక్ ఆపిన శరత్‌బాబు ఇద్దరు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడు. భయాందోళనకు గురైన విద్యార్థినులు అరుస్తూ అక్కడి నుంచి పారిపోతుండగా, వారిని వెంబడించిన శరత్‌బాబు ఓ విద్యార్థిని చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కొని అక్కడి నుంచి పారిపోయాడు. బాధిత విద్యార్థినులు జరిగిన విషయాన్ని తోటి విద్యార్థులకు చెప్పడంతో విద్యార్థులందరూ కలిసి క్యాంపస్ మొత్తం జల్లెడపట్టారు. భూక్యా నవీన్ హాస్టల్ గదిలో శరత్‌బాబుతో పాటు నవీన్, చింటులు పట్టుబడడంతో విద్యార్థులు వీరిని పోలీసులకు అప్పగించారు. దీంతో గచ్చిబౌలి పోలీసులు అసభ్య ప్రవర్తన, దారి దోపిడీ కింద నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కాగా ఈ విషయం సెంట్రల్ యూనివర్సిటీలో సంచలనంగా మారింది. సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని, సెక్యూరిటీని కట్టుదిట్టం చేయడంతో పాటు సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఏబివిపి విద్యార్థులు ఆందోళన చేపట్టారు.

# అవినీతి, మనీలాండరింగ్ కేసులో పాక్ ప్రధాని షరీఫ్ కుమార్తె, అల్లుడికి బెయిల్ మంజూరు

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 28:** ప్రధాని షెహబాజ్‌షరీఫ్ కుమార్తెఅల్లుడుపై నమోదయిన అవినీతి, మనీలాండరింగ్‌కేసుకు సంబంధించి స్థానిక కోర్టు బెయిల్ మంజూరుచేసింది. షరీఫ్‌కుమార్ రబియా ఇమ్రాన్, ఆమె భర్త ఇమ్రాన్ యూసఫ్‌లు భారీ అవినీతి, మనీలాండరింగ్ అభియోగాలను ఎదుర్కొంటున్నారు. ఈ కేసును విచారించిన జడ్జి అఫ్షక్ అహ్మద్ త దంపతుల బెయిల్ పిటిషన్లను అనుమతించారు. అంతేకాకుండా ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఎలాంటి చర్యలు తీసుకోరాదని, అరెస్టులు చేయకూడదని ఆదేశించింది. వచ్చేనెల 7వ తేదీవరకూ ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని వెల్లడించారు. దంపతులిద్దరూ వ్యక్తిగతంగా తమ న్యాయవాదితోకలిసి కోర్టుకు హాజరయ్యారు. కేసులో అరెస్టును తప్పించుకునేందుకే వీరిద్దరు 2022లో యుకెకకు వెళ్లిపోయారు. ఈకేసు విచారణకోసమే తాజాగా ఇస్లామాబాద్ వచ్చిన వీరు స్వయంగా కోర్టుకు హాజరయ్యారు.

# సహజీవన భాగస్వామి హత్య

## ఆగ్రహంతో ప్రియుడిపై దాడి

# పొట్టిగుట్ట తండాలో జంటహత్యలు

**హైదారబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని పొట్టిగుట్ట తండాలో సహజీవనం చేసే మహిళ మాట్లాడటంలేదని ఆమె సహజీవనభాగస్వామి పారతో కొట్టి చంపినట్లు ఎసిపి శ్రీనివాస్ తెలిపారు. పొట్టిగుట్ట తండాకు చెందినపాతులోతుకవితను ఆమెతో సహజీనం చేసే చందూరు మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన లకావత్ ఆనంద్ మంగళవారం హత్యచేశారు. పొట్టిగుట్ట తండాకు చెందిన కవితకు చందూర్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు సంతానం. పదేళ్ల క్రితం భర్త చనిపోయాడు. దీంతో అదే గ్రామానికి చెందిన లకావత్ ఆనంద్ (39)తో ఆమె కొన్నేళ్లుగా సహజీవనంలో ఉంది. ఇటీవల మనస్పర్థలు రావడంతో.. ఆమె అతడికి దూరంగా ఉంటోంది.

దీంతో కోపం పెంచుకున్న అతడు.. ఆమెపై పారతో దాడి చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న మహిళ కుటుంబసభ్యులు.. అతడిపై దాడి చేశారు. దీంతో అతడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం పొట్టిగుట్ట తాండాలో జంట హత్యలుచందూర్ మండలం మేడిపల్లి తండా కు చెందిన లకవత్ ఆనంద్‌తో పాత్లోత్ కవిత కు 5 సంవత్సరాలుగా కొన సాగుతున్న సహా జీవనం. కవిత భర్త లేకపోవడంతో ఆనంద్ తో సహజీవనం చేస్తున్న కవిత. కవిత కూతురు పెద్దది కావడంతో ఆనంద్ ను దూరం ఉంచుతున్న కవిత.

అది భరించలేక పొట్టిగుట్ట తండాలో కవితపై పారతో దాడి చేసిన ఆనంద్. కవిత అక్కడే మృతిఆగ్రహించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనంద్‌ను వెంటాడి దాడి చేయడంతో ప్రాణాపాయ స్థితి ఏర్పడింది. ఆనంద్ ను అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు.

# ఇంధన కొరత నివారణకు పౌర సరఫరాల శాఖ ప్రత్యేక చర్యలు

## ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్..

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్రోల్, డిజిల్ కొరతను తీర్చేందుకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ రంగంలోకి దిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో నిల్వలు అయిపోకముందే వాటికి ఇంధనం చేరేలా అధికారులు పర్యవేక్షణను పెంచారు. ప్రతి మూడు గంటలకోసారి బంకుల నుంచి నిల్వల వివరాలు తెప్పించుకోవడంతోపాటు ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షి స్తున్నారు. ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పెట్రోల్, డీజిల్ అందేలా చూడాలని ఆదేశాలుజారి చేశారు. దీంతో పంట కోతలు, ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో మంగళవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా రోజువారి డీజిల్ పంపిణీ 151శాతం పెరిగి పంపిణీ 7,348 కిలో లీటర్ల నుంచి 18,449 కిలో లీటర్లకు పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ పంపిణీ కూడా దాదాపు రెట్టింపు అయ్యింది. ఇది 95శాతం పెరిగి 5,883 కిలో లీటర్ల నుంచి 11,490 కిలో లీటర్లకు చేరుకుంది. రాజధాని హైదరాబాద్ పరిధిలో ఎలాంటి కొరత రాకుండా ఉండేందుకు ఇంధన సరఫరాను 43శాతం మేర పెంచారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఏమాత్రం లేదని పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితోపాటు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హామీ ఇచ్చారు. కాగా.. రాష్ట్రంలో ఇందన కొరతకు పౌరసరఫరాలశాఖ మూడు ప్రధాన కారణాలను పేర్కొంది. అందులో మొదటిది.. పరిశ్రమలకు వాడే డీజిల్ ధరను ఇటీవల లీటరుకు రూ. 150 కు పెంచడంతో పెద్ద మొత్తంలో కొనే వ్యాపారులు లీటరు రూ. 95 కే దొరుకుతున్న సాధారణ పబ్లిక్ పెట్రోల్ బంకులకు వచ్చి డీజిల్ కొంటున్నారు. రెండవది పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో సరఫరా సమస్యలుఉండడంతో పక్క రాష్ట్రాల ప్రజలు పెట్రోల్, డీజిల్ కోసం ఖమ్మం, నిర్మల్ లాంటి తెలంగాణ సరిహద్దు జిల్లాలకు క్యూ కడుతున్నారు.

# రాష్ట్రంలో యేడాదికి 2.5 లక్షల ఉద్యోగాల సృష్టి

## ఐదేళ్లలో 12.59 లక్షల కొత్త కొలువులు

## ఉపాధి వృద్ధిలో టాప్‌లో హైదరాబాద్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** కొత్త ఉద్యోగాల సృష్టిలో తెలంగాణ దూసుకుపోతోంది. సంవత్సరానికి సగటున 2.5 లక్షల చొప్పున ఐదేళ్లలో మొత్తంగా 12.59 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో 2021-22లో 42,82,977గా ఉన్న ఉద్యోగాల సంఖ్య 2025-26 నాటికి 55,42,709కి పెరిగింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రధాన్ మంత్రి వికాసిత్ రోజ్‌గార్ యోజన అనుసంధానిత డేటా ఆధారంగా ఈ గణాంకాలు రూపొందించబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా అధికారిక ఉపాధి స్థిరంగా విస్తరిస్తోందని, ముఖ్యంగా ఇటీవలి నెలల్లో ఈ విస్తరణ గణనీయంగా పెరిగిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

గత ఐదేళ్లలో సృష్టించబడిన మొత్తం ఉద్యోగాలలో, 3.12 లక్షల ఉద్యోగాలు కేవలం గత ఎనిమిది నెలల్లోనే ఏర్పడ్డాయి. ఇది నియామకాల కార్యకలాపాలు, ఆర్థిక వేగంలో పెరుగుదలను సూచిస్తోంది.

ఈ ఉపాధి వృద్ధికి హైదరాబాద్, దాని పొరుగు జిల్లాలైన రంగారెడ్డి, మెడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి ప్రధానంగా నిలిచాయి.

మొత్తం చేర్పులలో 98 శాతం వాటాను అందించాయని ఈపీఎఫ్ఓ డేటా వెల్లడిస్తోంది. ఇక రాష్ట్ర ఆర్థిక కేంద్రమైన హైదరాబాద్‌లో, ఈపీఎఫ్ఓ అనుబంధ ఉద్యోగాల సంఖ్య 2021-22లో 24,15,288 నుండి 2025-26 నాటికి 31,39,220కి పెరిగింది అంటే 7,23,932 ఉద్యోగాల గణనీయమైన పెరుగుదల నమోదైంది. ఇదే కాలంలో రంగారెడ్డి జిల్లాలో ఉపాధి గణాంకాలు 7,40,666 నుండి 11,43,910కి పెరిగి, 4,03,244 ఉద్యోగాల పెరుగుదలను ప్రతిబింబిస్తూ, ఆకట్టుకునే వృద్ధి నమోదైంది.

# గ్రామీణ క్రికెటర్ల ప్రోత్సాహానికి 'టిజి-20 క్రికెట్'

## కొత్తలీగ్‌కు శ్రీకారం చుట్టిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్

## జూన్-జూలైలో తొలి సీజన్ ప్రారంభం

**హైదరాబాద్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** తెలంగాణ బిడ్డల ఆట పల్లెల్లోనే ఆగిపోకుండా.. వారిని అంతర్జాతీయస్థాయికి చేర్చేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నడుం బిగించింది. ఇందులో భాగంగా హెచ్‌సిఏ 'టిజి-20' లీగ్ పేరుతో ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ ను నిర్వహించబోతుంది. ఇందులో భాగంగా బుధవారం పార్క్ హయాత్ హోటల్‌లో టిజి20 టోర్నీ లోగో ఆవిష్కరించనుంది.




ఈలీగ్ ప్రతిభావంతులైన ఎందరో తెలంగాణ క్రికెట్ క్రీడాకారులకు తమ ప్రతిభను పరిచయం చేసుకునే చక్కటి అవకాశం కల్పిస్తూ దేశీయ క్రికెట్‌కు కొత్త దిశను చూపించనుందని హెచ్.సీ.ఏ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

రూట్ లెవల్ నుంచి ప్రొఫెషనల్ స్టేజ్ వరకు తెలంగాణ మట్టిలోని మాణిక్యాలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ లీగ్ ను రూపొందించినట్టు తెలిపారు. బిసిసిఐ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా స్థాయి ఆటగాళ్లను "ఇండియన్ ప్రీమియర్ లీగ్" వంటి ఉన్నత స్థాయి వేదికలకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

హెచ్.సీ.ఏ. చేస్తున్న ఈ ప్రయత్నానికి ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ ప్రక్రియకు కార్పొరేట్ వర్గాల నుంచి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. తొలి సీజన్ జూన్-జూలై 2026లో ప్రారంభం కానుందని మ్యాచ్ షెడ్యూల్ జట్ల వివరాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

### ఈ క్రికెట్‌టోర్నీ జరిగే విధానం..

ఈ టిజి-20 లీగ్ వివిధ ఫ్రాంచైజీలకు చెందిన 8 జట్లు.. రౌండ్‌రోబిన్-ప్లేఆఫ్ పద్ధతిలో 32 మ్యాచ్‌లు ఆడతాయి. అన్ని మ్యాచ్‌లు ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్‌లను చూసేందుకు వచ్చే ప్రేక్షకులకు ఉత్సాహభరితమైన వాతావరణం ఉండేలా వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

# వాంఖడేలో గర్జించేదెవరు?

## వరుస విజయాలతో సన్‌రైజర్స్ జోరు * హోం అడ్వాంటేజ్‌గా ముంబై

**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్-2026లో భాగంగా నేడు వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తల పడనున్నాయి. వరుసగా నాలుగు విజయాలతో జోరు మీదున్న ఆరెంజ్ ఆర్మీ... అయిదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌ను దాని సొంత గడ్డపై ఓడించి పాంచ్ పటాకా సాధిండంపై ఫోకస్ పెట్టింది. నిలకడలేని ఆరంభం లభించినా.. ఆ తర్వాత వేగంగా పుంజుకుంది. టాప్ ఆర్డర్ మొత్తం పరుగుల వేటలో ఉండడంతో వరుసగా నాలుగు విజయాలతో జోరు మీదికొచ్చింది. ఇదే ఫామ్‌ను కొనసాగించి టాప్ ఫోర్‌లో తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని ఆరెంజ్ ఆర్మీ లక్ష్యంగా ఉంది. మరోవైపు తొలి మ్యాచ్ గెలుపు తర్వాత అనూహ్యంగా పరాజయాల బాట పట్టిన ముంబై ఇండియన్స్.. ఏడు మ్యాచ్‌లలో కేవలం రెండు విజయాలతో పాయింట్లపట్టికలో తొమ్మిదో స్థానంలో ఉంది. సొంత ప్రేక్షకుల ముందు పుంజుకుని, ఈ సీజన్‌లో తమ మూడో విజయాన్ని నమోదు చేయాలని ముంబై ఉవ్విళ్లూరుతోంది.

ప్రస్తుతం ముంబై ఇండియన్స్ జట్టు నిరాశజనక ప్రదర్శనలతో తీవ్ర ఒత్తిడిలో ఉంది. టీ20 ప్రపంచ కప్ జట్టులోని నలుగురు కీలక ప్లేయర్లు ముంబై ఇండియన్స్ టీమ్‌లో ఉన్నా... గత మ్యాచ్‌లో సీఎస్‌కే చేతిలో 103 పరుగుల తేడాతో ఓడింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా(3 వికెట్లు, 97 రన్స్) బ్యాటింగ్, బౌలింగ్‌లో విఫలమవుతుండగా, సూర్యకుమార్(110)సాదరణ ప్రదర్శన చేస్తున్నాడు. గుజరాత్ టైటాన్స్‌పై సెంచరీతో ఫామ్‌లోకి వచ్చిన తిలక్ వర్మపైనే ఆశలు పెట్టుకుంది. జస్‌ప్రీత్ బుమ్రా(2 వికెట్లు) కూడా బౌలింగ్‌లో తేలిపోతున్నాడు. ట్రెంట్‌బౌల్ట్, దీపక్ చాహర్ కూడా విఫలమవుతున్నారు. రోహిత్ శర్మ ఈ మ్యాచ్ బరిలోకి దిగితే ముంబై బ్యాటింగ్‌కు బూస్టింగ్ లాంటిది.

ఇక జైపూర్‌లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ విధ్వంసం సృష్టించినా... భారీ స్కోరును సన్‌రైజర్స్ ఛేధించడం ఆజట్టులో నూతనోత్తేజాన్ని నింపింది. ఫామ్ అందుకున్న అభిషేక్ ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలతో 54.28 సగటుతో 212.29 స్ట్రైక్ రేట్‌తో 380పరుగులతో టాప్‌లో ఉన్నాడు. అభిషేక్, హెడ్(186) మరోసారి శుభారంభం అందిస్తే...ఆతర్వాతవచ్చే ఇషాన్(312), హెన్రిచ్ క్లాసెన్ (349) బ్యాట్ ఝుళిపిస్తే భారీ స్కోరు ఖాయం. యువ పేసర్ల ప్రఫుల్, సాకిబ్‌లకు తోడు కెప్టెన్ పాట్ కమిన్స్ జతకూడడంతో సన్‌రైజర్స్ బౌలింగ్ డిపార్ట్‌మెంట్... ప్రత్యర్థి జట్లను హడలెత్తించే స్థాయికి మారింది.





### హెడ్ టు హెడ్

ఇరు జట్లు ఇప్పటివరకు ముఖాముఖిగా 25 సార్లు తలపడగా... ముంబై డామినేట్ చేసింది. ముంబై ఇండియన్స్ 15 సార్లు, సన్‌రైజర్స్ 10 సార్లు గెలుపొందాయి. చివరిసారి తలపడినపుడు ముంబై ఇండియన్స్ విజయం సాధించింది.

### పిచ్ రిపోర్ట్

వాంఖడే పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. చిన్న బౌండరీలకు తోడు బంతి బ్యాట్‌పైకి చక్కగా వస్తుంది కాబట్టి వాంఖడేలో పరుగుల వరద పారే అవకాశం ఉంది. బౌలర్లకు ఇది సవాలుతో కూడిన మైదానం. వారు వికెట్ల కోసం కష్టపడాల్సి ఉంటుంది. కట్టుదిట్టమైన లైన్, లెంగ్త్‌తో బౌలింగ్ చేయడం కీలకం. లేదంటే బ్యాటర్లకు భారీగా మూల్యం చెల్లించాల్సి ఉంటుంది.

### జట్ల వివరాలు(అంచనా)

**ముంబై ఇండియన్స్:** డికాక్, నమన్, సూర్య కుమార్, హార్దిక్(కెప్టెన్), తిలక్ వర్మ, రూథర్ ఫోర్డ్, విల్ జాక్స్, బుమ్రా, భగత్, గజన్‌ఫర్, అశ్వనీ ; **ఇంపాక్ట్ ప్లేయర్:** రోహిత్ శర్మ

**సన్‌న్‌రైజర్స్ హైదరాబాద్:** అభిషేక్, ఇషాన్, క్లాసెన్, సలీల్, అనికేత్ వర్మ, నితీష్ కుమార్, కమిన్స్ (కెప్టెన్), శివంగ్, సాకిబ్,ప్రఫుల్, ఎషాన్ మలింగ; **ఇంపాక్ట్ ప్లేయర్:** ట్రావిస్ హెడ్.

## పంజాబ్ జైత్రయాత్రకు రాజస్థాన్ రాయల్స్ బ్రేక్




**ముల్లన్‌పూర్:** ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర ఎట్టకేలకు బ్రేక్ పడింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్.. 223 రన్స్ టార్గెట్‌ను మరో నాలుగు బంతులుండగానే 4 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఆరు వికెట్ల తేడాతో నెగ్గి పంజాబ్‌కు తొలి ఓటమి రుచి చూపింది. రాయల్స్ ఇన్నింగ్స్ ధాటిగా ఆరంభమైంది. అర్షదీప్ తొలి ఓవర్‌లో సిక్స్‌తో పరుగుల ఖాతా తెరిచిన వైభవ్(16 బంతుల్లో 43, 3 ఫోర్లు, 5 సిక్స్‌లు)... ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ ఫోర్లు బాదాడు. ఫెర్గ్యూసన్ ఓవర్లో 4, 6, 4... జెన్సన్ ఓవర్లో సిక్స్.. అర్షదీప్ ఓవర్లో సిక్స్ సాధించాడు. ఆ తర్వాతి బంతికే శ్రేయస్ అద్భుత క్యాచ్‌తో అవుటయ్యాడు. ఆ తర్వాత జైస్వాల్ జోరు పెంచాడు. అదే ఓవర్లో 4, 6, 4 సాధించాడు. కేవలం 27 బంతుల్లో 51రన్స్ చేవాడు. జురెల్16), రియాన్ పరాగ్29) విఫలమైనా.. ఫెరీరా(26 బంతుల్లో 52 నాటౌట్, 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుభమ్ దూబే (12 బంతుల్లో 31 నాటౌట్) మెరుపులు మెరిపించారు. పంజాబ్ బౌలర్లప విరుచుకుపడ్డారు. ఫెరీరా విన్నింగ్ షాట్ సిక్స్‌తో రాయల్స్ విజయాన్ని పూర్తి చేశాడు.

అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు చేసింది. ఎప్పటిలాగే ప్రియాన్ష్ ఆర్య(11 బంతుల్లో 29), ప్రభ్‌సిమ్రాన్(44 బంతుల్లో 59) ఫ్లయింగ్ స్టార్ట్ అందించగా... కూపర్ కన్నోలీ(14 బంతుల్లో 30), శ్రేయాస్ అయ్యర్(27 బంతుల్లో 30) రాణించారు. తొలి వికెట్‌కు 37 రన్స్, రెండో వికెట్‌కు 59 రన్స్, మూడో వికెట్‌కు 48 రన్స్‌ను ప్రభ్‌సిమ్రాన్ జోడించాడు. స్లాగ్ ఓవర్లలో స్టోయినిస్(22 బంతుల్లో 62 నాటౌట్) ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోశాడు. ముఖ్యంగా బ్రిజేష్ వేసిన చివరి ఓవర్లో వరుసగా 4, 6, 6, 4, 4 సాధించాడు. స్టోయినిస్ మొత్తంగా 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో ఈ స్కోరు సాధించాడు. ఆర్ఆర్ బౌలర్లలో యష్‌రాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు.







## ఊబర్ కప్ నుంచి భారత్ ఔట్

**డెన్మార్క్:** ఊబర్ కప్ బ్యాడ్మింటన్‌లో భారత్ సవాల్ ముగిసింది. థామస్ కప్‌లో పురుషుల జట్టు క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కించుకుంటే... పీవీ సింధూతో కూడిన మహిళల టీమ్ చతికిలపడింది. గ్రూప్-ఏలో చైనా చేతిలో 0-5తో వైట్‌వాష్ అయింది. ఎన్నో ఆశలతో డెన్మార్క్‌కు వెళ్లిన భారత బృందం నిష్క్రమించింది. ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధూతో పాటు అందరూ చేతులెత్తేశారు.

సింగిల్స్‌లో పీవీ సింధూ మరోసారి చైనా హార్డిల్‌ను అధిగమించడంలో విఫలమైంది. మూడు సెట్ల హోరాహోరీ పోరులో చైనాకు చెందిన వాంగ్ జియి చేతిలో ఓడింది. తొలి సెట్ 16-21తో ఓడినా.. రెండో సెట్‌లో సింధూ అద్భుతంగా పుంజుకుంది. 21-19తో నెగ్గి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లోనూ సింధూ పోటాపోటీగా పాయింట్లు సాధించింది. అయితే కీలక దశలో ఒత్తిడికి లోనై పొరపాట్లు చేయడంతో ఆ సెట్ 19-21తో చేజారింది. దీంతో తప్పక గెలవాల్సిన డబుల్స్‌లో ప్రియా కొంజెంగ్బమ్-శృతి మిశ్రా జోడీ... చైనా ద్వయం లీ షెంగ్ షూ - టాన్ నింగ్ చేతిలో ఓడింది. మరో డబుల్స్‌లో ట్రిసా జాలీ-కవిప్రియ జోడీ కూడా ఓటమి పాలయింది. రివర్స్ సింగిల్స్‌లో ఇషారాణి, దేవికా సిహగ్ ఓటమితో భారత జట్టు టోర్నీ నుంచి వైదొలిగింది.

ఈ ఓటమితో గ్రూప్-ఎలో భారత్ ఏకైక విజయంతో మూడోస్థానంలో నిలిచింది. చైనా మూడు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో టాప్ ప్లేస్‌తో, అతిథ్య డెన్మార్క్ 3 మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, ఒకదాంట్లో ఓటమితో రెండోస్థానంలో నిలిచాయి. గ్రూప్-ఎ నుంచి టాప్ టూ జట్లు చైనా, డెన్మార్క్ క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించింది. చైనా చేతిలో 5-0తో, డెన్మార్క్ చేతిలో 3-2తో ఓడిన భారత్... ఉక్రెయిన్‌పై 4-1తో నెగ్గి టోర్నీ నుంచి ఇంటిదారి పట్టింది. థామస్ కప్‌లో ఇప్పటికే క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకున్న భారత పురుషుల జట్టు... చివరి మ్యాచ్‌లో చైనాతో తలపడనుంది.



## రెజ్లింగ్ సమాఖ్య అడ్డుకుంటోంది: వినేశ్ ఫోగట్

**ఢిల్లీ:** భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ సంచలన వ్యాఖ్యలు చేసింది. రెజ్లింగ్‌లోకి రీఎంట్రీ ఇవ్వకుండా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా... తనను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని వాపోయింది. నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 30వరకు ఉన్నా... పోర్టల్‌లో గడువు ముగిసినట్లు చూపెడుతోందన్నారు. దీనిపై రెజ్లింగ్ సమాఖ్యను సంప్రదిస్తే సరిగ్గా స్పందించడం లేదని వినేశ్ ఫోగట్ పేర్కొంది. ఏషియన్ గేమ్స్, ప్రపంచ చాంపియన్‌షిప్ వంటి సెలెక్షన్ ట్రయల్స్‌లో పోటీలో ఉండాలంటే ఈ టోర్నమెంట్ తనకు ఎంతో కీలకమైందని తెలిపింది. మరోవైపు వినేశ్ ఆరోపణలను రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు సంజయ్ సింగ్ ఖండించారు. వినేశ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న స్క్రీన్ షాట్‌ను బయటపెట్టారు. ఇప్పటివరకు దాదాపు 800 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఎవరికి ఎలాంటి సమస్య రాలేదన్నారు. వినేశ్ ఫోగట్ టోర్నీలో పాల్గొనకుండా తామెవరం అడ్డుకోవడం లేదని స్పష్టం చేశారు.




## ఐదునెలల కనిష్టానికి...
## పారిశ్రామిక ఉత్పత్తిరంగ వృద్ధి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** తయారీరంగంలో వృద్ధిమందగించడం, ఇంధనరంగంలో ఉత్పత్తి తగ్గడం, పశ్చిమాసియా సంక్షోభం వంటి వాటితో భారత పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి ఐదునెలల కనిష్టానికి చేరింది. మార్చి నెలలో 4.1 శాతంగా మాత్రమే ఉన్నట్లు కేంద్ర ఆర్థగణాంక శాఖప్రకటించింది. అదే గత ఏడాది ఇదే మార్చిలో 3.9 శాతంగా ఉంది. పారిశ్రామిక ఉత్పత్తివృద్ధి ఫిబ్రవరి నెలకుగాను 5.1శాతం వరకూ వృద్ధిని నమోదుచేసింది. గత ఏడాది అక్టోబరులో అత్యంత కనిష్టస్థాయి అంటే 0.5 శాతానికి పారిశ్రామిక ఉత్పత్తి పడిపోయింది. మార్చినెలలో కూడా 4.3శాతంగా ఉందని, ఏడాది క్రితం చూస్తే నాలుగుశాతం మాత్రమే ఉన్నట్లు ఎన్ఎస్ఒ వెల్లడించింది. గనుల రంగంలో ఉత్పత్తి 5.5శాతానికి మెరుగుపడింది. విద్యుత్ ఉత్పత్తి స్వల్పంగా ఉంది. ఏడాదిక్రితం 7.5శాతం ఉంటే ఈ ఏడాది మార్చిలో కేవలం 0.8శాతం మాత్రమే వృద్ధినమోదుచేసింది. పూర్తి సంవత్సరానికిగాను పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి నిలకడగా 4.1శాతంగామాత్రమే ఉంది. అంతకు ముందుసంవత్సరం నాలుగుశాతంతో పోలిస్తే కొంతమేర మెరుగుపడిందని ఎన్ఎస్ఒ తెలిపింది. ఉత్పత్తిరంగంలో ప్రధానంగా దేశంలో ఉన్న కీలక 23 పారిశ్రామికగ్రూపుల్లోని 14గ్రూపుల పరిశ్రమలు సానుకూల వృద్ధిని నమోదుచేసాయని కూడా వివరించింది. బేసిక్ మెటల్స్ 8.6శాతం, మోటార్‌వాహణ ఉత్పత్తి, ట్రెయిలర్లు, సెమిట్రైలర్లు 18.1శాతం, భారీ యంత్రాలు, యంత్రసామగ్రి 11.2శాతం వృద్ధిని నమోదు చేసినట్లు తెలిపింది. ఎంఎస్ శ్లాబులు, అల్లాయ్‌స్టీల్, హెచ్ఆర్ కాయిల్స్, ఇనుప శ్లాబ్‌రేకులు కూడా కొంతమేర వ1దిదనమోదుచేసింది. వర్గీకరణలో ప్రైమరీ గూడ్స్‌పరంగా 173.3పాయింట్లు, భారీ యంత్రాల కేటగిరీలో 156.2, ఇంటర్మీడియేట్‌గూడ్స్‌లో 181.4, మౌలికవనరులు, నిర్మాణరంగ ఉత్పత్తులపరంగా 229 పాయింట్లుగా ఉంది. వినియోగరంగ వస్తువులు146.2, కన్స్యూమర్‌నాన్ డ్యూరబుల్స్ 150.6 పాయింట్లతో కొంత మెరుగుపడినట్లు కేంద్ర అర్థగణాంకశాఖ వెల్లడించింది.

## డాలర్ వర్సెస్ రూపాయి 94.56

**ముంబయి, ఏప్రిల్ 28:** డాలరుతో రూపాయి మారకం విలువలు 41 పైసలు క్షీణించి 94.56గా ట్రేడింగ్ ముగిసింది. మంగళవారం ముడి చమురు ధరలు పెరగడంతో విదేశీ మూలధన నిధులు కూడా మార్కెట్లనుంచి ఎక్కువ విత్‌డ్రా కావడం వంటి చర్యలకకు డాలర్ చెల్లింపులు పెరిగి విదేశ ఈకరెన్సీకి డిమాండ్ పెరిగింది. దీనితో రూపాయి మారకం విలువలు గణనీయంగా క్షీణించాయి. విదేశీ కరెన్సీ ట్రేడర్లు అంచనాల ప్రకారం ఇప్పటికే రూపాయి భారీగా క్షీణించిందని, దీనివల్ల దేశ కరెంటు ఖాతాలోటు కూడా పెరుగుతుందని, మూలధన నిధుల్లో కూడా హెచ్చు తగ్గులు చోటుచేసుకుంటాయని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటివరకూ విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మొత్తం 19 బిలియన్ డాలర్ల పెట్టుబడులను భారతీయ ఈక్విటీ మార్కెట్లనుంచి విత్‌డ్రాచేసుకున్నారు.




ఇంటర్‌బ్యాంకు ఫారిన్ ఎక్స్ఛేంజి మార్పిడి పరంగాచూస్తే రూపాయి 94.35వద్ద ప్రారంభం అయి 94.58 వద్దకు ఇంట్రాడేలో ట్రేడింగ్ జరిగింది. క్షీణించిన విదేశీ పెట్టుబడులవల్లనే రూపాయి మరింత పతనం అయినట్లు తెలుస్తోంది. భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగిన కారణంగా విదేశీ నిధులు మార్కెట్లక రావడం తగ్గింది. ముడిచమురుదరలు 2.62శాతంపెరిగాయి.

బ్యారెల్‌కు 111.07 డాలర్లుగా ట్రేడింగ్ కొనసాగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గితే బ్యారెల్‌కు 85 నుంచి 90డాలర్లవరకూ కొనసాగవచ్చని తేలింది. 2027 ఆర్థికసంవత్సరంలో 92-93 మధ్యరేంజ్‌లో ఉంటుందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ ఆర్థికవేత్త రజనిసిన్హా అంచనావేసారు. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లపరంగా చూస్తే రూ. 1151.48 కోట్లు విత్‌డ్రాచేసారు. ముడి చమురు ధరలు మరింత పెరిగితే రూపాయీ మరింత క్షీణించక తప్పదన్న అంచనాలు కూడా కొందరు ట్రేడింగ్ నిపుణులు చెపుతున్నారు.

## రూ.3034కోట్ల ఆస్తులు ఇడి జప్తు

**ముంబై, ఏప్రిల్ 28:** రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ బ్యాంకు ఫ్రాడ్ కేసులో సుమారు రూ. 3034 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపుకు చెందిన సుమారు 19,344 కోట్లు అటాచ్ చేశారు. అటాచ్ చేసిన ప్రాపర్టీల్లో ముంబైకి చెందిన ఉషా కిరణ్ బిల్డింగ్, ఖండాలాలోని ఫార్మ్‌హౌజ్, అహ్మదాబాద్‌లోని సనాంద్‌లో ఉన్న భూమి ఉన్నాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు చెందిన 7.71 కోట్ల విలువైన షేర్లను కూడా జప్తు చేశారు. అనిల్ అంబానీకి చెందిన రైస్ ట్రస్ట్ ఆధీనంలో ఆ గ్రూపు ఉన్నది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఏర్పడిన సిట్ బృందం రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపు కేసులను విచారిస్తున్నది. మనీల్యాండరింగ్‌తో పాటు నిధుల మళ్లింపు, బ్యాంక్ నిధుల దుర్వినియోగం కోణంలో కేసు విచారణ జరుగుతున్నది. ఎస్బీఐ, పీఎన్బీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సీబీఐ కేసులు నమోదు చేసింది. ఆ కేసులపై ఈడీ దర్యాప్తు చేస్తున్నది. ఆర్‌కామ్‌తో పాటు ఆ గ్రూపు కంపెనీలు దేశీయ, విదేశీ కంపెనీల నుంచి రుణాలు తీసుకున్నది, ఆ మొత్తం విలువ సుమారు 40,185 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు.




## బంధన్ లాభం 534.13 కోట్లు

**ముంబయి, ఏప్రిల్ 28:** ప్రైవేటు రంగంలోని బంధన్ బ్యాంకు నాలుగోత్రైమాసికంలో నికరలాభాలు 68శాతంపెరిగాయి. నాలుగో త్రైమాసికంలో బ్యాంకు లాభం రూ.534.13 కోట్లు సాధించినట్లు వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలంలో కేవలం రూ.317 కోట్లు ఆర్జించింది. నికరవడ్డీ ఆదాయం కూడా 1.4 శాతం పెరిగి రూ.2800 కోట్లుగా ఉంది. ఇదే గత ఏడాది రూ.2760 కోట్లుమాత్రమే ఆర్జించింది. స్థిరాస్థి ప్రమాణాలుకూడా మెరుగుపడ్డాయి. స్థూల నిరర్థక ఆస్తులు 3.33 శాతంనుంచి 3.27శాతానికి తగ్గాయి. అయితే నికర నిరర్థక ఆస్తులు రూ.4804.99 కోట్ల నుంచి 5019.55 కోట్లకు పెరిగాయి. స్థూల అడ్వాన్సులు 13శాతం పెరిగి రూ.1.54 లక్షల కోట్లకు చేరాయి. డిపాజిట్లు 10శాతం పెరిగి రూ.1.66 లక్షల కోట్లుగా ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది. రిటైల్ డిపాజిట్లు 46శాతంపెరిగాయి.

గృహ మంత్రాలయ
भारत सरकार

మన జనాభా లెక్కలు
మన అభివృద్ధి

(జనాభా గణన 2027 మొదటి దశ)
స్వీయ గణన (SE) పై సాధారణ ప్రశ్నలు మరియు వాటి సమాధానాలు (భాగం-2)

స్వీయ గణన అంటే ఏమిటి?
స్వీయ గణన అనేది ఒక ఆన్‌లైన్ ప్రక్రియ. దీనిలో మీరు గణన అధికారి కోసం వేచి ఉండకుండా, SE పోర్టల్ (se.census.gov.in)లో మీ కుటుంబ వివరాలను మీరే స్వయంగా పూరించి సమర్పించాలి.

స్వీయ గణన వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?
- వివరాలను సౌకర్యవంతంగా పూరించండి గోప్యతను నిర్ధారిస్తుంది
- జనాభా గణన ప్రక్రియను వేగవంతం మరియు సమర్థవంతంగా చేస్తుంది

స్వీయ గణన పోర్టల్‌లోకి ఎలా లాగిన్ అవ్వాలి?
- రాష్ట్రం/UTని ఎంచుకోండి
- కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ మరియు ఇమెయిల్ (ఐచ్ఛికం) నమోదు చేయండి
- OTP ద్వారా ధృవీకరించండి
- స్వీయ-గణనను ప్రారంభించండి

మీ ఇంటి సరైన స్థానాన్ని ఎలా గుర్తించాలి?
- జిల్లా/పిన్ కోడ్‌ని ఎంచుకోండి
- ప్రాంతం/ల్యాండ్‌మార్క్‌ని నమోదు చేయండి
- మ్యాప్‌పై జూమ్ చేసి, మీ ఇంటికి సమీపంలోని ప్రదేశాన్ని గుర్తించండి (ఖచ్చితమైన చిరునామా కనిపించకపోయినా చింతించకండి)
- సరైన ప్రదేశాన్ని గుర్తించడం అవసరం

నేను నా సమాచారాన్ని తర్వాత సవరించవచ్చా?
- అవును, స్టేట్/UT SE పీరియడ్ సమయంలో తుది సమర్పణకు ముందు మీరు సవరించవచ్చు.
- తుది సమర్పణ తర్వాత, గణన అధికారి సందర్శన సమయంలో మార్పులు చేయవచ్చు.

SE పోర్టల్‌ను భారతదేశం వెలుపల నుండి యాక్సెస్ చేయవచ్చా?
- లేదు, ఈ సౌకర్యం భారతదేశ భౌగోళిక సరిహద్దుల్లో మాత్రమే అందుబాటులో ఉంది.

సమర్పించిన తర్వాత లోపం కనుగొనబడితే ఏమి చేయాలి?
- గణన అధికారి మీ ఇంటికి వచ్చినప్పుడు సవరణ చేయవచ్చు.

నేను ఫారమ్‌ను సేవ్ చేసి తర్వాత పూర్తి చేయవచ్చా?
- అవును, మీరు పురోగతిని సేవ్ చేసుకొని, నిర్దేశించిన సమయంలోగా ఫారమ్‌ను పూర్తి చేయవచ్చు.



CBC 19108/13/0044/2627

టోల్ ఫ్రీ - 1855

మన బాధ్యతను నెరవేరుద్దాం, జనాభా గణనలో పాల్గొందాం
CensusIndia2027

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.